సంగీత మేరు శిఖరాలు
రూ॥ 120/-
పేజీలు: 138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



భారతదేశ ఆర్థిక వృద్ధి.. ప్రపంచ విశ్వాసానికి మూలం 07
వరద భయం వేళ... టిబెట్‌లో భూకంపం
బర్త్ టూరిజంపై ట్రంప్‌నకు మళ్ళీ కోర్టు షాక్! 08



సంపుటి 09, సంచిక: 275 | శుక్రవారం | 04-09-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## 6న కేబినేట్ విస్తరణ ?

మంత్రులుగా మహేష్ కుమార్ గౌడ్, గడ్డం ప్రసాద్ కుమార్, రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ !



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. ఈ నెల 6వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం గురువారం పలు అంశాలకు ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు కూడా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. లోక్‌భవన్ వేదికగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలవడం అందుకు బలం చేకుర్చుతున్నది. మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు లేఖను సిఎం గురువారం మధ్యాహ్నం గవర్నర్‌కు పంపారు. సాయంత్రం సిఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ బర్తరఫ్ లేఖను గవర్నర్ ఆమోదించారు. సిఎం రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగిస్తున్నట్లు, ఈ నిర్ణయం వెంటనే

తరువాయి 8లో

## మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్



ముఖ్యమంత్రి సిఫారసును ఆమోదించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా



### రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి డాక్టర్ చిన్నారెడ్డి తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలపై కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలిగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదముద్ర వేయడంతో సురేఖను బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సురేఖ స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో, ఆమెను కేబినెట్ నుంచి తొలిగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు

తరువాయి 12లో

## బర్తరఫ్ ఖండిస్తున్నా..

- నా వివరణ తీసుకోకుండానే నిర్ణయం తీసుకున్నారు
- నేను ఏ తప్పు చేయలేదు... అవమానంగా భావించను
- ప్లాన్ 'బి' ఏమీ లేదు – కాంగ్రెస్‌లోనే కొనసాగుతా
- మీడియా సమావేశంలో కొండా సురేఖ

తనను మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని బ్లాక్ మెయిల్ చేశారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు ముఖ్యమంత్రి లేఖ పంపిన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సాయంత్రం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏమిటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా

తరువాయి 8లో

### రాష్ట్ర ప్రణాళికా సంఘం కొత్త ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, 'కుడా' చైర్‌పర్సన్‌గా సుధారాణి



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డేవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా జి.సుధారాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ

తరువాయి 12లో



## ఓల్డ్ సిటీ కాదు.. 'ఒరిజినల్ సిటీ'

చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులివ్వలేదని విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

గత సర్కార్ చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సకాలంలో నిధులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. ఈ ప్రాంతమంతా ఓల్ సిటీ కాదని... ఇది ఒరిజినల్ సిటీ అని కొనియాడారు. ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజలు ఇసి, మూసీ నది నీళ్లు తాగేవారని, హైదరాబాద్‌కు విదేశీయులు ఎవరు వచ్చినా

తరువాయి 8లో



'శుద్ధీకరణ'కోట్లాది మంది

## మనోభావాలతో ముడిపడి ఉంది

- బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చర్యలు తీసుకోండి
- జెపి నడ్డాకు మల్లికార్జున ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ :** హల్ద్వానిలో గత నెలలో తాను నిర్వహించిన ర్యాలీ స్థలంలో చేపట్టిన 'శుద్ధి' కార్యక్రమం అంటరానితనం చర్య వంటిదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని ఆదేశించాలని రాజ్యసభ సభ నాయకుడు జె.పి. నడ్డాను కోరారు. రాజ్యసభలో తాను ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు, విచారణ అనంతరం దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఖర్గే తన లేఖలో నడ్డాకు గుర్తు చేశారు. 'ఆగస్టు 8, 2026న హల్ద్వానిలో జరిగిన నా బహిరంగ సభ తర్వాత, అంటరానితనానికి సంబంధించిన 'శుద్ధి' వ్యవహారంపై ఆగస్టు 13, 2026న రాజ్యసభలో నేను ఎంతో బాధతో, ఆవేదనతో ప్రస్తావించిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది'

తరువాయి 12లో

## వెయ్యోంతుల ఉత్సాహం

- కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి
- గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. టిపిసిసి తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, బ్యాండ్ బాజాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు మాట్లాడుతూ గత పదేళ్ల పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నమన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్‌యూనివర్సిటీతో పాటు మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తీవ్ర వాతావరణ ప్రమాదంలోకి ప్రపంచ దేశాలు

- ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- 70 ఏళ్ళలో లేనంత ఎల్‌నినో ప్రభావం
- చైనాకు ఒక్క ఏడాదిలో ఏడు తుఫానులు
- కొన్ని ప్రాంతాల్లో కరువు, మరికొన్నిచోట్ల కార్చిచ్చు, తుఫానులు
- ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుంది : డబ్ల్యుఎంఓ
- పనామా కాలువలో నౌకల రవాణా తగ్గింపు




**న్యూయార్క్ :** ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రపంచ దేశాలు తీవ్ర వాతావరణ ప్రమాద దశలోకి ప్రవేశించాయని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ గురువారం హెచ్చరిక జారీ చేశారు.ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఓ)తాజా సమాచారాన్ని విడుదల చేసింది. గడచిన 70 సంవత్సరాలలో ఎన్నడూలేనంత తీవ్ర ఎల్‌నినో దశ 2027 ఫిబ్రవరి వరకూ అంతకుమించి కొద్ది నెలలపాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని డబ్ల్యుఎంఓ తన అంచనాలను ప్రకటించింది. గత ఏడాది డిసెంబరు నుండి 2026 జులై నాటికి సముద్ర ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ ఎల్‌నినోవల్ల కొన్ని ప్రాంతాలు బలమైన కరువులోకి జారుకుంటాయని, మరికొన్ని ప్రాంతాలు బలమైన తుఫానులు,వరదలను ఎదుర్కొంటాయని, కొన్ని ప్రాంతాలలోని అడవుల్లో కార్చిచ్చు చెలరేగుతుందని పేర్కొంది. మానవ సమాజం తప్పిదాలవల్ల వాతావరణంలో వేడితోపాటు ఎల్‌నినోవల్ల అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రత గణనీయంగా పెరుగుతుందని తాజా సమాచారం తెలియజేసింది. "మన కళ్ళముందే ఎల్‌నినో ప్రమాదం ముంచుకువస్తోంది,శాస్త్రీయ పరిశోధనలు అన్నీ కళ్ళెదురుగా కనిపిస్తున్నాయి,మన భూగ్రహంమీద ఎన్నడూచూడని విధంగా సముద్ర జలాలు లోతుల్లో కూడా వేడెక్కుతున్నాయి" అని ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు.ముందస్తు హెచ్చరిక వ్యవస్థను అన్నివిధాలుగా,అన్ని రంగాలలోనూ అప్రమత్తం చేసినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బలహీన వర్గాలపై ఈ ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా

తరువాయి 8లో

### శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

03



## నీతూబాయి ఇంటిపై ఇడి పంజా

నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలతో భారీగా సొమ్ము కూడబెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయి వ్యవహారంపై

తరువాయి 12లో

బిఆర్‌ఎస్ హయాంలో కేవలం దరఖాస్తులే

## ప్రజా పాలనలో స్మార్ట్ రేషన్‌కార్డులు




రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/ఎండపల్లి

బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకునేవారని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన వారి అందజేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల కొరకు గ్రామానికి వచ్చిన నాయకులకు దరఖాస్తు చేసుకునే వారని అన్నారు. 2023లో మార్పు కోరుకొని ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికి స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఉమ్మడి వెల్గటూర్ మండల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం తో పాటు ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు.మండలంలో ఐటిఐ ఏర్పాటు చేస్తున్నామని ఎండపల్లి మండలంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పాసిగాం గ్రామంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు ధర్మపురిలో అందుబాటులో ఉంటూ బాధ్యత మర్చిపోకుండా అందరి సమస్యలు తీర్చు తున్నానని మంత్రి

తరువాయి 12లో

'నల్సార్' విద్యార్థులపై చర్యలు

## ఆ అధికారం మీకెక్కడిది ?




- 'బిసిఐ'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- విద్యాసంస్థలదే నిర్ణయాధికారమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** న్యాయశాస్త్ర విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ), రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు ఎలాంటి చట్టబద్ధమైన అధికారం లేదని, విద్యార్థులపై వారి సొంత నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారం విద్యాసంస్థలదేనని గురువారం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చి (నల్సార్) యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులు 2026 మందిలో ఎవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్రస్థాయిలో వివాదాస్పదమైంది. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) పాల్గొనడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

తరువాయి 12లో

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు అంకురార్పణ

మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్, రాష్ట్ర ప్రణాళికా కమిషన్ ఉపాధ్యక్ష పదవినుంచి వనపర్తికి చెందిన సీనియర్ నాయకుడు జి.చిన్నారెడ్డి ఉద్వాసనతో 15–20 రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్‌లో పొడచూపిన అసంతృప్తి, అసమ్మతి గణాలపై గురువారం క్రమశిక్షణ కొరడా ఝుళిపించింది కాంగ్రెస్ అధిష్టానవర్గం. వారిరువురూ ఎఐసిసి సభ్యులు కావటంవల్ల రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం నివేదిక అందిన తదుపరి అధిష్టానవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తదితరులతో చర్చించి నిర్ణయం తీసుకుంది. తన వాదనను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు వినిపించేందుకు తనకుతానుగా ఢిల్లీ వెళ్లిన సురేఖ ఖర్గేతోపాటు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌నేగాక కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ సోనియాగాంధీని కూడా కలుసుకున్నారు. రాహుల్‌గాంధి, కె.సి. వేణుగోపాల్‌ను కలుసుకునే అవకాశం లభించలేదు. ఆగస్టు 19న కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల సందర్భంగా గీసుకొండలో ఆమె కూతురు సుశ్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు చేయటం వివాదానికి అగ్గి రాజేసింది. మంత్రిగా ఉన్న సురేఖ తల్లిగా స్పందించారేగాని మంత్రివర్గ సహచరిగా తమ ముఖ్యమంత్రిపై కూతురు దూషణలను, దుర్భాషలను ఖండించలేదు. దాదాపు పాతికమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సురేఖ కుమార్తె నోటిదురుసును తల్లి ఖండించకపోవటాన్ని తప్పు పట్టారు. ఆమెపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. కొండా సురేఖ వాదన ఆరోజు నుంచి బుధవారం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టివరకు ఒకటే – 'నా కుమార్తె స్వతంత్రురాలు. ఆమె అభిప్రాయాలు ఆమె సొంతం. మాకు సంబంధం లేదు. ఆమె వ్యాఖ్యలకు నన్నెలా శిక్షిస్తారు' అనేదే. తన బిడ్డ 'రేవంత్‌రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయి...ఆయన అయ్య, తాత ఎవడైనా రానీ...లాంటి బజారు మాటలతోపాటు, అవినీతి ఆరోపణలు చేయటం ఆమెకు తప్పుగా అనిపించలేదు. అందుకే వాటిని ఆమె ఖండించలేదు. బుధవారం ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేతో చర్చల అనంతరం ఆమె తనకు పదవీ గండం తప్పదని గ్రహించినట్లున్నారు – అందుకే బెదిరింపు ప్రకటన చేశారు. తన తొలగింపునకు కుట్ర జరుగుతోందని అంటూ 'నేను బిసి మహిళను, నేను పద్మశాలీ – తెలంగాణలో 16శాతం ఉన్నారు. నా భర్త మున్నూరు కాపు' అంటూ మహిళ, బిసి, కులం కార్డులు తీశారు. అధిష్టానవర్గం గురువారం ఆమె బర్తరఫ్‌కు సిఎంకు అనుమతించాక మరీ చిత్రంగా మాట్లాడారు. 'కాంగ్రెస్ అధిష్టానవర్గం నా పట్ల సానుభూతితోనే ఉంది. అయితే రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేశారు – సురేఖను తొలగించకపోతే నేను తొలగుతా' అని అన్నారట! ఆమె పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఆయన అభిమానురాలిగా మండలాధ్యక్షపదవితో రాజకీయ జీవితం ప్రారంభించిన సురేఖ ఆయన మరణానంతరం కొంత కాలం జగన్మోహన్‌రెడ్డితో ప్రయాణించారు. తర్వాత బిఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. రేవంత్‌రెడ్డితో ఘర్షణ పడటానికి ఆమె తన మనసులోని బాధను బయటపెట్టారు. 'నా బిడ్డ 10 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీకి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తోంది. కడియం శ్రీహరి తన బిడ్డను ఎంపిని చేసుకున్నారు. డి.ఎస్. ఇంట్లో రెండు పార్టీలున్నాయి, అరవింద్ బిజెపిలో ఉన్నారు' అన్నారు. తన బిడ్డ పోటీ చేయాలనుకుంటున్న పరకాల నుంచి వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలని ఆ నియోజకవర్గ పర్యటనలో ముఖ్యమంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేయటం సురేఖ కూతురు సుశ్మిత ఆగ్రహానికి హేతువైంది. అందుకే పచ్చ కాంగ్రెస్ (టిడిపిలో నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులను ఉద్దేశించి) అని ఆమె దూషించారు. టిడిపి రక్తం ప్రవహించేవారే అటువంటి నిర్ణయా లు తీసుకోగలరని సురేఖ తాజాగా వ్యాఖ్యానించారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ప్రకటిస్తుండటం, అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించటం క్రమశిక్షణ ఉల్లంఘన కాదా అని ఆమె ఫిర్యాదు చేశారు.

కొండా సురేఖ అంచనా రెండు విషయాల్లో తప్పింది. బిడ్డపై ప్రేమతో ముఖ్యమంత్రితో ఢీ కొనటం మొదటి తప్పు. రెండు, కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ కాబట్టి ముఖ్యమంత్రినే కాదు, అధిష్టానవర్గం నేతలను దూషించినా పెద్దగా పట్టించుకోరన్న ధీమా. రాహుల్‌గాంధీ జమానాలో కాంగ్రెస్‌లో కనీస క్రమశిక్షణ పాటించేటట్లు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ఆమే కాదు, చిన్నారెడ్డి కూడా గ్రహించలేదు. కర్నాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న వ్యక్తి డి.కె.శివకుమార్ మంత్రివర్గంలో ఉండగా అతనిపై గత కాలపు పనులకు అవినీతి ఆరోపణలు రాగా, పార్టీ అధిష్టానవర్గం ఆయన చేత రాజీనామా చేయించింది. ఇదంతా నెలరోజులలోపే జరిగింది. చిన్నారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డితో వైరం ఉంది. అతడు డబ్బిచ్చి పార్టీ టిక్కెట్ తెచ్చుకున్నాడని ఆరోపించారు. అది అధిష్టానానికి పరోక్షంగా తగిలింది. ఆ ఎమ్మెల్యే ఢిల్లీ దాకా వెళ్లి ఫిర్యాదు చేశాడు. ముఖ్యమంత్రిపై పరోక్ష విమర్శలు, ఆరోపణలతో పదవులకోసం ఒత్తిడి చేసేవారు మరికొందరున్నారు. సురేఖ, చిన్నారెడ్డిపై అధిష్టానవర్గం చర్య, క్రమశిక్షణ హద్దులు దాటి పార్టీ ప్రతిష్టకు హానిచేసేవారు ఎంతటివారైనా చర్య తప్పదని హెచ్చరిస్తున్నది. కొండా సురేఖ ప్రయోగించిన బి.సి. మహిళ, తమ భార్యాభర్తల కులం కార్డులకు ముఖ్యమంత్రి దీటైన సమాధానం ఇచ్చారు. బిసి మహిళ గుండు సుధారాణి (మాజీ ఎంపి)ని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, హైదరాబాద్ మాజీ మేయర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మి ని (మున్నూరుకాపు) ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, గౌడ మహిళ నేరెళ్ల శారదను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నియమించారు. ఈ మొత్తం ఉదంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థానాన్ని పటిష్టం చేసుకున్నారు. ●



## శాంతి స్థాపనకు భారత్ సిద్ధం

అంతులేకుండా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు, రెండు దేశాల మధ్య శాంతి స్థాపనకు భారత్ సిద్ధంగా ఉంది. శాంతి స్థాపనలో ఏ రకమైన సహాయం చేయడానికైనా భారత్ సిద్ధంగా ఉంది. అయితే, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది రెండు దేశాలే. ఈ విషయంపై ఉక్రెయిన్ మంత్రితో జరిగిన చర్చల్లో ఇదే ప్రధానమైన అంశం. యుద్ధం కొనసాగేకొద్దీ ప్రతి రోజూ ప్రాణాలు పోతూనే ఉంటాయి. విధ్వంసం జరుగుతూనే ఉంటుంది.

– కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్




## అడవులు, వన్యప్రాణుల రక్షణ మన బాధ్యత

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష, జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను కొనసాగించని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:** మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ జలం, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. ప్రముఖ వన్యప్రాణి పక్షపాతి 'స్టీవ్ ఇర్విన్' సేవలకు గుర్తుగా నిర్వహించుకోవాలని 'కెల్లీన్ పైజ్' ప్రతిపాదించడంతో ఈ దినోత్సవం కొనసాగుతున్నది.

**జాతీయ వన్యప్రాణుల దినోత్సవం:** నేటి జీవజాతుల్లో దాదాపు ఒక మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయనే భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస పేర్కొనడం విశేషం. 2005 నుంచి పాటిస్తున్న జాతీయ వన్యప్రాణుల దినోత్సవం–2026 సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ, జీవజాతులను అంతరించిపోకుండా చూడడం లాంటి అంశాలను తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

**జాతీయ వన్యప్రాణుల దినోత్సవ వేదికగా చేయదగిన కార్యక్రమాలు:** జాతీయ వన్యప్రాణుల దినోత్సవం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తూనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు, పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ ప్రధాన విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాల్పడితే రేపటితరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. జీవవైవిధ్య దీపాన్ని కాపాడుకుంటూ మన గృహమైన భూగ్రహాన్ని చక్కదిద్దుకుందాం.

*(04 సెప్టెంబర్ జాతీయ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా)*

# ఆరేండ్ల ఆదిత్యపై ప్రభుత్వానికి కోపం దేనికి?



మేరుగు రాజయ్య
9441440791

నేటి యువతను, పిల్లలను 'జన్ జడ్, 'జెన్ ఆల్ఫా'తో పోల్చుతున్నారు. వీరిని భవిష్యత్తుకు మార్గదర్శకులుగా పేర్కొంటున్నారు. జన్ జడ్ అంటే? 1997 నుండి 2012 మధ్య కాలంలో పుట్టినవారు. దాదాపు 12 నుండి 16 ఏండ్ల వయస్సులో ఉన్నవారు. వీరు చిన్ననాటి నుండి ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియాలో మొదటి సామాజిక తరంగాలను ఉపయోగించుచున్నారు. ఇక జన్ ఆల్ఫా అంటే? 2010 నుండి 2025 మధ్య జన్మించారు. వీరి జీవితంలో స్క్రీన్‌లు, స్మార్ట్ డివైస్, ఇంటర్నెట్ సహజ భాగమైనవి. కాని ఆరేండ్ల పిల్లవాడిగా మీడియాలో వైరల్ అయిన బీహార్ రాష్ట్రానికి చెందిన 'ఆదిత్య కుమార్' ఇంటర్నెట్ ను వినియోగించుకునే ఆర్థిక స్థితిలో లేడు. తండ్రి రంజిత్ కుమార్ దినసరి కూలి. తల్లి మున్నీ కుమారి ఇంటి పనుల కార్మికురాలు. ఒక్కగది ఇంటిలో నివసిస్తారు. ఆదిత్య కుమార్ నాలుగవ తరగతి చదువుతున్నాడని, లెక్కలు, ఇంగ్లీష్, హిందీ పాఠ్యాంశాలతో పాటు ఇతర పుస్తకాలను, భారత రాజ్యాంగాన్ని బాగా చదువుతాడని తెలిసింది. 2026 ఆగస్ట్ 25న డాక్ బంగ్లా చౌక్ దగ్గర జరుగుచున్న నిరసనల్లో పాల్గొనేందుకు వెళతానని అమ్మానాన్నతో చెప్పాడు. దానితో కుమారుడిని తీసుకుని కవాతులో పాల్గొన్నారు.

కవాతులో పాల్గొన్న ఆదిత్య కుమార్ పై మీడియా దృష్టి పడింది. న్యూస్ కవరేజీలో భాగంగా ఆదిత్య కుమార్ నిరసనను కూడా ప్రదర్శించారు. ''అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతాను. లాఠీ ఛార్జ్ జరిగితే దెబ్బలు తినే మొదటి వ్యక్తిని నేనే అవుతాను. మా తరం ఉన్నత చదువులకు చేరుకునే నాటికి పేపర్ లీకులు, అవినీతి వ్యవహారాలు సమసి పోవాలి. విద్యార్థులపై లాఠీ ఛార్జీకి అనుమతించిన వారిపై చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి రాజీనామా చేయాలని'' చెప్పాడు. మీడియాలో ప్రసారం అయిన ఆదిత్య కుమార్ నిరసనకు దేశవ్యాప్తంగా మద్దతు వచ్చింది. అభినవ భగత్ సింగ్ అని పొగడ్తలు వచ్చినవి. బీహార్ యువత, విద్యార్థుల పోరాటానికి కూడా మద్దతు పెరిగింది. పోలీసులు భద్రత దృష్ట్యా ఆదిత్య కుమార్‌ను తమ అధీనంలోకి తీసుకుని 6 గంటల అనంతరం విడిచిపెట్టారని తెలిసింది. కాని తండ్రి రంజిత్ కుమార్, తల్లి మున్నీ కుమారిని పోలీస్ స్టేషన్ కు తీసుకుపోయి లాఠీలతో కొట్టిన సంఘటనలపై చర్యలు తీసుకోవాలని ఆదిత్య కుమార్ గార్డెనిబాగ్ లో ధర్నా చేశాడు.

సహజ వనరుల రీత్యా బీహార్ సుసంపన్న రాష్ట్రం. దక్షిణ భాగమైన రాంచీ, జంషెడ్ పూర్, బొకారో, ధన్ బాద్ పారిశ్రామిక ప్రాంతాలతో 2000 నవంబర్ 15 న జార్ఖండ్ రాష్ట్రంగా విడిపోయింది. అయినప్పటికీ విభక్త బీహార్ భూభాగంలో 7.84శాతం అడవుల నుండి సాల్, శీషమ్, ఖైరు, వెదురు లాంటి ఉత్పత్తులకు అవకాశం ఉంది. సిమెంటు పరిశ్రమకు కీలకమైన సున్నపురాయి రోహతాస్, కైమూర్ జిల్లాలలో ఉంది. దేశంలోనే అత్యధిక పైరైట్స్, మైకా నిక్షేపాలు రోహతాస్ జిల్లా అమోజుర్‌లో ఉన్నవి. జముయి జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ)గుర్తించింది. క్వార్జైట్, స్టీయటైట్, చైనాక్లే (కలిమట్టి)ఇసుక పుష్కలంగా ఉన్నవి. బంగారం కంటే విలువైన 14 రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్‌లు గుర్తించబడినవి. పల్లాడియం, టైటానియం, గ్లాకొనైట్, కోబాల్ట్ ఖనిజాలు ఉన్నవి. బంకా జిల్లాలో కోబాల్ట్ నిక్షేపాలు ఉన్నవి. భాగల్పూర్ జిల్లాలోని బటేశ్వర్ స్థాన్‌లో 17 రకాల రసాయన మూలకాలు ఉన్నవి. ఇవి ప్రకృతిలో తక్కువ పరిమాణంలో లభిస్తాయి. ఆధునిక రక్షణరంగంలో క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, యుద్ధ విమానాలు, డ్రోన్లు, ల్యాప్ ట్యాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, టివి స్క్రీన్ లు, కెమెరా లెన్స్, స్పీకర్ తయారుకు ఉపయోగిస్తారు. ఇప్పుడు చైనా అగ్రస్థానంలో ఉంది. ఇక వ్యవసాయ పంటలకు సారవంతమైన ఒండ్రు నేలలు ఉన్నవి. గంగా, కోసి, గండక్, సోన్, భాగమతి, ఘాగ్రా లాంటి జీవనదులు, నిండుగా ఉన్న భూగర్భ జలాలతో వరి, గోధుమ, చెరకు, జనపనార, పప్పు ధాన్యాలు పండుతాయి.

బీహార్ లో గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు లేవని తెలుస్తుంది. 2006 నుండి 2021 వరకు రాష్ట్ర నిధులను ఆదా చేయడానికి ఉపాధ్యాయులను, ఆరోగ్య కార్యకర్తలను, జూనియర్ ఇంజనీర్ నియామకాల భర్తీలను కాంట్రాక్ట్(నియోజన్)పద్ధతులలో కొనసాగిస్తున్నారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(బి పిఎస్సి సిసిఇ)నోటిఫికేషన్ ను 2024 సెప్టెంబర్ 23న విడుదల చేశారు. అభ్యర్థుల ఎంపికకై ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశలను ఎన్నుకున్నారు. ఇందులో సహాయక పట్టణ సంక్షేమ, రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జ్యుడీషియల్ సర్వీసెస్, సివిల్ కోర్టు ప్యూన్ & అటెండెంట్స్, సహాయక ప్రజా పారిశుధ్య& వ్యర్థాల నిర్వహణ అధికారి, సహాయ విద్య అభివృద్ధి అధికారి పోస్ట్‌ల ఖాళీలను ప్రకటించారు. సంబంధించిన పరీక్షలు 2024 ఏప్రిల్ 25 నుండి 30 వరకు జరిగినవి. అలాగే డిసెంబర్ 13,14 తేదీలలో కూడా జరిగినవి. 2026 మే 3, 4 తేదీలలో పాట్నాలో 12 పరీక్ష కేంద్రాలలో జరిగిన పరీక్షలలో భారీ అవకతకలు జరిగాయని ఆరోపణలు రాగా పోలీసులు పరీక్షా కేంద్రాలపై దాడులు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. దానితో ఉద్యోగ నియామకాల పరీక్షలను కొన్నింటిని వాయిదా వేశారు. కొన్నింటిని రద్దు చేశారు. బిపిఎస్సిసిఇ పరీక్షలను రాసిన దాదాపు 11 లక్షల మంది యువత తీవ్ర ఆందోళనలకు గురై నిరసనలకు దిగారు. ఆగస్టు 25న జరిగిన నిరసనలో బారికేడ్లను తొలగించారు. వాటర్ కెనాన్లకు ఎదురొడ్డి ముందుకు సాగారు. ఈ నిరసనలో కూడా ఆరేండ్ల ఆదిత్య కుమార్ పాల్గొని దేశ ప్రజల ఆసక్తికి, ప్రభుత్వ కోపానికి కారణమైనాడు.



ప్రజాస్వామిక సంస్థలను, ప్రజల భావ వ్యక్తీకరణలను ప్రభుత్వం గౌరవించినప్పుడే ప్రజాస్వామిక సౌధం పరిఢవిల్లుతుంది. బ్యాలెట్ మెజారిటీ తీర్పునే ప్రజల ఆమోదంగా పరిగణించడం సరికాదు. ప్రతి ఎన్నికల ఫలితాలలో గెలిచిన పార్టీ ఓట్ల కంటే ఓడిన పార్టీల ఓట్లే అధికంగా ఉంటున్నవి. ప్రతి పక్షాలకు పోలైన ఓట్లకు జవాబుదారీగా అధికార పార్టీ పాలన సాగాలి. కాని ప్రభుత్వ తప్పిదాలను వ్యతిరేకించిన ప్రతివారినీ పలురకాల యిబ్బందులకు గురిచేయడం పరిపాటిగా జరుగుతుంది. బిజెపి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన 2014 నుండి కొత్త కొత్త ప్రయోగాలతో కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. వివేక్ అగ్నిహోత్రి అనే దర్శకుడు తీసిన 'కాశ్మీర్ ఫైల్స్' సినిమా 2022 మార్చి 9న విడుదల అయింది.

మార్చి 15న ప్రధాని నరేంద్ర మోదీ సినిమాను చూచినట్లుగా,బిజెపి ఎమ్మెల్యేలను కాశ్మీర్ ఫైల్స్ చూడాలని సిఫార్సు చేసిన వార్త పత్రికలలో కూడా వచ్చింది. ఆ సినిమాలోనే 'అర్బన్ నక్సల్స్' అనే పద ప్రయోగం మొదటగా వచ్చింది. ఇది ఉత్తమ చిత్రంగా కూడా ఎన్నికైంది. 2018లో జరిగిన బీమకోరేగావ్ కేసుతో ప్రాచుర్యంలోకి వచ్చి రాహుల్ గాంధీ కూడా అర్బన్ నక్సల్ అనే దాకా ఎదిగింది.

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా ఎర్రకోటపై జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం దేశ ప్రజల ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వ్యతిరేక స్వరాలను 'దిమాగీ నక్సల్' గా సంబోధించాడు.

2022–2023 నాటికి జాతీయ సగటు 3.2శాతంతో పోలిస్తే బీహార్ రాష్ట్ర నిరుద్యోగ రేటు 3.9 శాతంగా ఉంది. జాతీయ బహుముఖ పేదరిక సూచిక ప్రకారం రాష్ట్ర జనాభాలో దాదాపు 34 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. బతుకుదెరువు కోసం ప్రతి మూడు కుటుంబాలలో రెండింటిలో కనీసం ఒక సభ్యుడు వలసపోయాడు. ప్రతి ఉదయం బీహార్‌లో ఒక కుటుంబం పెట్టె తాళంతీసి అందులోంచి ప్రయాణ సంచిని బయటకుతీసి వెళ్లే రైలు ఎక్కుతున్న మరో యువకుడిని చూస్తుంది బీహార్ రాష్ట్రం.

1981లో 10 నుండి 15 శాతం కుటుంబాలలో వలస కార్మికులు ఉండేవారు. కాని 2020 నాటికి 65 శాతం పెరిగిందన్న అంచనాలు ఉన్నవి. ఇక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు దాదాపు 15 సంవత్సరాలుగా లేవు. గత రెండు సంవత్సరాల నుండి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగి రద్దు చేసే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపిన వారిని కక్ష్య సాధింపు చర్యలకు గురి చేస్తున్నారు. బ్రహ్మను నమ్మేవారు ఉన్నారు. అలాగే నమ్మని వారు కూడా ఉన్నారు. కాని ''బ్రహ్మ రాతను చెరపలేరన్న'' నానుడైతే ఉంది. మేజర్ చంద్రకాంత్ సినిమాలో ప్రాణాంతక జబ్బుతో బాధపడుతున్న నానమ్మను ఉద్దేశించి మనుమడు మనుమరాలు పాట పాడుతారు.

'సుఖీభవ సుమంగళీ సుఖీభవా, ఆ,ఆ..
సుశీలవై చిరాయువై సుఖీభవా, ఆ, ఆ, చరణం విన్న
తాత 'ఈ బాల వాక్కు బ్రహ్మ వాక్కు ఒక్కటేననీ,
నిండుగా, నూరేళ్లుగా ఉండి పొమ్మనీ వంతపాడతారు.

సామాన్యంగా సమాజం వినపడని, కనిపించని బ్రహ్మ వాక్కు కంటే బాల వాక్కును విశ్వసిస్తుంది. పిల్లలు చల్లని వారని, కల్లాకపటం ఎరుగరని, సత్యమే మాట్లాడతారని సమాజం నమ్ముతూ వస్తోంది. బీహార్ రాష్ట్రం పాట్నాలోని ఆదిత్య కుమార్ బాలవాక్కును కూడా సమాజం విశ్వసిస్తుంది.

అందుకే దేశవ్యాప్తంగా వైరల్ అయినాడు. కాబట్టి ప్రభుత్వం అక్కసును వీడి, తల్లిదండ్రులపై కక్ష్య సాధింపు చర్యలకు స్వస్తిచెప్పి ఆ కుటుంబానికి ఉపాధిని చూపి ఆదిత్య కుమార్‌కు మెరుగైన విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించాలి. అలాగే పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్వహణపరమైన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజలకు మేలుచేసే పాలనను సాగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రోహిణి కమిషన్ నివేదికపై మూడేళ్లుగా మౌనం ఎందుకు?



డా.ముచ్చుకోట సురేష్ బాబు
9989988912

భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు – OBCల– రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది. అసలు ప్రశ్న సూటిగా ఉంది: ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?

**రిజర్వేషన్‌లోనే అసమానత?**

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీం కోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. కానీ ఒబిసిలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు.

కొన్ని వర్గా లు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి? ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న. కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఒబిసిల్లోని వివిధ ఉపవర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన. అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఒబిసి వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఒబిసి వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది. ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది – కులాల వారీ నమ్మదగిన గణాంకాల కొరత. భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కులగణన 1931లో జరిగింది. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఒబిసిలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది: వ్యక్తిగత ఒబిసి వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి? అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది: పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా? డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

**14 సార్లు గడువు పొడిగింపు**

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది. మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం. చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జులై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడే అసలు ప్రశ్న:కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు? కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు. కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పమే కదా!

**క్రీమీ లేయర్ వేరు.. ఉపవర్గీకరణ వేరు**

ఒబిసి చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి – క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ. క్రీమీ లేయర్ విధానం ద్వారా ఒబిసిల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు. ఉపవర్గీకరణ మాత్రం ఒబిసిలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది. ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేరుగా ఒబిసిలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది. అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు – రాజకీయాలు కూడా. 27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు. కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.

**ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం**

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది: ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా? కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి.

రాష్ట్రాలు, ఒబిసి సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. 2023లో నివేదిక సమర్పించబడింది. 2026 లో కూడా ప్రశ్న అలాగే ఉంది. ఒబిసిల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా? లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా? రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం. ఆ తలుపులు అందరికీ సమానం గా తెరుచుకునేలా చేయడం – అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

# కృష్ణావతరణం - ధర్మాచరణం

శ్రీకృష్ణుడు భువిపై అవతరించినట్లు విశ్వసించేవారు పుణ్యరోజును శ్రీకృష్ణ జన్మాష్టమిగా ప్రతియేటా జరుపుకుంటారు. నేటి ఉత్తరప్రదేశ్‌లోని మధురలో వసుదేవుడు, దేవకీల అష్టమ సంతానంగా భోజవంశ రాజు కంసుని కారాగృహంలో భగవానుని ఆవిర్భావం జరిగింది. కృష్ణ ఆవిర్భావానికి సంబంధించిన కథ శ్రీమద్ భాగవతంలో ఉంది. అలాగే ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి దేవాది దేవుడు శ్రీకృష్ణ భగవానుడు అనే గ్రంథంలో కూడా సవివరంగా ఉంది. 2026 సెప్టెంబర్ 4 న శ్రీకృష్ణ జన్మాష్టమి. దేవకీ వసుదేవుల వివాహానంతరం కంసుడు తన సోదరి, బావను వెంటబెట్టుకుని స్వయంగా రథాన్ని నడుపుతూ ఆనందంతో ముందుకు వెళ్ళసాగారు. అంతలో ఆకాశం నుండి అశరీరవాణి కంసుని ఉద్దేశించి ఇలా వినిపించింది. త్వరలో నీ సోదరి కలిగే అష్టమ పుత్రుడు నిన్ను వధిస్తాడని పేర్కొంది. అ శరీరవాణి మాటలకు భీతిల్లిన కంసుడు సోదరి అనే విచక్షణ మరిచి దేవికిని చంపబోయాడు. అతని ప్రవర్తనకు విస్తుపోయిన వసుదేవుడు తన భార్య ప్రాణాలు కాపాడాలనే ఆలోచనతో తనకు పుట్టబోయే పుత్రులను నీకు ఇస్తానని వాగ్దానం చేస్తాడు. వసుదేవుని మాటలు నచ్చి కంసుడు దేవికిని చంపే ప్రయత్నం విరమించుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం వసుదేవుడు తనకు కలిగిన మొదటి పుత్రున్ని కంసునికి ఇస్తాడు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ శిశువుతో నాకు ప్రమాదం లేదు కనుక ఇవ్వనవసరం లేదని కంసుడు ప్రకటిస్తాడు.

కృష్ణుని ఆవిర్భావాన్నీ త్వరితం చేయాలనే సంకల్పంతో నారద ముని ఉంటారు. అందుకే, ఆ సమయం తగినదిగా భావించి, అక్కడ నారదముని ప్రత్యక్షమై దేవతలు వివిధ వంశాలలో జన్మతీసుకున్న ఉదంతాలను, కంసుని పూర్వ వృత్తాంతాలను వివరించడంతో కంసుడు భయంతో కంపించిపోతాడు. దేవతలు ఇదివరకే జన్మ తీసుకున్నారని, త్వరలోనే విష్ణువు అవతరిస్తాడని భావిస్తాడు. కఠిన నిర్ణయంతో దేవకీ, వసుదేవులను కారాగార గృహంలో బంధిస్తాడు. కారగార గృహంలో నున్న దేవకీ, వసుదేవులకు జన్మించిన ఆరుగురు పుత్రులను వరుసగా కంసుడు చంపాడు. ఈ దురాగతాలు తెలిసిన బంధువులు, మిత్రులు కంసుని వద్దకు వెళ్లి అన్యం పుణ్యం ఎరుగని శిశువులను చంపవద్దని వేడుకున్ననూ, ఆ శిశు హత్యలను నివారించలేకపోయారు. దేవకి ఏడవసారి గర్భం దాల్చగానే దేవాదిదేవుని ముఖ్య అంశ అయిన అనంతుడు దేవకి గర్భంలో ప్రవేశించాడు. యోగ మాయ భగవంతుని నిర్దేశం మేరకు దేవకి గర్భంలోని ఆదిశేషుడిని బృందావనంలోని యశోద నందుల ఇంట్లో నున్న వసుదేవుని మరో పత్ని రోహిణి గర్భంలోకి మార్చుతుంది. కాగా దేవకి సప్తమ గర్భం విచ్ఛిన్నం అయిందని ప్రజలు భావించారు. ఇక మిగిలింది భగవానుడి జన్మావతారం. సమస్త జగత్తు ఆశించిన ఆ శుభ గడియలు వచ్చాయి.


నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి

శంకు చక్ర గదా పద్మములతో చతుర్భుజములతో తేజోవంతం అయిన, అద్భుతమైన బాలుడిని వసుదేవుడు చూసాడు. ఆ బాలుడి అసాధారణ రూపం చూసి, అతడు విష్ణుభగవానుడని తెలుసుకుని వసుదేవుడు స్తుతించాడు, ప్రార్థించాడు. తర్వాత దేవకి కూడా కీర్తించింది. భగవానుడి దివ్యరూపం దర్శించిన వారి జన్మ ధన్యమైంది. శ్రీకృష్ణుడు కూడా వారి పూర్వ జన్మవృత్తాంతం తెలిపి తానేందుకు అవతారం తీసుకోవలసి వచ్చిందనేది తెలియజేశారు. అలాగే కంసుని బరినుండి వారిని విముక్తులను చేసేందుకు, తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని తెలిపి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. పిమ్మట భగవానుడు సాధారణ శిశువుగా మారిపోయారు. శ్రీకృష్ణుడి సూచనమేరకు వసుదేవుడు వెంటనే గోకులానికి ఆ శిశువును తీసుకునివెళ్ళి నంద మహారాజు ఇంట్లో అప్పుడే యశోదకు జన్మించిన పుత్రిక స్థానంలో ఉంచాడు. ఆ పుత్రికను తీసుకుని తిరిగి మధురకు వచ్చి దేవకి ఒడిలో ఆమె బిడ్డగా ఉంచాడు. అరుపులకు మెలకువ వచ్చిన సేవకులు కంసుడికి శిశువు జననం గురించి తెలియజేశారు. వెంటనే కారాగార గృహం చేరిన కంసుడితో జన్మించినది పుత్రిక అని, ఆ పుత్రిక వలన కంసుడికి ప్రమాదం లేదు కనుక చంప వలదని దేవకి వేడుకుంటుంది. అయిననూ కంసుడు నిర్దయగా ఆ ఆడ శిశువును రాతిపై విసిరి కొట్టడంతో ఆ బాలిక అతని నుండి చేజారి ఆకాశంలో ప్రత్యక్షమై అష్టభుజాలతో దుర్గాదేవిగా నిలిచి, దుర్మార్గుడా... నిన్ను చంపేవాడు ఇంతకుముందే వేరేచోట జన్మించాడని, అతని చేతిలో నీకు చావు తప్పదని హెచ్చరిస్తూ అంతర్ధానం అవుతుంది. దుర్గాదేవి పలుకులకు భయపడిన కంసుడు, దేవకి, వాసుదేవులను కారాగార బంధ విముక్తి చేశాడు. ఇక గోకులంలో నందుని ఇంట కొలహాలం నెలకొంది. యశోదకు పుత్రుడు కలిగాడనే సంతోషంతో గోపులు, గోపవనితలు నందుని ఇంటికి చేరుకొని అక్కడ జరిగిన కృష్ణ జననోత్సవంలో పాల్గొన్నారు. అలా శ్రీకృష్ణుడి అవతార జన్మ ఉద్భవం జరిగింది.

### ధర్మాచరణం

ధర్మ స్థాపన కొరకు దేవాది దేవుడి శ్రీకృష్ణ అవతారం చాలా ప్రముఖమైనది. క్రూరుడు అయిన కంసుడిని వధించి యదువంశాన్ని రక్షించారు. బాల్యలీలల ద్వారా పూతనను సంహారించారు. గోవర్ధనగిరి పర్వతాన్ని చిటికన వేలితో ఏడురోజులపాటు ఎత్తి యాదవులందరిని కాపాడారు. కాలియుడనే విష సర్పం గర్వాన్ని అణిచివేసి పడగలపై నృత్యం చేశారు. జరాసంధుడు, శిశుపాలుడు వంటి ఎందరో దానవులను మట్టుబెట్టారు. కుచేలుడు, కుంతి మహారాణి, ద్రౌపది వంటి వారెందరికో తన కృపను ఇచ్చారు. మహాభారత యుద్ధంలో పాండవులకు ఎల్లవేళలా రక్షణ ఇచ్చి చివరకు అర్జునుడికి రథ సారధి అయ్యాడు. యుద్ధభూమిలో కర్తవ్య నిర్వహణకు సందేహించిన అర్జునుడికి జీవితసత్యాలతో భగవద్గీత భోదించారు. ఈ గ్రంథం సర్వమానవాళికి గొప్ప మార్గదర్శం. గోపులు, గోపికలను ముఖ్యంగా రాధారాణి పైన అవ్యాజ్యమైన ప్రేమను ప్రకటించారు. జన్మాష్టమి రోజు కృష్ణుడి విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తారు, అటుకులు, వెన్న, మిఠాయిలు నైవేద్యంగా సమర్పిస్తారు. ఉట్టి కొట్టడం, సాంస్కృతిక ప్రదర్శనలు, కృష్ణ అలంకరణ వంటివి కన్నుల పండుగగా నిర్వహిస్తారు. ఇలా ఆయన జన్మదినం సర్వ మానవాళికి శుభం కలిగించే మహోత్సవంగా జరుపుతారు.

– డి. శ్రీనివాస్

## కమ్యూనిస్టుగా కొనసాగడానికి నన్ను ప్రేరేపించేది ఎవరు?



చాలామంది నన్ను అడుగుతుంటారు :
మీరు కమ్యూనిస్టు ఉద్యమంలోకి, సిపిఐలోకి రావడానికి మిమ్మల్ని ఎవరు ప్రేరేపించారు?
సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన సిపిఐ బహిరంగ సభలో నాకు ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.
అక్కడ మహారాష్ట్రకు చెందిన 85 ఏళ్ల కామ్రేడ్ అమీర్ కె.ను కలిశాను. ఆయన 1960 నుంచి సిపిఐతో అనుబంధం కొనసాగిస్తున్నారు.
నేను ఆయనను అడిగాను
కామ్రేడ్ ఇంత వయసు వచ్చినా ఇంకా సిపిఐతోనే ఎందుకు ఉన్నారు?
ఈ సభ కోసం ఇంత దూరం ఎందుకు వచ్చారు?
ఆయన సమాధానం:
నేను ఒక పేద కార్మికుడిని, రాజకీయ కార్యకర్తను. మా గురించి మాట్లాడే పార్టీ సిపిఐ ఒక్కటే. ఇలాంటి సభకు వచ్చినప్పుడు నాకు కొత్త ఉత్సాహం వస్తుంది.
మళ్లీ నేను అడిగాను
మిమ్మల్ని ఎవరైనా తీసుకొచ్చారా? లేక మీరే స్వయంగా వచ్చారా?
ఆయన చెప్పిన సమాధానం మరింత స్ఫూర్తిదాయకంగా ఉంది
మేము పేద కార్మికులం. మా వల్ల అయ్యేది పార్టీకి విరాళంగా ఇస్తాం.
ఇక్కడికి కూడా నా సొంత డబ్బులతో నేనే వచ్చాను.
85 ఏళ్ల వయసులో మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి వచ్చారు.
పదవి కోసం కాదు... అధికారం కోసం కాదు...
స్వప్రయోజనం కోసం కాదు.
కార్మికులు, పేదల కోసం జరుగుతున్న పోరాటంపై ఉన్న నమ్మకంతో వచ్చారు.
ఇదే కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న అసలైన బలం.
నన్ను సిపిఐలో కొనసాగడానికి ఎవరు ప్రేరేపిస్తున్నారు అని ఎవరైనా అడిగితే నా సమాధానం స్పష్టం:
అమిర్ కె.లాంటి కామ్రేడ్లే!
జీవితాంతం ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్లు.
తమకు చేతనైనంత పార్టీకి అందించే కామ్రేడ్లు.
వయసు మీద పడినా పోరాటాన్ని కొనసాగించే కామ్రేడ్లు.
అధికారం, డబ్బు, ప్రచారం ఏదీ తమ నమ్మకాన్ని కదిలించలేని కామ్రేడ్లు.
వారి అంకితభావం మనకు స్ఫూర్తి.
వారి త్యాగం మన బలం.
వారి పోరాటం మన బాధ్యత.
కమ్యూనిస్టు ఉద్యమం కేవలం నాయకులతో నిర్మించబడలేదు.
న్యాయమైన, సమానత్వంతో కూడిన సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వేలాది సాధారణ కార్మికులు, కార్యకర్తలు, కామ్రేడ్ల త్యాగాల మీద ఈ ఉద్యమం నిర్మించబడింది.
లాల్ సలామ్, కామ్రేడ్ అమిర్

– డా॥ కె.నారాయణ,
సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్

## డిఎస్‌పి భీమ్‌రెడ్డికి ఇడి షాక్!

**ఎసిబి కేసు ఆధారంగా ఆయన ఆస్తులపై ఇడి దృష్టి.. రూ.150 కోట్ల ఆస్తుల లెక్కలపై ఆరా?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎసిబి కేసులో అరెస్టై ఇటీవలే బెయిల్‌పై విడుదలైన డిఎస్‌పి భీమ్‌రెడ్డికి మరో చిక్కు ఎదురైనట్లు సమాచారం. అవినీతి ఆరోపణల కేసులో ఎసిబి గుర్తించిన ఆస్తుల వివరాల ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భీమ్‌రెడ్డి ఆస్తుల చిట్టా భారీగా ఉండటంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఇప్పుడు ఆయన ఆస్తుల మూలాలు, ఆదాయ మార్గాలపై కేంద్రీకృతమైనట్లు సమాచారం. ఎసిబి దర్యాప్తులో గుర్తించిన ఆస్తులు, వాటి కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలు, ఆస్తుల విలువ, ఆదాయ వనరులకు మధ్య ఉన్న వ్యత్యాసాలపై ఈడి అధికారులు ప్రాథమికంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా దాదాపు రూ.150 కోట్ల మేర డాక్యుమెంట్ విలువ కలిగిన ఆస్తులకు సంబంధించి సరైన ఆధారాలు, ఆదాయ వనరుల వివరాలు లేవన్న కోణంలో అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఎసిబి కేసులో వెలుగులోకి వచ్చిన ఆస్తుల వివరాలను ఈడి అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆస్తుల కొనుగోళ్లకు ఉపయోగించిన నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటికి చట్టబద్ధమైన ఆదాయ వనరులు ఉన్నాయా? ఆస్తుల విలువకు, అధికారికంగా చూపిన ఆదాయానికి మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? అనే అంశాలపై దర్యాప్తు సాగనున్నట్లు తెలుస్తోంది. ఎసిబి కేసులో అరెస్టైన భీమ్‌రెడ్డి నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం.

అయితే అంతలోనే ఆయన ఆస్తుల వ్యవహారం ఈడి దృష్టికి వెళ్లడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎసిబి దర్యాప్తులో సేకరించిన పత్రాలు, ఆస్తుల వివరాలు, బ్యాంకు లావాదేవీలు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ఈడి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆస్తుల వ్యవహారంపై మరింత స్పష్టత కోసం భీమ్‌రెడ్డిని ఈడి అధికారులు త్వరలోనే విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్రంలో వారం రోజులు మోస్తరు వర్షాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశముందన్నారు. గురువారం, శుక్రవారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 10 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శుక్ర, శనివారాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ ఏడు రోజుల కాలానికి సంబంధించి రాష్ట్రంలో ఎలాంటి వాతావరణ హెచ్చరికలు జారీ చేయలేదని స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
జిల్లా కలెక్టర్ కార్యాలయము
ఆదిలాబాద్

(ఫారం -సి)

(ప్రాథమిక నోటిఫికేషన్)

(చట్టములోని సెక్షన్ 11 అనుసరించి 10-A రూల్ మినహాఇంపు ఇవ్వబడినది ( రూల్ 6/12 చూడుము))

కలెక్టర్ ఫైల్ నెం. జి1/664/2026 తేదీ: 29.08.2026
ఆర్డీఓ ఫైల్ నెం. B/927/2026 తేదీ: 29.08.2026
గజిట్ నంబర్ నెం. P.N U/S-11(1)/08-L/2026 తేదీ: 29.08.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలము లోని పిప్పల్ కోటి గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.2.19 గుంటలు** భూమి ప్రజా ప్రయోజనార్థం ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గంగా ప్రాజెక్టు పిప్పల్ కోటి బ్యాలన్సింగ్ (ప్రధాన / నీటి సరఫరా) కాలువ నిర్మాణము నిమిత్తం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సెక్షన్ 6(2) క్రింద (చట్టం 30/2013)లో పేర్కొనిన ప్రకారం నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక అవసరం లేనందున అనుబందంలో పెక్కొనిన భూములకై నోటిఫికేషన్ జారీ చేయనైనది.

ఇట్టి ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎంఎస్ . నెం.58 ఐ.అండ్ సి ఎ డి (ఎల్.ఏ.ఆర్ & ఆర్ /ఏ2)ఇట్టి లోవర్ పెన్ గంగా ప్రాజెక్టునకు ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేదీ:25.07.2017 ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్ II మరియు -III పరిధి నుండి మినహాయింపు ఇవ్వ బడినది.

ఈ ప్రాజెక్టు కు సంబదించిన భూసేకర్ణ పనులను చేపట్టుటకు చట్టములోని సెక్షన్ 43 నిభందనల ప్రకారము G.O. Ms. .No.139 Revenue (JA & LA) Dept Date: 20.08.2015 మరియు జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ గారి ఉత్తర్వులు No.61/664/2026 తేదీ: 7.03.2026 ప్రకారము భూ సేకర్ణ అధికారిగా రాజస్వ మండల అధికారి ఆదిలాబాద్ గారిని, మరియు G.O.Ms No.6 అనుసరించి ప్రాజెక్టు పాలన అధికారి గా అదనపు కలెక్టరు (రెవెన్యూ) మరియు కలెక్టర్. ఆదిలాబాద్ గారి ఉత్తరువులు నెం 61/664/2026 తేదీ: 27.03.2026 ప్రకారము నియమించడము జరిగినది.

కావున ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలములోని పిప్పల్ కోటి గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.2.19 గుంటలు** భూమి యొక్క వివరములు ఈ క్రింది చూపిన వానిని భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్యం ప్రథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూలు

గ్రామము: పిప్పల్ కోటి మండలము: భీంపూర్ జిల్లా : ఆదిలాబాద్

| క్ర. సం. | సర్వే నెం. | బీట్ నెం. | సర్వే నెం. | పట్టా/ మెట్ట/ తరి | [illegible] | పట్టేదార్ పేరు | కాస్తుదారు / హక్కుదారు | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| పిప్పల్ కోటి గ్రామము - భీంపూర్ మండలము | | | | | | | | |
| 1 | 43 | 43/ఇ | 0.27 | పట్టా మెట్ట | 027 | గట్టు సంతోష్ తండ్రి కాశినాథ్ | స్వంతం | లేవు |
| 2 | 50 | 50 | 1.28 | పట్టా మెట్ట | 0.30 | ఉల్వల పద్మ భర్త హన్మండ్లు | స్వంతం | లేవు |
| 3 | 50 | 50/అ/1/1/1 | | పట్టా మెట్ట | 0.38 | ఉల్వల పద్మ భర్త హన్మండ్లు | బింగి వెంకన్న తండ్రి కిష్టన్న | లేవు |
| 4 | 51 | 51/ఆ | 0.04 | పట్టా మెట్ట | 0.04 | బింగి వెంకన్న తండ్రి కిష్టన్న | లేవు | లేవు |
| మొత్తం విస్తీర్ణం | | | 2.19 | | 2.19 | | | |

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబంధించిన ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూమి యొక్క ప్లాన్, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టరు, ఆదిలాబాద్, రాజస్వమండల అధికారి, ఆదిలాబాద్ గారి కార్యాలయములలో తనిఖీ చేసుకోవచ్చును. తదుపరి తెలంగాణా ప్రభుత్వం /కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వం ఎంత భూమిని స్వాదినము చేసుకోవాలో నిర్ణయించుకొనే క్రమములో సెక్షన్ 12 ప్రకారం అధికారులు, ఉద్యోగులు వారి వద్ద పని చేసే కార్మికులకు పైన చూపిన భూములలో గల ఏదైన ప్రదేశంలోకి ప్రవేశించి, సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూస్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ (15) ప్రకారం,ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపిన భూములలో ఎలాంటి సంబం-దమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యతరములున్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60-అరవై రోజులు) దినములలోపు భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

భూ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులు వారి నష్టపరిహారాన్ని సంప్రదింపుల ద్వారా పరిష్కారం చేయదలుచుకుంటే వారు తమ అభ్యంతరములను ఫారం E-1 & G-I, G-III, ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తదుపరి G.O.Ms.No. 120 Revenue (JA&LA) Dept Date: 30.06.2017 అనుసరించి సమర్పించవచ్చును.

సం/- రాజస్వ మండలాధికారి మరియు భూ సేకరణ అధికారి ఆదిలాబాద్
సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్
సం/- జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్

DIPR RO NO. 811/LA/PP/Advt/Pub/2026-27


## తెలంగాణ బిజెపి నేతలు మోదీని నిలదీయాలి

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై కేంద్రాన్ని ప్రశ్నించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ బిజెపి నేతలు తమ పార్టీలోని అంతర్గత పోరులో ఉనికి కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. నిజంగా తెలంగాణ ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం మానేసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నిలదీయాలని ఆయన సూచించారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, అనుమతులపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తరహాలో తెలంగాణకు ఎందుకు న్యాయం జరగడం లేదో వారు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం కేంద్రానికి వెళ్తున్నప్పటికీ, తిరిగి రావాల్సిన నిధుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. మెట్రో, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు పెట్టినప్పుడు బిజెపి నేతలు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ''రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు.. తెలంగాణ కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించండి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై ప్రధాని మోదీ నుంచి స్పష్టమైన హామీ తీసుకురండి'' అని బిజెపి నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

### హుస్నాబాద్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి మంత్రి కోమటిరెడ్డిని కోరిన పొన్నం

హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్‌బి రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సచివాలయంలో ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సిద్దిపేట ఎల్కతుర్తి జాతీ య రహదారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు మిట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే కరీంనగర్ ఎల్కతుర్తి, ఎల్కతుర్తి హనుమకొండ రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ వద్ద బాటిల్‌నెక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి కోరారు. కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట వైపు వెళ్లే రహదారులు కలిసే ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జంక్షన్‌ను విస్తరించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతిపాదించిన పలు ఆర్‌అండ్‌బి రోడ్లకు మంజూర్లు ఇవ్వడంతో పాటు, ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని పొన్నం ప్రభాకర్ కోరారు. రహదారి మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీని దళిత వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు బిజెపి కుట్ర

టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని బిజెపి దళిత వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ( జగ్గారెడ్డి ) ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ సభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న అనంతరం సభా ప్రాంగణాన్ని బిజెపి అనుబంధ నాయకులు శుభ్రం చేయడంపై రాహుల్‌గాంధీ ప్రశ్నించారని తెలిపారు. ఖర్గే రాజ్యసభలో ప్రతిపక్ష నేతతో పాటు దళిత నాయకుడని, ఆయనను అవమానించడం సరికాదని జగ్గారెడ్డి అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బిజెపి, దాని అనుబంధ సంస్థలు జాగ్రత్తగా వ్యవహరించాలని రాహుల్‌గాంధీ సూచించారని పేర్కొన్నారు. అయితే రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను బిజెపి కావాలనే వక్రీకరించి ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాహుల్‌గాంధీ నాయకత్వం వహిస్తున్నప్పటికీ ఆయనలో ఎలాంటి అహంకారం లేదని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబానికి ఎస్‌సి,ఎస్‌టి,అనే వివక్ష భావన లేదని పేర్కొన్నారు. ఖర్గేతో కలిసి నడవాల్సిన సందర్భంలో రాహుల్‌గాంధీ ఆయన చేయి పట్టుకుని నడుస్తారని చెప్పారు.బిజెపి గాడ్సే సిద్ధాంతాలను అనుసరిస్తోందని జగ్గారెడ్డి విమర్శించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా బంగారు లక్ష్మణ్‌ను నియమించినప్పటికీ, అనంతరం ఆయనను పదవి నుంచి ఎలా దించాలనే ఆలోచనతో వ్యవహరించారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ధోరణి కాంగ్రెస్‌లో లేదని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ సామాజిక సమానత్వానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు.



## శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు ముందస్తు సమాచారంతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఈ నెల 7న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు తగిన సమాధానాలను త్వరితగతిన అందించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ సమేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సంజయ్‌జాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ తరపున అసెంబ్లీలో ఒక నోడల్ అధికారిని నియమించి, సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలను రాసిఇవ్వడంతో పాటు, సమాచార సేకరణ, సమన్వయం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, విభాగాధిపతులు అవసరమైన సమాచారంతో ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, శాసనసభలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి అ దనపు సమాచారం అవసరమైన సందర్భంలో వెంటనే సంబంధిత శాఖల నుంచి వివరాలను సేకరించి, నిర్ణీత సమయంలో సమాధానం అందించే లా సమన్వయ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాలకు సంబంధించిన సమాచారాన్నిఅసెంబ్లీ అధికారులకు వెంటనే అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, బిఎండి ఎక్కా, వాణి ప్రసాద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగి తా రాణా తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో రైతు వినాశనం.. కాంగ్రెస్ పాలనలో రైతు వికాసం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతుల బతుకు వినాశనం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో రైతుల జీవితాలు వికాసంతో నిండాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. అసలు బిఆర్ఎస్‌కు రైతులకు గురించే మాట్లాడే నైతిక హక్కు లేనే లేదని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ చార్జ్‌షీట్ వేయడం కాదని, ముందుగా వారి 10 ఏళ్ల పాలనపై ప్రజల చార్జ్‌షీట్‌కు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుభరోసా, పంటల కొనుగోళ్లు, పంట నష్టపరిహారం వంటి ప్రతి అంశంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందని తుమ్మల పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో వరి ఉత్పత్తితో పాటు సాగు విస్తీర్ణం కూడా పెరిగిందన్నారు. కేంద్రం పంటలు కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లను ఆపలేదని, సుమారు రూ.6 వేల కోట్లతో మొక్కజొన్న, రూ.2 వేల కోట్లతో జొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు.రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా నిర్వహించేందుకు రూపొందించిన తెలంగాణ యూరియా యాప్ దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి అన్నారు. తెలంగాణ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్రం ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను రూపొందించిందని పేర్కొన్నారు. రుణమాఫీపై బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలకు ఇప్పటికే గణాంకాలతో సమాధానం ఇచ్చామని తుమ్మల తెలిపారు. బ్యాంకులు అందించిన సమాచారాన్ని ఆధారంగానే రుణమాఫీ అమలు చేశామని స్పష్టం చేశారు. దేశంలో రైతుల పంట రుణాలు తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన విషయాన్ని బిఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని అన్నారు.


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331

NIT No. 48/SE/SLPZ/CMC/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేదీ: 03.09.2026

**NIT No.** 48/SE/SLPZ/CMC/2026-27, తేదీ: 03.09.2026, **పని పేరు:** సిఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, శేరిలింగంపల్లి సర్కిల్-49లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ (జి+1) నిర్మాణం, **అంచనా విలువ / ఇసివి:** రూ.250.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది:** 05.09.2026 మ.1.00గం.ల నుండి 19.09.2026 మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. **సెల్ నెం.** 7331186858.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి

DIPR R.O. No. : 9232-PP/CL/ADVT/2026-27, Date: 03-09-2026



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము,
కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

బహిరంగ వేలం ప్రకటన

లేఖ.నెం.వ్య.మా.క/కొత్తగూడెం/షాపులు/06/2026-27/166 తేదీ: 03.09.2026

వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం కార్యాలయం ముందు భాగమున నిర్మించిన వాటిలో గల (ఆరు) దుకాణములు అనగా **(షాప్ నెం. 03, 05, 23, 24, 28, 36)** నెలసరి అద్దె పై వాణిజ్యపరంగా కేటాయించుటకు శ్రీయుత ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, వరంగల్ గారి సమక్షంలో

- **తేది: 11.09.2026 న ఉ.11.00 గం.లకు** బహిరంగవేలము నిర్వహించబడును.
- 1/70 పిసా చట్టం ప్రకారం షాపుల కేటాయింపు యస్.టి. ధృవీకరణ పత్రం పొందిన వారు మాత్రమే పాల్గొనగలరు. ఆసక్తి గలవారు దరకాస్తు ఫారం పొందుటకు **తేది: 04.09.2026 ఉ.10.30 గం.లకు** నుండి **07.09.2026 సోమవారం సా.5.00 గం.లకు** వరకు వ్యవసాయ మార్కెట్ కమిటి, కార్యాలయము, కొత్తగూడెం నందు పొందగలరు.
- ఒరిజినల్ యస్.టి కుల ధృవీకరణ పత్రమును, (3) పాస్పోర్ట్ సైజు ఫోటోలు మరియు ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును చూపి కార్యాలయము పని చేయు వేళలో **రూ.1000/-** నగదు చెల్లించి దరకాస్తు ఫారం పొందగలరు.
- దరకాస్తు ఫారం స్వీకరించుటకు **తేది: 07.09.2026 నుండి 10.09.2026 సాయంత్రం 05.00 గం.ల** వరకు ధరావతు సొమ్ము (Deposit), **రూ.50,000/-** (Secretary Agril. Market Committee, Kothagudem) గారి పేరున డి.డి.తో పాటు స్వీకరించబడును.

సం/- కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం
సం/- చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం.

DIPR R.O. No. : 9211-PP/CL/ADVT/2026-27, Date: 03-09-2026

## షార్ట్ సర్క్యూట్‌తో ఇందిరమ్మ ఇల్లు దగ్ధం



ప్రజా పక్షం/పెంబి : మండలంలోని యాపల్ కూడా గ్రామంలో అర్ధరాత్రి కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో నైతం కృష్ణకు చెందిన ఇంద్రమ్మ ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లోని విలువైన వస్తువులు నిత్యవసర సరుకులు తో పాటు తమ వ్యవసాయ పంట కోసం తెచ్చి ఇంట్లో నిలువ చేసుకున్న యూరియా డిఏపి పూర్తిగా కాలిపోయాయి.దీంతో నైతం కృష్ణ కుటుంబం మొత్తం నిరాశ్రులయ్యారు.దాదాపు 6 లక్షల వరకు ఆ స్తి నష్టం జరిగిందని తమకు పునరావాసం కింద తక్షణమే ఆర్థిక సాయంతో పాటు ఇంద్రమ్మ ఇల్లు మంజూరు చేయాలని నైతం కృష్ణ కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారులను కోరారు.

## ‘సర్’ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి

మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



ప్రజాపక్షం/భైంసా : భైంసా డివిజన్ లోని సర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సబ్ కలెక్టర్ కి మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి వినతిపత్రం సమర్పించి తెలపడం జరిగింది.ముఖ్యంగా కొందరు వయోవృద్ధులు నోటీసులు తీసుకున్న వారు బిఎల్‌ఒల దగ్గర వెళ్ళటానికి కష్టమవుతుంది. అందు వలన బిఎల్‌ఒలను వారి ఇంటికి పంపించి కావలసిన ధ్రువపత్రాలను తీసుకోవాలని లేదా ఎవరైనా వారి కుటుంబ సభ్యులు బిఎల్‌ఒల దగ్గర వెళ్లటానికి అనుమతించగలరని కోరడం జరిగింది.కొందరు ప్రజల దగ్గర ఎలక్షన్ కమిషన్ వారు చూయించిన 16 డాక్యుమెంట్లను ఏ డాక్యుమెంటు లేకుండా గాని తహసిల్దార్ ధ్రువీకరణ పత్రంపై ఓటర్గా రిజిస్టర్ చేయాలని కోరడం జరిగింది.భైంసా పట్టణంలోని పోలింగ్ స్టేషన్ 148 బంగల గల్లీ లో బిఎల్‌ఒలు పనిచేస్తున్న తీరును పరిశీలించటం జరిగింది.భైంసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి ఫారుక్ అహ్మద్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జెడ్పిటిసి ఉత్తమ్ భలే రావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్,మాజీ ఎంపీటీసీ మాణిక్ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌డి అల, ఫరూక్,గంగాధర్,లాల,తదితరులు ఉన్నారు.


## ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భా గంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 5, 6 , 12, 13 లలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మొదటి విడతగా 5, 6 లలో రెండవ విడతగా 12, 13 లలో స్పెషల్ క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు. ప్రతిబూత్ లెవల్ అధికారి తమకు కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలో అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్లకు అవసరమైన ఫారం 6, 7, 8 లతో పాటు ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచటం జరుగుతుందన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం 6తో, ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం 7తో ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి వాటికి ఫారం 8తో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని, ముసాయిదా ఓటరు జాబితాలను ఓటర్లు పరిశీలించేందుకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవటంతో పాటు అవసరమైన సవరణలు, మార్పులు లేదా కొత్తగా ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## కాంగ్రెస్ వెయ్యిరోజుల.. పాలనలో అభివృద్ధి లక్ష్యం

టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



ప్రజాపక్షం/కొండాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సీఎం ఆదేశాల మేరకు గురువారం కొండాపూర్ మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ర్యాలీ ఉత్సాహంగా సాగింది.టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభ్వుం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.వెయ్యి రోజల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటిని తీసుకెళ్లడమే బైక్ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యమని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపిటీసీ నరసింహారెడ్డి పార్టీ మండల జనరల్ సెక్రటరీ నర్సింలు, సోసైటీ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అశోక్, సర్పంచులు రామచంద్రారెడ్డి, అనిల్ మల్కాపూర్, ఉపసర్పంచ్ ప్రవీణ్ మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ప్రాంతాల పరిశీలన

ప్రజాపక్షం/భీమ్‌గల్ : రానున్న వినాయక చవితి పండగను పురస్కరించుకుని భీమ్‌గల్ పట్టణంలో వినాయక నిమజ్జనం జరిగే రాగన్నగట్ట ప్రాంతాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరె నాగమణి స్వామి, మున్సిపల్ కమీషనర్ గజానంద్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం తాగునీరు, విద్యుత్, రహదారి సౌకర్యాలు, భద్రత తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా భీమ్‌గల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్, అంజుమాలీ, సందీప్, సంగ్య నాయక్, నాయకులు నర్సయ్య, భగత్ పాల్గొన్నారు.



# డిజిటల్ ఒత్తిడిలో కార్యదర్శులు!

రేయింబగళ్లు యాప్‌ల ముందే కన్నీటి పయనం!

నిద్రలేని రాత్రుల్లో పంచాయతీ కార్యదర్శులు!

ప్రజాపక్షం/నిర్మల్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పల్లెల ప్రగతికి ఊపిరి పోయాల్సిన పంచాయతీ కార్యదర్శులు నేడు యాప్‌ల ప్రపంచంలో బందీలయ్యారు. గ్రామ స్వరాజ్యం పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిడిపి, జిసాప్ (జిసాప్) సర్వేల సేకరణ ప్రక్రియ క్షేత్రస్థాయి యంత్రాంగానికి తీరని వేదనను మిగుల్చుతోంది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో సాధారణ పాలనను పూర్తిగా పక్కనబెట్టి, రాత్రింబవళ్లు మొబైల్ స్క్రీన్ల ముందే గడపాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. ఉన్నతాధికారుల నుంచి వస్తున్న అంతులేని ఒత్తిడి, మెమోలు మరియు షోకాజ్ నోటీసుల భయంతో కార్యదర్శులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు.



### 20 పేజీల చిట్టా.. ప్రతీ ఇంట్లో గంటల కొద్దీ వెతకాల్సిందే..!

ఒక్కో గ్రామంలోని ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి సేకరించాల్సిన సమాచారం కొండంతగా మారింది. దాదాపు 20 పేజీలతో కూడిన సుదీర్ఘమైన బుక్‌లెట్‌లో ఉన్న వందలాది కాలమ్‌లకు వివరాలు వెతకాల్సి వస్తోంది. నివాస గృహాల పరిస్థితి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ కనెక్షన్లు, కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, భూకమతాల విస్తీర్ణం, ఆరోగ్య వివరాలు, పశుసంపద.. ఇలా ఒక కుటుంబం నుంచి పూర్తి వివరాలు తీసుకోవడానికే గంటకు పైగా సమయం పడుతోంది. గ్రామంలో ఉన్న వందలాది కుటుంబాల వివరాలను సేకరించి ఆన్‌లైన్ నిబంధనల ప్రకారం నమోదు చేయడానికి వారాల సమయం పడుతున్నా, అధికారులు మాత్రం కేవలం ఒకటి రెండు రోజుల్లోనే లక్ష్యాలను పూర్తి చేయాలని కఠిన ఆంక్షలు విధిస్తున్నారు.

**సిగ్నల్ లేని పల్లెల్లో సర్వర్ చికాకులు :** మరోవైపు నిర్మల్ జిల్లాలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రమైన నెట్‌వర్క్ సమస్యలు కార్యదర్శుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. కొండకోనలు, అటవీ సరిహద్దు గ్రామాల్లో మొబైల్ సిగ్నళ్లు లభించక డేటా అప్‌లోడ్ కావడం లేదు. దీంతో గ్రామంలో సమాచారం సేకరించి,సిగ్నల్ వచ్చే ఎత్తైన ప్రాంతాలకు లేదా మండల కేంద్రాలకు వెళ్లి అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. సర్వర్ల సాంకేతిక లోపాల వల్ల గంటల తరబడి శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంటే,ఉన్నతాధికారులు మాత్రం క్షేత్రస్థాయి యథార్థాలను వినడానికి సిద్ధంగా లేరు.పని కాకపోతే సస్పెన్షన్లు జారీ చేస్తామని బెదిరిస్తుండటంతో సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**రాత్రి వేళల్లో ఆన్‌లైన్ నరకం..:** కుటుంబాలకు దూరం పగటిపూట గ్రామంలో ఇల్లు ఇల్లు తిరిగి సమాచారం సేకరిస్తే, రాత్రి వేళల్లో విధిగా ఆన్‌లైన్ ఎంట్రీలు పూర్తి చేయాల్సి వస్తోంది. ఆదివారాలు, పండుగలు అనే తేడా లేకుండా ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్‌లు, రాత్రి 8 9 గంటల తర్వాత టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పురోగతిపై నిలదీస్తున్నారు. దీంతో కార్యదర్శులకు కనీస మానసిక విశ్రాంతి లేక నిద్రలేమి, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. సొంత కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా సమయం దొరకడం లేదని పలువురు కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

**గ్రామాల్లో పడకేసిన అత్యవసర సేవలు :** కార్యదర్శులు పూర్తి సమయాన్ని ఈ డేటా సేకరణకే కేటాయించాల్సి రావడంతో పంచాయతీల్లో ప్రాథమిక విధులు పూర్తిగా స్తంభించిపోయాయి. వీధిదీపాల నిర్వహణ,తాగునీటి సరఫరా,పారిశుధ్య పనుల పర్యవేక్షణ,పన్నుల వసూలు వంటి నిత్యవసర పనులు పక్కకు నెట్టివేయబడ్డాయి.సమస్యలు చెప్పుకుందామని వచ్చే ప్రజలకు కా ర్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ లక్ష్యాల సాధన పేరిట పం చాయతీల స్వయంప్రతిపత్తిని, ప్రజలకు అందాల్సిన సేవలను దెబ్బ తీయం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

**మానవీయ కోణంలో ఆలోచించాలి :** డేటా నమోదుకు సంబంధించి శాస్త్రీయమైన ప్రణాళికను రూపొందించాలని నిర్మల్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం కోరుతోంది. గ్రామాల్లో డేటా ఎంట్రీకి ప్రత్యేక ఆపరేటర్లను ఏర్పాటు చేయాలని, అనవసరమైన గడువుల ఒత్తిడిని తగ్గించి సాంకేతిక లోపాలను సరిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు.తగినంత వ్యవధి కల్పిస్తేనే సరైన డేటాను సమర్పించగలమని, ప్రభుత్వం స్పందించి వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రజాపక్షం/ పటాన్‌చెరు : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు ,యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థి యువతకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బిఆర్‌ఎస్ పార్టీ పక్షాన నిరంతర పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మోసాల పైన బిఆర్‌ఎస్ పార్టీ పోరుబాటలో భాగంగా గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదకగా విద్యార్థులతో కలిసి భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రదానంగా విద్యార్థులకు 5 లక్షల రూపాయాల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీ అర్హులైన నిరుద్యోగ యువతకు ప్రతినెల రూ. 4,000 నిరద్యోగ భృతి అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేయడం అం శాలలో రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నిమ్మకు నీరిత్తెనట్లు వ్యవహరిస్తుందని దుయ్యబెట్టారు. జీఓ నెంబర్ 97 పేరుతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆశాయలను అడియాశాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## క్రాప్ సర్వేలో పంటల వివరాలు నమోదు తప్పనిసరి

కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రజాపక్షం/సారంగాపూర్ : జిల్లాలోని రైతులందరూ తమ సాగు,పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. గురువారం సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో పొలాల్లో కొనసాగుతున్న క్రాప్ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పంటల వివరాలు క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదైతే భవిష్యత్తులో ధాన్యం విక్రయాలు,ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సహాయం,ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైన సహకారం అందించి,తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.క్రాప్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.సర్వే సిబ్బంది తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.నిర్దేశిత గడువులోగా క్రాప్ సర్వేను పూర్తి చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.సర్వే ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ రంగం ఆధునీకరణతోనే రైతన్నకు మేలు

ఎంపి గోడం నగేష్

ప్రజాపక్షం/మావల: వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించి, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ద్వారానే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో గురువారం ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైతుల ఆదాయం పెంచేందుకు సంప్రదాయ సాగుతో పాటు ఆధునీక సాంకేతికత, ఆయిల్ ఫామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం, డ్రోన్ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని, గిరిజన యువతకు డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.రైతులపై భారం పడకుండా ఉచిత పంటల భీమా అమలు చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను, వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను పరిశీలించారు.ఆత్మ చైర్మన్లు సంతోష్‌రావు, రాజు, నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.



## ఆగిపోయిన కాళేశ్వరం కాలువ పనులను పూర్తి చేయాలి

మాజీ మంత్రి హరీష్ రావు

ప్రజాపక్షం/నర్సాపూర్: బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన కాళేశ్వరం కాలువ, టన్నెల్ నిర్మాణాలను పూర్తి చేసి రైతాంగానికి సాగునీటిని అందించాలని మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి, మంతూర్ గ్రామాల శివారులో నిలిచిపోయిన కాళేశ్వరం కాలువను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన కాళేశ్వరం కాలువలను పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. జహీరాబాద్, సంగారెడ్డి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్ట్, రంగనాయక సాగర్ కు 50 కోట్లు మంజూరు చేస్తే 50,000 ఎకరాలకు నీరు వస్తుందన్నారు. పిల్ల కాలువలు, పంట కాలువలు తవ్వడానికి 50 కోట్లు పెట్టడానికి మనసు రావడంలేదని మండిపడ్డారు.మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు బస్సులు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సులు మంజూరయ్యాయి. విద్యార్థుల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు విద్యా, ప్రాక్టికల్ శిక్షణకు ఇవి ఉపయోగపడనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేకంగా సమావేశమై మెదక్ నియోజకవర్గంలోని వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నర్సింగ్ కాలేజీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల బలోపేతంపై చర్చ జరిగింది. మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మరిన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నర్సింగ్ కాలేజీ అభివృద్ధితో పాటు త్వరలో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మెదక్‌ను ఎవరికీ తీసిపోని విధంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్

ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా క్లెయిమ్స్ అభ్యంతరాల స్వీకరణకు సంబందించిన నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను అర్హత కలిగిన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో మొదటి దశ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సెప్టెంబర్ 6 తేదిల్లో , రెండో దశ ప్రేత్యేక ప్రచార కార్యక్రమాన్ని సెప్టెంబర్ 12,13 తేదిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార రోజుల్లో సంబందిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవడంతో పాటు ఓటరు జాబితాలో పేరు నమోదు ,తొలగింపు ,వివరాల్లో మార్పులు సవరణలు అవసరమైతే సంబందిత ఫారం 6,పారం 7,ఫారం 8 ద్వార క్లెయిమ్స్ అభ్యంతరాలను దాఖలు చేసుకోవచ్చని కలక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబందిత బూత్ లెవల్ అదికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ,అలాగే సంబందిత బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ప్రత్యేక ప్రచార రోజుల్లో హాజరై ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి తప్పులు ,మార్పులు, అవసరమైన వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా క్లెయిమ్స్ అభ్యంతరాల స్వీకరణ కాలంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఫారం 6,7,8 దరఖాస్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబందిత అదికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని తన ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని అవసరమైన సవరణలు ,అభ్యంతరాలను నిర్ణీత విదానంలో దాఖలు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



# బాయిల్డ్ రైస్ ఇస్తాం.. రా రైస్ ఇవ్వలేం!

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, చంద్రపాల్

ప్రజాపక్షం/మెదక్ : ప్రభుత్వ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రజా పంపిణీ వ్యవస్థకు అందించడంలో రైస్ మిల్లర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని బియ్యం తయారీలో నూకలు ఎక్కువ రావడం వల్ల మిల్లర్ల పరిస్థితి దారుణంగా ఉందని అందువల్ల ''బాయిల్డ్ రైస్ ఇస్తాం..రా రైస్ ఇవ్వలేమని'' ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, మిల్లర్ల సమస్యలను కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలని మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రెజరర్ తోడుపునూరి చంద్రపాల్ స్పష్టం చేశారు. ఒక్కరి తప్పుకు మొత్తం మిల్లింగ్ రంగాన్ని దోషిగా చూడొద్దని,తప్పు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోండి.. నిజాయితీగా పనిచేస్తున్న మిల్లర్లను వేధించొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రపాల్, రా రైస్ మిల్ జిల్లా అధ్యక్షులు వీరేశం, జిల్లాలోని రైస్ మిల్లులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ రైస్ మిల్లింగ్ రంగంపై వరుస దాడులు, తనిఖీలతో మిల్లర్లలో భయాందోళనలు నెలకొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడిన వారు ఎవరైనా శిక్షించండి.. కానీ అందరినీ ఒకే గాటన కట్టి దొంగలుగా చిత్రీకరించడం సరికాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి నష్టం జరిగి ఉంటే సంబంధిత మిల్లర్ల నుంచి ధాన్యం, బకాయిలను రికవరీ చేయాలని సూచించారు. పరిశ్రమలు మూతపడేలా క్రిమినల్ కేసులు, వేధింపులు చేయడం వల్ల ప్రభుత్వానికీ, మిల్లర్లకూ ప్రయోజనం ఉండదన్నారు. తరుగు, డ్రైయేజ్, మిల్లింగ్ ఛార్జీల చెల్లింపులో జాప్యం వంటి సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రా రైస్ మిల్ జిల్లా అధ్యక్షులు వీరేశం మాట్లాడుతూ సీఎంఆ ర్ విషయంలో రైస్ మిల్లర్లకు ప్రభుత్వం 25 శాతం పెనాల్టీ,12 శాతం విధిస్తుందని, షోకాజ్ నూటీలు జారీ చేస్తూ మిల్లర్లను ఇబ్బందులకు ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లరులు శ్రీనివాస్, శివకుమార్, రమేష్, జగదీష్, వీరేశం, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సర్కార్‌పై కదం తొక్కిన అన్నదాతలు

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర విధ్వంసానికి గురవుతోందని గత కేసీఆర్ ప్రభుత్వం రైతు రాజుగా బతికితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి పాలనలో తీవ్ర దగా మోసానికి గురవుతున్నాడని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారీ వర్షాలకు వచ్చిన వరద పరవళ్లు రెండు మూడు చోట్ల మట్టి కట్లు తెగితే వాటికి రూ.1020 లక్షలు కేటాయించి పటిష్టం చేయాల్సింది పోయి కుకునూర్, సుంకెట్, మోతె, గాండ్లపేట్, పచ్చలనడ్కుడ తదితర ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు సగానికి సగం కూల్చివేయటం దుర్మార్గమైన చర్య అని ఆక్షేపంచారు. ప్రభుత్వ బాకీలను ఎండగడుతూ గ్రామాల్లో పెడుతున్న ఫ్లెక్సీలను చూసి కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకుందని మంత్రి సుదర్శన్‌రెడ్డి ఒత్తిడితో అధికారులు, పోలీసులు ఫ్లెక్సీలను తీసేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించాలని చూస్తే ప్రజలు, రైతులు ,కార్యకర్తలు ఐక్యంగా తిరబడాలని అవసరమైతే తానే స్వయంగా వచ్చి అడ్డుకుంటానని కేసులు పెడితే తనపైనే పెట్టుకోవాలని స్పష్టం చేశారు. రైతు బలపడితేనే తెలంగాణ బలపడుతుందని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవలని, ఎన్నికల హామీలు లొడలొడ మాటల్లో కాకుండా చేలల్లో ఫలితాల రూపంలో కనిపించాలని వేముల స్పష్టం చేశారు. మాజీ జడ్పిటిసిలు, ఎంపిపిలు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితి ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఎపిఎ డివిజన్‌లో ఎయిర్ ట్యాంకర్ పేలుడు




ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి సంస్థ అర్జీ3 ఏరియాలో అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ (ఎపిఎ డివిజన్)లో గురువారం తెల్లవారుజామున ఎయిర్ ట్యాంకర్ పేలి ఐదుగురు కార్మికులకు గాయపడ్డారు. నైట్ షిఫ్ట్ పనులు ముగించుకొని కార్మికులు బయటికి వస్తున్న సమయంలో ఎయిర్ ట్యాంకర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలి మంటలు చెలరేగాయి.అధిక శబ్దం రావడంతో సమీపంలో ఉన్న ఇద్దరు కార్మికులకు చెవిలో ఒక్కసారిగా వినికిడి ఏర్పడడంతో హుటాహుటిన కరీంనగర్ ప్రైవే ట్ హాస్పిటల్‌కు తరలించారు.మరో ముగ్గురి కార్మికులకు గాయాలు కావడంతో అనంతరం చికిత్స కోసం గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తరలించారు.ప్రాజెక్టులో కొద్దిసేపు తీవ్ర ఆందోళన నెలకొంది ట్యాంకర్‌లో సాంకేతిక లోపాల వల్ల పేలుడు జరిగిందని అధికారులు తెలిపారు.

## సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది

ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు కేవలం పుస్తక పాఠాలే కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అందించేందుకు సైన్స్ ల్యాబ్, పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థినులు నాణ్యమైన విద్యతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తమ వంతు పూర్తి సహకారాన్ని నిరంతరం అందిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ వద్దు.. షాప్‌లే ముద్దు



ప్రజాపక్షం/వీర్నపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో రెండో రోజు చేపట్టిన కార్యక్రమంలో.. యూరియా యాప్ వద్దు, షాప్‌లే ముద్దు అంటూ బిఆర్ఎస్ మండల నాయకులు రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియా అందించడంలో పూర్తిగా విఫలం అయిందని, రైతులందరు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. యూరియా కొరతను తక్షణమే పరిష్కరించి రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాడ్గుల మల్లేశం, స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, గుగులోత్ సురేష్ నాయక్, చాంద్ పాషా, సామల్ల దేవరాజు, మల్లారపు అరుణ్ కుమార్, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: కరీంనగర్ పోలీస్ శాఖ




ప్రజాపక్షం/కరీంనగర్ : గణేష్ ఉత్సవాలను ఈ ఏడాది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి తొమ్మిది రోజుల ఉత్సవాలు, ఊరేగింపు, నిమజ్జనం వరకు నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నగర పోలీస్ ల ఆధ్వర్యంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వహకులకు పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్.ఓ.సీలు పొందాలి. ప్రతి మండప నిర్వాహకులు కమిటీ సభ్యుల వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల మొబైల్ నంబర్లు, మంటపం ఏర్పాటు చేసే ప్రదేశ వివరాలను పోలీసులకు అందజేయాలని తెలిపారు. అధికారులు నిర్ణయించిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మకపేట గ్రామ శివారులో గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిఎస్ 15 యుబి 3424 టిప్పర్‌ను అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు జిపిఒ కారంగుల శ్రీధర్, చైన్‌మెన్ బైరి ఆనందం తనిఖీలు చేపట్టారు.డ్రైవర్ గోలు కేసిరే వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.జిపిఒ శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.నవీన్ కుమార్ పేర్కొన్నారు.

## రెడ్ల నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ మానకొండూర్: రెడ్డి కార్పోరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయించడంతోపాటు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగునున్న రెడ్ల నిరసన దీక్ష పోస్టర్‌ను గురువారం మానకొండూర్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి జాక్ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి మాట్లాడుతూ పేద రెడ్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిన రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇడబ్లుఎస్ 10 శాతం రిజర్వేషన్‌ను అన్ని ప్రభుత్వ వి భాగాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంది తిరుపతి రెడ్డి, రెడ్డి జాక్ జిల్లా అధ్యక్షులు జున్నుతుల రాజారెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, పటేల్ శ్రీనివాస్ రె డ్డి, మర్రి రాజిరెడ్డి, గుర్రాల వెంకట్ రెడ్డి, రామంచ మల్లారెడ్డి, కొత్త రఘుపతి రెడ్డి, మందుల సంపత్ రెడ్డి, ముదిగంటి జీవన్ రెడ్డి, గోగురి రవీం దర్ రెడ్డి, కందుల యుగేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ విద్యార్థులకు సకల సౌకర్యాలు

వారంలో ఒకసారి ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

మంత్రి లక్ష్మ ణ్ కుమార్





ప్రజాపక్షం/ఎండపెల్లి/ధర్మపురి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 67 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి విద్యార్థులకు షూస్ తోపాటు బ్యాగులను అందజేశారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మండలంలోని తహసిల్దార్, ఎంపిడిఒలు వారం లో ఒక రోజు ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. కుమ్మర్ పల్లి కస్తూర్బా వసతి గృహాన్ని ప్రతి నెలకు ఒకసారి సందర్శిస్తానని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని,జగిత్యాల ఆర్‌డిఒ మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్‌తోపాటుపలువురుఅధికారులువివిధగ్రామాలసర్పంచులుపాల్గొన్నారు.

**అభివృద్ధిపై అసెంబ్లీలో తేల్చుకుందాం రండి**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి,సంక్షేమంపై బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్‌రావులు చేస్తున్న ఆరోపణలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సవాల్ విసిరారు . మాజీ సిఎం కెసిఆర్‌ను కూడా చర్చకు తీసుకురావాలని అన్నారు. గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేస్తోందని, మిగిలినరెండింటినికూడా అమలు చేస్తామని తెలిపారు.

**ధర్మపురి అభివృద్ధికి రూ.141 కోట్లు :** ధర్మపురి నియోజకవర్గంలో వివిధ నిధుల ద్వారా రూ.141 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి లిఫ్ట్, పత్తిపాక రిజర్వాయర్ పనుల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ధర్మపురికి రెవెన్యూ డివిజన్, బస్ డిపో, సబ్ ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**కొప్పులకు ప్రోగ్రెస్ రిపోర్ట్ పంపిస్తా :** తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో కూడిన వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను కొప్పుల ఈశ్వర్‌కు పంపిస్తానని, అందులో తప్పులు ఉంటే బహిరంగంగా నిరూపించాలని సవాల్ చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘన భట్ల దినేష్,కాంగ్రెస్ నాయకులు,మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు,తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం!

### కోరుట్లలో ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కోరుట్ల మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు.మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌస్‌లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా దుకాణాల్లో వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని,నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు మొత్తం రూ.30 వేల జరిమానా విధించారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని దుకాణదారులను గుర్తించి, వెంటనే లైసెన్స్ పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. వ్యాపార కార్యకలాపాల ద్వారా వెలువడే చెత్తను తడి,పొడి,హానికర చెత్తగా వేరు చేసి,దుకాణాల వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే ఎస్‌డబ్ల్యుమ్ 2026 నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో సానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్,రికార్డ్ అసిస్టెంట్ జగదీష్,వార్డు ఆఫీసర్లు వెంకటేష్,రాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలనలో మోసాలు..వైఫల్యాలు

### ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ప్రజాపక్షం/మల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచిందని ప్రభుత్వ పాలనంత మోసాలు వైఫల్యాలతోనే పూర్తిగా నిండిపోయిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనను ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి నీటిపారుదల శాఖను నిర్లక్ష్యం చేస్తూ రైతులను హరిగోస పెడుతుందని, రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు.సామాన్య ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్,మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్,సీనియర్ నాయకులు మల్లయ్య, ఆదిరెడ్డి నరసయ్య,శరత్,వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు,బిఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్: ఎమ్మెల్యే పల్లా



ప్రజాపక్షం/ చేర్యాల : ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు.. 6 గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల్ని మహిళలను యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసి గెలిచిందని, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నీళ్లున్నా, పంపులున్నా, తపాస్‌పల్లికి కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదని? రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని పల్లా ప్రశ్నించారు. గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాల డివిజన్ ఆధ్వర్యంలో రైతులు, మహిళలు నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మెల్యే పల్లా పాల్గొని మాట్లాడుతూ, గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ తపాస్‌పల్లి ప్రాజెక్టుకు నీటిని అందించలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పల్లా అన్నారు. ధూల్మిట్ట, మద్దూరు, కొమురవెల్లి, చేర్యాల తదితర ప్రాంతాల్లో పేదలు, రైతుల భూములను 22ఎ నిబంధన కింద పెట్టి రిజిస్ట్రేషన్లు కాకుండా పేదల భూములకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పల్లా ఆరోపించారు. 22ఎ నుంచి భూములను మినహాయించేందకు కొందరు రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పల్లా డిమాండ్ చేశారు. అలాగే సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో నేరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దగ్గర పడుతున్న ఒక్క పింఛన్ కూడ అదనంగా ఇవ్వలేదన్నారు. అదేకాకుండు నిబంధనల పేరిట 2 లక్షల పింఛన్ తొలగించినట్లు తెలిపారు. కాల్వల ద్వారా నీరిచ్చి, కడుపు నింపిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. ఎట్లా ఉండే తెలంగాణ ఎట్లా అయిందని అనేది గ్రామ స్థాయిలో ఉండే ప్రజలకు అర్థమౌతోందని అన్నారు. కెసిఆర్‌ను విమర్శించే ముందు మీ వైఫల్యాలను చూసుకోండి అని, పల్లా కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరుపున పోరాటం కొనసాగిస్తుందని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హామీల అమలులో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరుల రక్షణకు పటిష్ట చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలోని నీటి వనరులను పరిరక్షిస్తూ ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ పనితీరుపై సంబంధిత అధికారులు,ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో ఎలాంటి ఆక్రమణలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.నీటి వనరుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని చిన్నతరహా నీటిపారుదల చెరువుల కట్టల పటిష్టతను పరిశీలించాలని,తూములు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు.అవసరమైన చోట మరమ్మతు పనులను గుర్తించి, వాటికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. కాలువల భూముల్లో ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరుల నిర్వహణ, కాలువల పరిస్థితి, చెరువుల కట్టలు,తూముల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అధికారులు, ఇంజినీర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పనుల పురోగతి, నీటి వనరుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు,ఇంజినీర్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రజాపక్షం / కొత్తపల్లి : భగవంతున్ని అన్నివేళలా కొలిచినవారికి సుఖ సంతోషాలతోపాటు అనేక రకాల లాభాలు చేకూరుతాయని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం మంకమ్మతోట ఆల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్, భగత్‌నగర్‌లో గల ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో శ్రీ కృ ష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆ యన మాట్లాడుతూ ద్వాపర యుగంలో మధుర లో కంసుడి ఖారాగారంలో దేవకి వసుదేవలకు అ ష్టమ గర్భంగా శ్రీకృష్ణుడు జన్మించాడని శ్రావణమాసం బహుళపక్ష అష్టమి తిథి రోహిణి నక్షత్రం లో అర్ధరాత్రి వేళ లోక కళ్యాణం కోసం స్వామివా రు భూమిపై అవతరించాడని అన్నారు. స్వామివారికి అటుకుల ప్రసాదం, శనగపప్పు వడలు సమర్పిస్తారని తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉట్టీ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులు, రిజర్వాయర్ల సంరక్షణ, అభివృద్ధికి చర్యలు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లాలో గుర్తించిన చెరువుల సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చెరువులు సంరక్షణ, అభివృద్ధిపై అటవీ శాఖ, రెవెన్యూ, నీటి పారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 164 చెరువులు గుర్తించామని వెల్లడించారు. ఆయా చెరువుల హద్దులు, పూర్తి విస్తీర్ణం, ఎఫ్ టీ ఎల్ ను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ, నీటి పారుదల ఇతర శాఖల సమన్వయంతో సర్వే, మ్యాపింగ్, ఆన్‌లైన్‌లోనమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వాటి అభివృద్ధి కోసం అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.

**భూముల రీ సర్వేలో భాగస్వాములు కావాలి..**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో ఆయా శాఖల అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సర్వే కొనసాగుతుందని తెలిపారు. అటవీ శాఖ, నీటి పారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన భూముల వివరాలు సర్వే అధికారులకు ఇవ్వాలని, సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. ఆర్‌డిఒలు శ్రీధర్ బాబు, కెఎస్‌బి కుమారి,డిఆర్‌డిఒ , జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్ ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక్క 'ఒటిపి' చెబితే ఖాతా ఖాళీ

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలోని కాసార్లగడ్డ బస్టాండ్ వద్ద సైబర్ మోసాలు,గంజాయి వినియోగం, రవాణాపై ముత్తారం పోలీసులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.ముత్తారం ఎస్సై ఎన్.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ..సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులు,పోలీసు అధికారులు లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పేరుతో ఫోన్లు చేసి అమాయక ప్రజలను మోసాలకు గురిచేస్తున్నారని తెలిపారు.''బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం'' అంటూ వచ్చే నకిలీ ఫోన్ కాల్స్ నమ్మి మీ బ్యాంకు ఖాతాకు సంబంధించిన ఒటిపి, ఎటిఎం కార్డు నంబర్,సివివి నంబర్, పిన్ వంటి అత్యంత రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఒక్క ఒటిపి చెబితే క్షణాల్లో ఖాతా ఖాళీ అవుతుందని హెచ్చరించారు.ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.సకాలంలో స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్మకాలు లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు తిరుపతి రెడ్డి,చంద్రమోగిలి,కానిస్టేబుల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రానికి బాకీ పడిన కల్వకుంట్ల కుటుంబం

* ఇది ఫామ్‌హౌస్ పాలన కాదు ప్రజా పాలన
* రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




ప్రజా పక్షం/ వేములవాడ: బిఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, ఆ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గత 1000 రోజులుగా ప్రతి పక్ష నేతగా కెసిఆర్ పూర్తిగా విఫలం ఆయన నేపథ్యంలో గురువారం వేములవాడ పట్టణంలో కెసిఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం ఇచ్చి అమలు చేయని హామీలను, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సుమారు 500 మీటర్ల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న వైఫల్యాలను, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను రద్దు చేయకుండా, కొత్తగా 120కి పైగా కార్యక్రమాలు, పథకాలను ప్రజల కోసం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి బాకీ పడ్డది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కల్వకుంట్ల కుటుంబం, బిఆర్ఎస్ పార్టీయేనని విప్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్. అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రజలతో ఉన్న అనుబంధాన్ని తెంచుకుందని అన్నారు.ప్రజలకు వాస్తవాలను వివరించేందుకే ఈ భారీ ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టామని అన్నారు.ఇది ఫామ్ హౌస్ పాలన కాదు. ప్రజా పాలన అని రాబోయే రోజుల్లోనూ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలనే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### పేద యువత ఉన్నత స్థాయికి ఎదగాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పేద యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రుల కల సాకారం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో పిఎస్ఆర్ ట్రస్ట్, రైట్ ఛాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన యువత ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతో పిఎస్ఆర్ ట్రస్టు, రైట్ ఛాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కుటుంబాల్లో కనిపించే ఆనందం, వారు చూపే కృతజ్ఞత వర్ణించలేనిదన్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించిన తర్వాత మీ వద్దకు సాయం కోసం వచ్చే పేదలను, మనుషులను గౌరవిస్తూ న్యాయం చేయాలన్నారు. కష్టపడకుండా ఏది రాదని ఒకవేళ అయాచితంగా లభించిన అది శాశ్వతంగా నిలవదన్నారు. మన సొంత కష్టంతో సాధించిన విజయమే మనకు నిజమైన తృప్తిని, శాశ్వత స్థానాన్ని ఇస్తుందన్నారు. ఉచిత శిక్షణకు 2,300 మంది నమోదు చేసుకున్నారని అందులో ప్రతీ రోజు హాజరయ్యే 1500 మందికి పైగా అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులచే బోధన, నాణ్యమైన స్టడీ మెటీరియల్‌తో పాటు సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల పాటు అభ్యర్థులు క్రమశిక్షణతో ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను నెరవేర్చాలన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితాల్లో అనుకున్న లక్ష్యాలను, పోటీ పరీక్షల్లో విజయం సాధించడంలో విషయ పరిజ్ఞానంతో పాటు 90 శాతం మానసిక ధృక్పథ ఆత్మవిశ్వాసం, పట్టుదల కీలకమన్నారు. ఆటంకాలు దాటుకుంటూ లక్ష్యం దిశగా సాగాలని సూచించారు. రాబోయే పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు డిసిపి రామానుజం, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

#### గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**కూసుమంచి:** గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కూసుమంచి మండలం కేశవాపురంలో రూ. 20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో కేశవాపురానికి రూ. 4కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు చేశామని, రూ 3.30కోట్లతో బిటి రోడ్డు, రూ. 40లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, విద్యుత్, అంగన్‌వాడీ, తాగునీటి సదుపాయాలు కల్పించామని తెలిపారు. యూరియా కొరతను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిసిఒ గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ఇ వెంకట్‌రెడ్డి, డిపిఒ వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్య శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఒ ఎన్. శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, కేశవాపురం సర్పంచ్ బానోతు మమత, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలోని 14,15,16 వార్డులో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు గురువారం పండుగలా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే మంత్రి తరుపున కొత్త బట్టలను లబ్ధిదారులకు అందజేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇందిరమ్మతో తమ సొంతింటి కలను నెరవేర్చిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్, కౌన్సిలర్లు తమ్మినేని మంగతాయి. ఇనుప రాంబాబు, కృష్ణవేణి, ప్రసాద్, మహేష్, కాంగ్రెస్ నాయకులు ఏటుకూరి సుధాకర్, గురు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు పటిష్ట చర్యలు: ఎస్‌పి రోహిత్‌రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా మహిళా భద్రతా విభాగంను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, కేసుల దర్యాప్తు మరియు పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, కౌన్సిలింగ్, పునరావాసం తదితర కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం జిల్లా మహిళా భద్రతా విభాగం ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ జిల్లా మహిళా భద్రతా విభాగం సభ్యులతో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, బాధితులకు అండగా నిలవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న మహిళా భద్రతా బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా పోలీస్ స్టేషన్, కౌన్సిలింగ్ కేంద్రాలు తదితర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఎస్ఐ శ్రీనివాస్, ఎఎస్ఐ కస్తూరి, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సాంకేతిక సలహాలు, సేవలు అందించాలి

### ‘ఆత్మ’ ప్రాజెక్టు డైరెక్టర్ సరిత



**ప్రజాపక్షం/రఘునాథ-పాలెం :** డీలర్లు వ్యాపారులుగానే కాకుండా రైతులకు సాంకేతిక సలహాలు, నాణ్యమైన సేవలు అందించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ సరిత తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు సాంకేతిక సలహాలు, నాణ్యమైన సేవలు అందించేందుకు ఏడాది కాలపు డిప్లోమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్ పుట్ డీలర్స్ (దేశీ) శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 79 మంది ఇన్‌పుట్ డీలర్లకు గురువారం రఘునాథపాలెం రైతు వేదిక నందు జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ సరిత మాట్లాడుతూ డీలర్లు కేవలం వ్యాపారులుగానే మిగిలి పోకుండా రైతులకు సరైన మార్గదర్శనం చేసే పారా ఎక్స్‌టెన్షన్ అధికారులుగా సేవలు అందించాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, వాణి మాట్లాడుతూ సకాలంలో తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించడంలో ఇన్‌పుట్ డీలర్ల పాత్ర కీలకమన్నారు. ఎఒలు అరుణ కుమారి, అరుణ జ్యోతి, భాస్కర్‌రావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వ్యవసాయ చట్టాల పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ఉపయోగించి రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, డీలర్లు పాల్గొన్నారు.

## ‘బ్లూమింగ్ మైండ్స్’లో కృష్ణాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు శ్రీ కృష్ణుడు, రాధ వేషధారణలతో అలరించారు. వేడుకలను భక్తి శ్రద్ధలతో ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలతో పాటు ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుడు ధర్మాన్ని, సత్యాన్ని, కర్తవ్య నిష్టను, మానవత విలువలను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. శ్రీకృష్ణుని జీవితంలోని మంచి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను చిన్నతనం నుంచే విద్యార్థులకు తెలిసేలా తమ పాఠశాలలో పండుగల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోసానికి పాల్పడిన ఇద్దరు రిమాండ్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నగలకు మెరుగుపెడతామని నమ్మించి మోసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను గురువారం రిమాండ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం లోని ఎస్‌సి, బిసి కాలనీలో త్రివేణి అనే మహిళ పట్టీలకు మెరుగు పెడతామని బీహార్ కు చెందిన పంకజ్ కుమార్, పవన్‌కుమార్ పౌడర్ లిక్విడ్‌లో కలిపి పట్టీలను తరుగు చేసి, అందించటంతో మోసం చేశారని గ్రహించి బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి... గురువారం ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అంగన్‌వాడీలో కలుషిత ఆహారం

### ఐదుగురు చిన్నారులకు అస్వస్థత

### కూరలో గన్నేరు ఆకులు పడినట్లు అనుమానం

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** అంగన్‌వాడీ కేంద్రంలో కలుషిత ఆహారం తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని కిష్టారం పంచాయతీలో గల ఓ అంగన్ వాడీ కేంద్రంలో మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఘటన చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళనలతో గురువారం బట్టబయలైంది. కిష్టారం గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో గత మూడు రోజుల క్రితం ఆయా లేకపోవడంతో ప్రైవేట్ గా పెట్టుకున్న వంట మనిషి ఆహారాన్ని వండే క్రమంలో చుట్టుపక్కల ఇండ్లలో నుండి ఆకుకూరలు తెంపుకొచ్చి పప్పులో వేసిందని, చిన్నారులకు వడ్డించిన పప్పు కూరలో కొన్ని విషతుల్యమైన ఆకులు పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆహారాన్ని పిల్లలకు వడ్డించడం, అవి తిన్న ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఆహారం తీసుకున్న తర్వాత పిల్లలకు అనారోగ్య లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన జరిగిన విషయం బయటకు రాకుండా గత మూడు రోజులుగా చిన్నారులకు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే ఆహారం విషయంలో టీచర్లు, ఆయాలు నిర్లక్ష్యం వల్లనే ఇదంతా జరిగిందని, ఆహారంలో అనుమానంగా ఉన్న ఆకులు పడిన విషయం టీచర్ ఎందుకు గుర్తించలేదని, ఘటన జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అసలు ఏం జరిగిందనేది ఇపుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఐదుగురు పిల్లల్ని ఖమ్మం మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అసలు టీచర్లే ఉండటం లేదని ఆయాలే అంతా తామే నడిపిస్తున్నారని, మరి కొన్నిచోట్ల టీచర్లు వస్తున్నట్లు హాజరు పట్టికలో ఉంటుంది కానీ, టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాలలో కనిపించ డం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తక్షణమే సత్తుపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని సెంటర్లలో జిల్లా ఉన్నతాధికారు లు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిర్లక్ష్యం వహిస్తున్న సూపర్వైజర్లు, టీచర్లు, అయాలపై వేటు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎసిబి వలలో ఫారెస్టు బీట్ ఆఫీసర్

### ట్రెంట్ కొట్టకుండా ఉండేందుకు

### రూ. 30వేల డిమాండ్

### డబ్బు తీసుకుంటుండగా పట్టివేత



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పోడు రైతు భూమిలో ట్రెంచ్ కొట్టకుండా ఉండేందుకు రూ. 30వేలు లంచం డిమాండ్ చేసిన ఫారెస్ట్ బీట్ అధికారి బానోత్ రవికుమార్‌ను ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆళ్లపల్లి మండలం రామానుజగూడెంలో మధ్యవర్తి సాధిక్ ద్వారా లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేశారు. కాచ్చనపల్లి ఇన్‌చార్జిగా ఉన్న రవికుమార్ పోడు రైతును ట్రెంచ్ నుంచి తప్పించేందుకు రూ. 30వేలు డిమాండ్ చేసినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. రైతు ఫిర్యాదుతో నిర్వహించిన దాడిలో సాధిక్ లంచం తీసుకుంటుండగా పట్టుకుని, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ఎసిబి డిఎస్‌పి వై. రమేష్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది అటవీశాఖలో నమోదైన నాలుగో అవినీతి కేసు ఇదేనని తెలిపారు. లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు

## నేడు ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ

### హాజరుకానున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని సిద్దారం రోడ్ ఎంఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఓ ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్, కలెక్టర్ దివాకర్ ఐఎస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల, గ్రామస్థాయి నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## భద్రాద్రికి రైలు బాట

### మంత్రి తుమ్మల విజ్ఞప్తికి కేంద్ర మంత్రి స్పందన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో కీలకమైన పాండురంగాపురం– మల్కన్‌గిరి రైల్వే నిర్మాణానికి ముందడుగు పడింది. పూర్తి ప్రాజెక్టుకు భూసేకరణ, అటవీ అనుమతులు, గోదావరి వంతెన నిర్మాణం వంటి సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతున్నందున ఎలాంటి ఆటంకాలు లేని పాండురంగాపురం నుంచి సాకేతపూరి (సారపాక) వరకు గల 16 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ పనులను తొలిదశలో త్వరితగతిన చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌ను కోరారు. ఇందుకు అవసరమైన భూసేకరణ చేపట్టి రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ సానుకూలంగా స్పందించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మార్గం పూర్తయితే దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రాకపోకలు సులభతరమై ఆధ్యాత్మిక పర్యాటకం కొత్త పుంతలు తొక్కనుంది. స్థానికంగా ఉన్న సింగరేణి కేటిపిఎస్ వంటి భారీ పరిశ్రమల రవాణా మెరుగుపడి ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో భూసేకరణను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## ఎఐటియుసి పోరాటంతో కార్మికులకు ప్రయోజనాలు

### కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సి సమక్షంలో జరిగిన చర్చలు, నిరంతర పోరాటం ఫలితంగా సింగరేణి యాజమాన్యం పలు కీలక డిమాండ్లపై అంగీకారం తెలిపిందని ఎఐటియుసి కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి తెలిపారు. గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 8న సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం యాజమాన్యంతో పలుసార్లు చర్చలు జరిపినా, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగించామని తెలిపారు. ఎఐటియుసి ఒత్తిడితో కార్మికులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పలు అంశాలపై అగ్రిమెంట్లు జరిగాయని పేర్కొన్నారు. ప్రధానంగా పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, 2025–26 వాస్తవ లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ల మూడేళ్ల నిబంధనలో మార్పు, అర్హులైన మైనింగ్ స్టాఫ్, మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు వంటి కీలక అంశాలపై అంగీకారాలు సాధించామని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సిబిఎస్ఇ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఇఎస్ఐ సదుపాయం కల్పించే అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం, మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెలలోపు ఆఫీస్ ఆర్డర్లు, సొంత ఇంటి పథకం, సేఫ్టీ మెటీరియల్ సరఫరా, సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు తదితర అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని రమణమూర్తి తెలిపారు.

#### కొత్త గనులతోనే సింగరేణి భవిష్యత్తు..

సింగరేణి సంస్థ అభివృద్ధికి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని, కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని రమణమూర్తి కోరారు. బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొని కొత్త బ్లాకులను సంస్థకు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఎఐటియుసి విధానమని స్పష్టం చేశారు. ఎఐటియుసి సాధిస్తున్న విజయాలను కొన్ని సంఘాలు ఓర్వలేక విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులోనూ నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని రమణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యాక్షులు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బేరర్లు నితిన్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐని బైక్‌తో ఢీకొట్టిన గంజాయి స్మగ్లర్లు

### తనిఖీల నుంచి తప్పించుకునేందుకు

### బైక్‌తో దూసుకొచ్చిన యువకుడు, యువతి

### ఎస్‌ఐ పుప్పాల రామారావుకు గాయాలు

### 12 కేజీల గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/వైరా:** గంజాయి తరలిస్తూ పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులు ఏకంగా విధుల్లో ఉన్న ఎస్‌ఐని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన ఘటన వైరాలో కలకలం రేపింది. ఈ ఘటనలో వైరా ఎస్ఐ పుప్పాల రామారావుకు గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం పెద్దపల్లికి చెందిన ఆకుల మిత్ర చైతన్య, పెరం హేమలత ద్విచక్ర వాహనంపై ఒడిశా నుంచి హైదరాబాద్ వైపు గంజాయి తరలిస్తున్నట్లు ఈగల్ టీమ్ నుంచి వైరా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ రామారావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా వస్తున్న బైక్‌ను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా నిందితులు ఆగకుండా వేగంగా దూసుకొచ్చారు. ఈ క్రమంలో బైక్ ఎస్ఐ రామారావును బలంగా ఢీకొట్టడంతో ఆయన కిందపడిపోయి గాయపడ్డాడు. అనంతరం బైక్ అదుపుతప్పి కిందపడటంతో యువకుడు యువతికి కూడా గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు వైరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బైక్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడటంతో 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మిత్ర చైతన్య, హేమలత కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇద్దరూ కలిసి మోతుగూడెం, చర్ల తదితర ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలను సందర్శించినట్లు సమాచారం గత నెల 22న హేమలత పుట్టినరోజు సందర్భంగా ఆమెకు ఐఫోన్ బహుమతిగా ఇవ్వాలని మిత్ర చైతన్య భావించినట్లు తెలుస్తుంది. ఇందుకోసం గంజాయిని ఒడిశా నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లో విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బయల్దేరినట్లు పోలీసుల విచారణ వెల్లడైనట్లు సమాచారం. అయితే వైరా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీలు వారి ప్రయాణానికి బ్రేకులు వేశాయి. పోలీసులు నిర్వహించిన తనిఖీలు వారి ప్రయాణానికి బ్రేకులు వేశాయి. పోలీసులను తప్పించుకునే ప్రయత్నంలో ఎస్‌ఐని ఢీకొట్టడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనలో 12 కేజీల గంజాయి పట్టుబడటంతో పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. గంజాయిని ఒడిశాలో ఎక్కడి నుంచి సేకరించారు? ఎవరితో సంబంధాలు ఉన్నాయి? హైదరాబాద్‌లో ఎవరికి విక్రయించేందుకు తీసుకెళుతున్నారు? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుల వెనక మరెవరైనా ఉన్నారా? గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులు ఎవరు? అనే అంశాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

### గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల అధికారులతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మండలంలో జరిగిన అభివృద్ధిని అభివృద్ధి పనులను వివరించారు. మండలవ్యాప్తంగా జరుగుతున్న సమావేశానికి కొంతమంది అధికారులు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలసత్వం వహిస్తే ఊరుకోమని సమయపాలన పాటించాలని అన్నారు. మం డలంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా సర్ కార్యక్రమంపై ఆయన చర్చించారు ఓటర్ల జాబితాలో ఓట్లు లేకపోతే జనాభా లెక్కలు లేనట్టే అని అ న్నారు. ముఖ్యంగా ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, విబి–జి రామ్‌జి శాఖలకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. విద్యుత్, మంచినీటి సమస్య రాకుండా చూడాలని, అదేవిధంగా మం డల వ్యాప్తంగా పంచాయతీకి ఐదుగురు రైతులను ఎంపిక చేసి ఇంకుడు గుంతలు చొరవ తీసుకోవాలని అన్నారు. ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గోదావరి నీటి ని మండలంలో ఉన్న చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. డ్వాక్రా సభ్యులకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని అం దులో భాగంగా వినోబా నగర్‌కు చెందిన ఓ మ హిళ గ్రూప్‌కు వడ్డీ లేని రుణం చెక్కును అందజేశారు. అందులో ముగ్గురు ఇందిరమ్మ ఇండ్లను ని ర్మించుకోవడం కూడా జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని, గ్రామానికి సంబంధించిన సమాచారం త ప్పనిసరిగా ప్రతీ కార్యదర్శి వద్ద ఉండాలని అ న్నారు. గ్రామంలో ఎంతమందికి రైతు రుణమా ఫీ అయింది, ఎంత మందికి ఇందిర ఇండ్లు వ చ్చాయి, ఎంతమంది పెన్షన్లు తీసుకుంటున్నారు అనే సమాచారం ఉండి తీరాలని అన్నారు. అదేవిధంగా రివ్యూ జరిగే సమయంలో అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావాలని హెచ్చరించారు. ఇష్టం లేకపోతే వెళ్ళిపోవచ్చు అని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు రావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ తాళ్లూరి రవి, అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆర్థిక వృద్ధి..
# ప్రపంచ విశ్వాసానికి మూలం

- ప్రధాని మోదీ: బెల్జియం పిఎం బార్ట్ డి వెవర్‌తో విస్తృత చర్చలు



**న్యూఢిల్లీ :** వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, సాంకేతిక రంగాలలో సహకారాన్ని విస్తరించుకోవాలని భారత్, బెల్జియం గురువారం ప్రతిజ్ఞ చేశాయి. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్‌తో న్యూ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో విస్తృత చర్చలు జరిపారు. బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్ మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల ప్రధానులు పలు రంగాలలో వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేసే విషయమై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇక్కడొక మీడియా ప్రకటనను విడుదల చేశారు. గత త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8శాతం ఆర్థిక వృద్ధిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. దేశం ఎదుగుదల ప్రపంచ విశ్వాసం చూరగొనడానికి, సరికొత్త అవకాశాలకు మూలంగా నిలిచిందన్నారు. భారత్–యురోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్ ఒక ప్రధాన మైలురాయిగా అభివర్ణించారు. అలాగే, న్యూఢిల్లీ, బ్రసెల్స్ గతంలో కంటే విస్తృతమైన, మరింత వ్యూహాత్మకమైన సంబంధాన్ని నిర్మిస్తున్నాయని పేర్కొన్నారు. నేడు ప్రపంచం గొప్ప సంక్షోభ కాలాన్ని ఎదుర్కొంటున్నదని, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ఆహారం, ఇంధనం, సరఫరా గొలుసులు ఇలా ప్రతీరంగం అనిశ్చితితో ప్రభావితమవడం బాధాకరం అన్నారు. ఈ సవాల్‌తో కూడిన వాతావరణంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగించిందని, గత త్రైమాసికంలో భారత్ 7.8శాతం వృద్ధిని నమోదు చేసిందని, నేడు భారతదేశ వృద్ధి గాథ ప్రపంచ విశ్వాసం చూరగొనడానికి, కొత్త అవకాశాలకు మూలంగా మారుతోందని నరేంద్రమోదీ వివరించారు. ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని మొత్తం సంబంధానికి 'ఒక కీలక స్తంభం'గా అభివర్ణించారు.'ఈ రోజు, ఇరుదేశాల మధ్య సైనిక మార్పిడులను, శిక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి మేం అంగీకరించాం.మా ప్రభుత్వాలు, రక్షణ పరిశ్రమల మధ్య కుదిరిన ఒప్పందాలు రక్షణ సహ–అభివృద్ధి, సహ–ఉత్పత్తికి కొత్త అవకాశాలు తెరుస్తాయి' అని మోదీ తెలిపారు. నేరాల నిర్మూలనలో మన ఏజెన్సీల మధ్య నిఘా భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలే ఈ సంప్రదింపులకు 'అతి పెద్ద బలం' అని ప్రధానమంత్రి అన్నారు. స్టార్టప్‌ల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, సముద్ర రంగంలో సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించడానికి ఇరుదేశాలు అంగీకరించాలని చెప్పారు. 'మేం విశ్వవిద్యాలయ పరిశోధన సహకారాన్ని కూడా బలోపేతం చేస్తాం. అదే సమయంలో ప్రతిభావంతుల బదిలీని సులభతరం చేయడానికి, త్వరలోనే వలస, బదిలీ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం' అని మోదీ తెలిపారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యకతను నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉన్నత సాంకేతికత, స్వచ్ఛ ఇంధన రంగాలలో సహకారాన్ని విస్తరించుకోవడానికి ఇరుదేశాల ప్రాధాన్యతలను మోదీ నొక్కిచెప్పారు. జులైలో భారతదేశం, బెల్జియం ఒక కొత్త మంత్రివర్గ స్థాయి వ్యూహాత్మక చర్చను ఏర్పాటు చేయడం ద్వారా రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నాయి. తొలి బెల్జియం–భారత వ్యూహాత్మక చర్చ జరిగింది. జులై 15న బ్రస్సెల్‌లో జరిగిన ఈ సమావేశానికి విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, బెల్జియం డిప్యూటీ ప్రధానమంత్రి మాక్సిమ్ ప్రివోట్ సహ–అధ్యక్షత వహించారు. భారతదేశం, బెల్జియం పునరుత్పాదక శక్తి, స్వచ్ఛమైన సాంకేతికతలు, సుస్థిరత రంగాలలో సహకారాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. బెల్జియం కంపెనీ జాన్ కాకరిల్, కాకినాడలో 2 గిగా వాట్ల అంచనా సామర్థ్యంతో ఒక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తోంది. ప్రధాన యురోపియన్ సముద్ర, లాజిస్టిక్ కేంద్రంగా బెల్జియంకు ఉన్న స్థానం ఓడరేవులు, షిప్పింగ్ సరఫరా గొలుసులలో సహకారానికి అవకాశాలను కల్పిస్తున్నది.

# తల పగలగొట్టి..
# అరెస్టు తప్పించుకున్నా

- జంతర్ మంతర్ ప్రదర్శకులపై దాడిచేసిన ఉన్మాది వీరంగం
- ఎందుకు అరెస్టు చెయ్యలేదని నిలదీసిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద జులై నెలలో కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆందోళన సందర్భంగా ఒక ప్రదర్శకురాలి తండ్రి తల పగలగొట్టానని, అరెస్టు కాకుండా తప్పించుకున్నానని బాహాటంగా వీడియో ద్వారా ప్రకటించిన ఉన్మాది స్వతంత్ర భరద్వాజ్‌ను పోలీసులు ఎందుకు అరెస్టు చేయకుండా వదిలేశారని ప్రతిపక్షాలు బిజెపిపై విమర్శనాస్త్రాలు సంధించాయి. తక్షణం భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. సెక్షన్ 307 (హత్యాయత్నం కేసు) కింద తనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ప్రపంచం ఈ విషయాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భరద్వాజ్‌స్వయంగా ప్రకటించాడు. ఢిల్లీ మంత్రి కపిల్‌మిశ్రా, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరుల ఆశీర్వాదాలు తనకు ఉన్నాయని హిందుత్వాన్ని ప్రభావితంచేసే కార్యకర్త భరద్వాజ్ ఒక వీడియో ద్వారా చెప్పడాన్ని ప్రతిపక్షాలు ప్రముఖంగా ప్రజలముందుకు తీసుకువచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశాయి.
ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా కపిల్ మిశ్రా, చిరాగ్ పాశ్వాన్ తదితరులను పెద్దన్నయ్యలుగా నేరస్థుడు భరద్వాజ్ పిలుచుకుంటున్నాడని కాక్రోచ్ జనతాపార్టీ, కాంగ్రెస్‌పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు తీవ్రంగా స్పందించాయి.
భరద్వాజ్‌గా పిలిపించుకునే స్వతంత్ర భరద్వాజ్‌కు సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్‌లో 1.84 లక్షలమంది ఫాలోయింగ్ ఉంది. అతగాడు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకుని అనేక వీడియోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేశాడు. జులై 20వ తేదీన పోలీసులు భారీస్థాయిలో హింసాత్మకంగా విరుచుకుపడిన రోజున ప్రదర్శకులను ఉగ్రవాదులుగా, బొద్దింకలుగా అభివర్ణించాడు. ఒక్కరోజుపాటు తనలాంటి సనాతన యోధులను పోలీసులుగా పనిచేడానికి అనుమతించాలని కూడా సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశాడు. మరో వీడియోలో సివిల్ డ్రస్సుల్లో ఉన్న వ్యక్తులే ప్రదర్శకులపై దాడులు చేశారని, నిజమైన పోలీసులు ఇప్పుడు వచ్చారని పేర్కొన్నాడు. తనను తాను ''స్వతంత్ర సనాతన యోధ''గా ప్రొఫైల్‌లో రాసుకున్నాడు.
కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా–డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ఛైర్‌పర్సన్ సుప్రియ శ్రినట్ ఈ వీడియోను షేర్ చేశారు. ''నేను స్వతంత్ర భరద్వాజ్. సిజెపి నిరసన ప్రదర్శకురాలు నిషు అజాద్ తండ్రి సంజయ్‌పై నేను దాడి చేశానని గర్వంగా చెబుతున్నా, అతడి తల బద్దలు కొట్టాను, ఆయన తలకు 60 కుట్లు పడ్డాయి, ఆయన చావు బ్రతుకులమధ్య ఉన్నాడు, ఇది 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు, కానీ నేను జైలుకు వెళ్ళలేదు, దాడి చేసిన తర్వాత ఆ రాత్రి అంతా రోడ్ల మీద స్వేచ్ఛగా తిరిగాను, మంత్రి కపిల్ మిశ్రా నుండి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత నాకు ప్రశాంతత లభించింది'' అని స్వతంత్ర భరద్వాజ్ తన వీడియో సందేశంలో చెప్పాడు. కపిల్ మిశ్రా, చిరాగ్ పాశ్వాన్, మోదీజీ... వీళ్ళంతా నాకు పెద్ద అన్నయ్యలాంటివారు, నాకు ప్రతి ఒక్కరి మద్దతూ ఉంది'' అని భరద్వాజ్ పేర్కొన్నాడు. దీనిపై ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆయన నిలదీశారు. ''మీరు తప్పనిసరిగా ఈ వీడియోను చివరి వరకూ చూడాలి, మీ రక్తం సలసలా మరిగిపోతుంది, భగత్‌సింగ్ లాంటి గొప్ప నాయకులు ఎందుకు తమ జీవితాలను త్యాగం చేశారు? ఈ విధమైన వాళ్ళని బాహాటంగా రక్షించే ఒక ప్రధానమంత్రి ఈ దేశానికి వస్తారని వారు ఊహించారా?'' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాక్రోచ్ జనతాపార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తీవ్రంగా స్పందిస్తూ,''సిజెపి కార్యకర్త నిషు అజాద్ తండ్రి సంజయ్ తల పగిలిపోయింది, ఆయన మెదడుకు పెద్ద గాయమైంది, ఇది హత్యాయత్నం కేసు, కానీ పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయలేదు, భరద్వాజ్‌ను తక్షణం అరెస్టు చేయాలి, బహిరంగంగా నేరం ఒప్పుకున్నాగానీ అతడిపైన ఎందుకు చర్య తీసుకోలేదు'' అని ప్రశ్నించారు. సంజయ్ తీవ్రమైన తల గాయంతో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఐతే డిప్యూటీ పోలీస్ కమిషనర్ సచిన్ శర్మ, అసిస్టెంట్ కమిషనర్ అజయ్ శర్మ మాత్రం భరద్వాజ్‌ను అరెస్టు చేయాలన్న డిమాండ్‌ను తిరస్కరించారు. వెళ్ళి కోర్టు ఆర్డర్ తెచ్చుకోవాలని తమకు ఆదేశించారని సౌరవ్ దాస్ విమర్శించారు. ఈ విధంగా నేర ముఠాలను ప్రోత్సహిస్తున్న మంత్రి కపిల్ మిశ్రా ఎందుకు తన పదవికి రాజీనామా చేయలేదని ఎక్స్ వేదికగా దాస్ ప్రశ్నించారు.

# కమర్షియల్ పైలట్‌గా అభినందన్ వర్ధమాన్..



**న్యూఢిల్లీ :** భారత వాయుసేనలో మాజీ గ్రూప్ కెప్టెన్, వీర చక్ర పురస్కార గ్రహీత అభినందన్ వర్ధమాన్ కొత్త కొలువును ఎంచుకున్నారు. గోవాకు చెందిన ప్రాంతీయ విమానయాన సంస్థ ఎఫ్ఎల్‌వై 91లో కమర్షియల్ పైలట్‌గా ఆయన చేరారు. ఆగస్టులోనే ఆయన ఈ ఉద్యోగంలో చేరినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. ఈ నేపథ్యంలో 22 ఏళ్లుగా వాయుసేనలో వివిధ హోదాల్లో పని చేసిన అభినందన్ వర్ధమాన్.. ముందస్తుగానే ఉద్యోగానికి పదవి విరమణ చేశారు. అయితే కొత్త ఉద్యోగంలో చేరికపై ఇప్పటి వరకు ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు. 2019లో ఫిబ్రవరిలో పుల్వామా వద్ద జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు మరణించారు. అందుకు ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడులు చేసింది. ఈ నేపథ్యంలో పాక్ వైమానిక దళానికి ఎఫ్ 16 యుద్ధ విమానం భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిని తన మిగ్ విమానంతో వింగ్ కమాండర్ అభినందన్ ఆకాశంలోనే ధ్వంసం చేశారు. అదే సమయంలో ఆయన ప్రయాణిస్తున్న ఆ విమానం దెబ్బతింది. ఈ నేపథ్యంలో పారాచూట్ సాయంతో కిందకి దూకారు. దాంతో ఆయన పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగంలో దిగారు. దీంతో అభినందన్‌ను పాక్ సైన్యం చుట్టుముట్టింది. మూడు రోజుల పాటు ఆయనను పాక్ సైన్యం బందీగా ఉంచింది. అభినందన్ వర్ధమాన్‌ను వెంటనే తమకు అప్పగించాలంటూ పాక్‌పై భారత్ తీవ్ర ఒత్తిడి చేసింది. దీంతో ఆయనను భారత్‌కు పాక్ అప్పగించింది. ఈ నేపథ్యంలో అభినందన్ వర్ధమాన్ పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. దేశంలో మూడో అత్యున్నత యుద్ధ పురస్కారం వీరచక్రతో ఆయనను భారత్ ప్రభుత్వం గౌరవించింది.

# మణిపూర్‌లో జాతి ఘర్షణలు...
# 306 మంది మృతి

49 మంది గల్లంతు : అసెంబ్లీలో హోంమంత్రి ప్రకటన

**ఇంఫాల్ :** మూడు సంవత్సరాల క్రితం మణిపూర్‌లో జాతి ఘర్షణలు చెలరేగాయి. 2023 మే నెలలో చెలరేగిన జాతి ఘర్షణల్లో కనీసం 306 మంది మరణించారని, 49 మంది ఇంకా గల్లంతయ్యారని రాష్ట్ర హోం మంత్రి గోవిందాస్ కొంథౌజమ్ గురువారం అసెంబ్లీకి తెలిపారు. షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టి) హోదా కోసం మైతీ వర్గం చేసిన డిమాండ్‌ను నిరసిస్తూ కొండ ప్రాంత జిల్లాల్లో గిరిజన సంఘీభావ ర్యాలీ నిర్వహించిన తర్వాత, 2023 మే 3న మైతీ, కుకీజో వర్గాల మధ్య ఈ హింస మొదలైంది. కాగా, అసెంబ్లీ సమావేశాల రెండో రోజున బిజెపి ఎమ్మెల్యే సపం రంజన్ సింగ్ అడిగిన ప్రశ్నకు కొంథౌజమ్ సమాధానమిచ్చారు. '2023 మే 3న హింస మొదలైనప్పటి నుండి, ఆగస్టు 31, 2026 నాటికి 306 మంది మరణించారు. 49 మంది ఇంకా గల్లంతయ్యారు' అని చెప్పారు. మణిపూర్ జనాభాలో మైతీలు సుమారు 53 శాతం ఉంటారని, వీరు ఎక్కువగా ఇంఫాల్ లోయలో నివసిస్తారన్నారు. మరోవైపు నాగాలు, కుకీలతో కూడిన గిరిజనులు 40 శాతం ఉంటారని, వీరు ప్రధానంగా కొండ ప్రాంత జిల్లాల్లో నివసిస్తారని చెప్పారు. నెలల తరబడి సాగిన జాతి ఘర్షణల నేపథ్యంలో, బీరెన్ సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఫిబ్రవరి 9న రాజీనామా చేసిన తర్వాత, గత ఏడాది ఫిబ్రవరి 13న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించబడింది. 2027 వరకు పదవీకాలం ఉన్న 60 మంది సభ్యుల అసెంబ్లీ, రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత తాత్కాలికంగా నిలిపివేయబడింది. బిజెపి నాయకుడు వై. ఖేమ్‌చంద్ సింగ్ ముఖ్యమంత్రిగా కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడటానికి కొన్ని గంటల ముందు, ఈ ఏడాది ఫిబ్రవరి 4న ఆ రాష్ట్రపతి పాలన ఎత్తివేయబడింది.

# టిఎంసి కార్యాలయం విధ్వంసం

**కోల్‌కతా :** కోల్‌కతా కామాక్ స్ట్రీట్‌లోని టిఎంసి కార్యాలయంపై జరిగిన విధ్వంసాన్ని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ఖండించారు. ఇలాంటి 'అఘాయిత్యాలు' కొనసాగితే న్యూఢిల్లీలోని బిజెపి నాయకుల నివాసాల బయట తమ పార్టీ ప్రదర్శనలు నిర్వహిస్తుందని ఆమె హెచ్చరించారు. ఫేస్‌బుక్ లైవ్‌లో ఈ విషయంపై మాట్లాడుతూ బిజెపి మద్దతు ఉన్న వ్యక్తులు పత్రాలు, పరికరాలను దోచుకున్నారని బెనర్జీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయంపై జరిగిన దాడి రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిని ప్రతిబింబిస్తోందని ఆమె అన్నారు. 'కోల్‌కతాలో తెల్లవారుజామున మా పార్టీ కార్యాలయంపై జరిగిన విధ్వంసాన్ని ఖండిస్తున్నాము. కోల్‌కతాలోనే శాంతిభద్రతల పరిస్థితి ఇలా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఏం జరుగుతుందో ఊహించండి' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. బిజెపి కార్యకర్తలు టిఎంసి కార్యాలయాన్ని ధ్వంసం చేసి, ఆవరణ నుంచి ముఖ్యమైన పత్రాలు, పరికరాలను తీసుకెళ్లారని బెనర్జీ ఆరోపించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆమె, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి పూర్తి అరాచకానికి పాల్పడుతోందని ఆరోపించారు. లాగే జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో జరిగిన గూండాయిజాన్ని ఖండించారు. తనను స్వేచ్ఛగా తిరగకుండా అడ్డుకునేలా ఒక పరిస్థితిని సృష్టిస్తున్నారని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. ఆరోపిత బెదిరింపులు, భయపెట్టడాలను ప్రస్తావిస్తూ, తనను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వమని ముఖ్యమంత్రి చెబుతున్నారు అని ఆమె అన్నారు. తమ నాయకులు, కార్యాలయాలపై దాడులు కొనసాగితే టిఎంసి మౌనంగా ఉండబోదని బెనర్జీ హెచ్చరించారు. టిఎంసిపై ఈ అఘాయిత్యాలు ఆగకపోతే, న్యూఢిల్లీలోని బిజెపి నాయకుల ఇళ్ల బయట ధర్నాలు చేస్తామని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. గురువారం తెల్లవారుజామున కోల్‌కతాలోని కామాక్ స్ట్రీట్‌లో ఉన్న తమ పార్టీ కార్యాలయాన్ని బిజెపి మద్దతు ఉన్న సాయుధులు ధ్వంసం చేశారని టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆరోపించిన తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మాస్కులు, హెల్మెట్లు ధరించిన వ్యక్తులు టెలివిజన్ సెట్లు, ప్రింటర్‌తో సహా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకుని ఆ ప్రాంగణం నుండి వెళ్తున్నట్లుగా సీసీటీవీ ఫుటేజీని బెనర్జీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ ఫుటేజీలో, కార్యాలయం లోపల ఉన్న ఒక గదిలో ధ్వంసమైన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా కనిపించాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారని ఒక అధికారి తెలిపారు.

# విద్య అనేది హక్కు

అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికావొద్దు : రాహుల్‌గాంధీ



**నాసిక్ :** విద్య దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థి హక్కు, అని అదేమీ ప్రత్యేక హక్కు కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికాకూడదన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో బుధవారం పర్యటించిన సందర్భంగా, తమ డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారితో సహా గిరిజన విద్యార్థుల బృందాన్ని ఆయన కలిశారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల దుస్థితితో సహా పలు సమస్యలపై ఆ విద్యార్థులు నిరసన తెలుపుతున్నారు. తరువాత ఎక్స్ వేదికగా స్పందించారు. 'విద్య అనేది ఒక ప్రత్యేక హక్కు కాదు,, అది భారతదేశంలోని ప్రతి విద్యార్థి హక్కు' అని పేర్కొన్నారు. నాసిక్ పర్యటనలో గిరిజన విద్యార్థుల బృందాన్ని కలిసిన తాను, వారి సమస్యలు, డిమాండ్లను శ్రద్ధగా విన్నానని ఆ కాంగ్రెస్ నేత తెలిపారు. చదువుకోవడానికి గౌరవప్రదమైన, సురక్షితమైన, అనుకూలమైన వాతావరణాన్ని పొందే హక్కు ప్రతి విద్యార్థికీ ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు నొక్కి చెప్పారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికాకూడదని, వారికి వ్యవస్థ మద్దతు, సాధ్యమైనంత అన్ని రకాల సహాయం అవసరం అని ఆయన అన్నారు. నాసిక్ పర్యటనలో భాగంగా, మహారాష్ట్ర కాంగ్రెస్ జిల్లా స్థాయి నాయకులతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని వారికి సూచించారు.


**CHANGE OF NAME**

I, **ALDANDI KANAKAIAH S/O. KASHAIAH,** R/o. 4-104, Ramancha, Chigurumamidi, Karimnagar, TG. hava changed my name as **VELDANDI KANAKAIAH, S/O. KASHAIAH** for all future purpose.

**CHANGE OF NAME**

I, **ALDANDI RUKMINI, W/O. KANAKAIAH,** R/o. 4-104, Ramancha, Chigurumamidi, Karimnagar, TG. have changed my name as **VELDANDI RUKMINI, W/O. KANAKAIAH** for all future purpose.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 156 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Ms. Pasikanti Soumya & Others** ... Opponents

2. Mr. Velde Srinivas, S/o. Sarvaiah, Age:41 Yrs, Occ:Superintendent, O/o. Administrative Officer Science College, Khammam, H.No: 2-7-428, Excise Colony, Hanamkonda, Warangal.
3. Mr. Velde Gyaneshwar, S/o, Sarvaiah, Age:50Yrs,Occ:Medical Officer, O/o. Civil Asst.Surgeon, Primary Health Center, Warangal, H.No: 3-9-502, Reddy Colony, Hanamkonda.
4. Mr. Tuduru Dattatreya, S/o, Ramaiah, Age: 54Yrs, Occ: Librarian, O/o.Principal Govt.Degree College, Kaghaznagar, H.No: 1-2-122/1, Near Pottisriramulu Statue, Kaghanagar.
5. Mr. Vanga Satyanarayana, S/o, Narsaiah, Age: 53Yrs, Occ: Conductor, O/o. TSRTC Karimnagar Depot, H.No: 2-10-210, Jyothi Nagar, Karimnagar.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above.Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 158 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mrs. Kandi Swetha & Others** ... Opponents

2. Mr. Kanamathareddy Chandra Shekar Reddy, S/o, Ramreddy, Age:41 Yrs, Occ: Private Employee, H.No: 1-4-84, Golden Towers, Flat No-602, Street No-8, Habsiguda, Secundrabad.
4. Mr. Sadula Sai Charan Reddy, S/o. Ravinder Reddy, Age:33 Yrs,Occ: Private Employee, H.No: 4-2-184, Dasariwada, Kothur, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 159 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Mohammad Subhanoddin & Others** ... Opponents

5. Mr. Alakaraju. Ravi, S/o, Cheralu, Age:41 Yrs, Occ: Private Employee, H.No: 5-11-503,504/E/F-1,2&3, B-Block, 1stFloor, Kandakatla Gateway, KUC XRoad, Hanamkonda.
6. Mr. Thoutam. Shiva Kumar, S/o, Lingamurthy, Age: 36 Years, Occ: Private Employee, H.No: 5-11-503, 504/E/F-1,2&3, B-Block, 1st Floor, Kandakatla Gateway, KUC XRoad, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 160 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Gopu Pradeep Reddy & Others** ... Opponents

1. Mr. Gopu Pradeep Reddy, S/o, Sammireddy, Age: 29 Yrs, Occ: Private Employee, H.No:17-4-488, Thilaknagar,Godavarikhani.
2. Mrs. Gopu Vasantha, W/o, Sammireddy, Age: 50 Yrs,Occ:Private Employee, H.No: 17-4-488, Thilaknagar,Godavarikhani.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 129 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mrs. Syed Asma & Others** ... Opponents

1. Mrs. Syed Asma, W/o, Saleem, Age: 37 Years, Occ: Business, H.No: 11-23-288/A, L.B. Nagar, Warangal.
2. Mr. Syed Kaleem, S/o, Yusuf, Age: 57 Years, Occ: Private Employee, H.No: 11-24-324, Pochammaidan, Warangal.
3. Mr. Arutla Sheshachary, S/o, Narayana Chary, Age: 51 Years, Occ: Principal, O/o. Govt.Junior College, Khanapur, H.No: 13-4-155, Gopalswamy Temple, Warangal.
4. Mr. Kogila Vijay Kuamr, S/o, Sambaiah, Age: 46 Years, Occ: Principal, O/o. Govt Jr. College, Wazeedu, H.No: 5-11-113, Naimnagar,Hanamkonda.
5. Mr. Mohammed Sadiq Ali, S/o, Mahabuba Ali, Age: 51 Years, Occ: SA, O/o. ZPSS Parvathagiri, H.No: 11-21-137/1, Madina Street, Thilak Road, Kashibugga, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 148 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Smt. Vatte Jaya Sree & Others** ... Opponents

3. Mr. Bandari Narayana, S/o.Mallaiah, Age:57 Yrs,Occ:Telecom Technician, O/o. BSNLOffice, Warangal, H.No: 6-36/1, Gollapally, Ambala, Kamalapur, Hanamkonda.
1. Mr. Sirivella Rajashekar, S/o, Kashaiah, Age:46 Yrs, Occ: Asst.Telecom Technician, O/o. BSNL Office, Warangal, H.No: 1-18-1212, Vivekananda Colony, Road No-2, Kashibugga, Warangal.
2. Mr. Mohammed Abdul Sattar, S/o, Yakub Ali, Age:60 Years, Occ:Jr. Engineer, O/o. BSNL Office, Warangal, H.No: 3-10-150, Reddy Colony, Hanamkonda, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 149 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mrs. Puli Srilatha & Others** ... Opponents

2. Mr. Puli Ravinder, S/o, Ramaswamy, Age: 58 Yrs, Occ: MTS, O/o: Hanamkonda Head Post Office, H.No: 7-2-141, Machili Bazar, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 151 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Singapuram Prem Kumar & Others** ... Opponents

3. Mr. Shilam Rajashekar, S/o, Mallaiah, Age:59 Yrs, Occ: Tech Trade-I, O/o. SCR Secundrabad Division, H.No:4-2-240, Kothur, K.U.Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 152 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Chemmala Anil & Others** ... Opponents

2. Mr. Enugala Ajay, S/o, Jampaiah, Age: 29 Yrs, Occ: Private Employee, H.No: 103-291/A, Laxmipuram, Warangal.
4. Mr. Alupula Tharun, S/o, Rajanna, Age: 38 Yrs, Occ: Private Employee, H.No: 1-19, Pegadapally, Hasinparthy, Hanumakonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 153 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Garrepelly Govardhan & Others** ... Opponents

3. Mr. Kandkatla Sadanandam, S/o, Komuraiah, Age:58 Yrs,Occ: Business, H.No: 2-558, Indiranagar, Narsampet,Warangal.
4. Mr. Eeka Venkateshwarlu, S/o, Narsaiah, Age:56 Yrs, Occ: Jr.Assistant, O/o.Girijana Co-Operative Corporation Ltd, Eturnagaram, H.No: 3-13/1, Ramaram, apaonugondla, Kothagudem.
6. Mr. Thimmapuram Raju, S/o, Gopal, Age:41 Yrs, Occ: Business, H.No: 1-172, Go palpuram, Duggondi, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 154 of 2025**

Between:
**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch** ... Disputant

AND

**Mr. Sarvvu Sadanandam & Others** ... Opponents

2 Mr. Yedla Murali, S/o, Mogilaiah, Age: 44 Yrs, Occ: Business, H.No: 4-6-137, Reddy Colony, Hanamkonda.
3 Mr. Gurrapu Sridhar, S/o, Venkateshwarlu, Age: 46 Yrs, Occ: Private Employee, H.No: 4-1-154, Kothurjenda, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

## ఏ క్షణంలోనైనా ఇరాన్‌పై మళ్ళీ దాడి: ట్రంప్

- హోర్ముజ్ జలసంధికి నాపేరే పెడతా
- జలసంధి మా అధీనంలోనే ఉంది
- ఇరాన్ దాడుల్లో ఇద్దరు సౌదీ నావికులు మృతి
- పౌర ప్రాంతాలపై దాడులకు ఇరాన్ ఖండన

**వాషింగ్టన్:** ఏ క్షణంలోనైనా ఇరాన్‌పై మరోసారి దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు.దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్ళీ తీవ్రరూపం దాల్చాయి. మంగళవారం రాత్రి అమెరికా సైన్యాలు ఇరాన్‌పై వైమానిక దాడులు చేశాయి. ఈ దాడుల సమయంలో హోర్ముజ్ జలసంధిలో నౌకలకు సెంట్‌కామ్ దళాలు ఎస్కార్ట్‌గా వెళ్ళాయి. వాటికి పూర్తి భద్రత ఇచ్చాయి. ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేసింది.అమెరికా చేసిన దాడులవల్ల దక్షిణ ఇరాన్‌లోని ఒక వివాహ వేదికకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దాడులవల్ల వివాహ మండపంలో నలుగురు మరణించారు. పదులసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. తమ సైనికులను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని, అందుకే ఎదురుదాడులు చేశామని సెంట్‌కామ్ అధికారులు ప్రకటించారు. అమెరికా దాడులకు ప్రతీకారంగా బహ్రైన్,కువైట్,జోర్డాన్ దేశాలలో అమెరికా స్థావరాలపై ఐఆర్‌జిసి సైన్యాలు దాడులు చేశాయి.ఇరాన్ చేసిన దాడుల్లో ఇద్దరు సౌదీ అరేబియా నావికులు మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది.

కాగా హోర్ముజ్ జలసంధి తమ అధీనంలోనే ఉందని ట్రంప్ బుధవారం ప్రకటించారు. జలసంధికి 'ట్రంప్ జలసంధి' అని నామకరణం చేద్దామని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రతిపాదన చేశారు. బుధవారం తెల్లవారకముందుగానే ఇరాన్ రాడార్ వ్యవస్థలపై దాడులు చేశామని ట్రంప్ కొత్త సమాచారం చెప్పారు.ఈ దాడులను ''మైనర్ లవ్ టాప్''గా ఆయన అభివర్ణించారు.

### క్రూరమైన యుద్ధనేరం: ఇరాన్

ఇరాన్‌లోని పలు రాష్ట్రాలలోని పౌర ప్రాంతాలు, మౌలిక సదుపాయాలపై అమెరికా సైన్యాలు చేసిన దాడులను ''క్రూరమైన యుద్ధనేరాలు''గా ఇరాన్ పేర్కొంది. సెంట్‌కామ్ చేసిన దాడులను ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఆత్మరక్షణకోసం ప్రతీకార దాడులు చేసే హక్కు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు ఉందని పునరుద్ఘాటించింది. హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో ఒక వివాహ వేడుకపై అమెరికా దాడులు జరిగాయి. ఈ వేడుకలలో నలుగురు మరణించారు. 70 మంది గాయపడ్డారు. ఏడాదిన్నరకాలంలో మినాబ్, లామెర్డ్‌లలో అమెరికా–ఇజ్రాయెల్ చేసిన దారుణాలను ఈ ఘటన గుర్తుకుతెస్తోందని, తమ పౌరులకు నష్టం జరిగిందని, అందుకే ప్రతీకార దాడులు చేశామని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఖుజెస్థాన్, సిస్థాన్, బలూచిస్థాన్, హోర్ముజ్‌గాన్, కెర్మాన్ రాష్ట్రాలలో పౌర ప్రాంతాలపై అమెరికా దాడులు చేసింది. ఈ దాడుల ద్వారా ఇరాన్ సార్వభౌమాధికారాన్ని,ప్రాదేశిక సమగ్రతను మరోసారి ట్రంప్ యంత్రాంగం ఉల్లంఘించిందని ఇరాన్ మండిపడింది.ఇలాంటి ఘోర నేరాలను అరికట్టేందుకు ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు, భద్రతామండలికి ఉన్న అధికారాలను గుర్తుచేసింది.

# వరద భయం వేళ...టిబెట్‌లో భూకంపం

- నేపాల్–చైనాలో ఇంకా జాడలేని 4,700 మంది
- ఇప్పటివరకూ 1,252 మృతదేహాలు స్వాధీనం
- 12 వేలమందిని కాపాడిన సహాయబృందాలు
- జెసిబిలతో బండరాళ్ళు, శిథిలాల తొలగింపు
- బిదూర్ స్కూలు పునర్నిర్మాణానికి భారత్ హామీ



**కాఠ్మండు:** నేపాల్–చైనా సరిహద్దుల్లో మళ్ళీ వరదలు వస్తాయన్న భయాలమధ్య టిబెట్‌లో గురువారం భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత 5.1గా నమోదైనట్లు జర్మనీ రీసెర్చ్ సెంటర్ ప్రకటించింది. ఒక వైపు సహాయ చర్యలు కొనసాగుతున్న సమయంలో పది కి.మీ లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు రీసెర్చ్ సెంటర్ పేర్కొంది.

ఇదిలాఉండగా, తొమ్మిదిరోజులక్రితం (ఆగస్టు 26) జరిగిన హిమాలయన్ సునామీ ఘటనలో ఇరుదేశాల సరిహద్దుల్లో ఇంకా 4,700 మంది జాడ తెలియరాలేదు. సునామీలో గల్లంతైనవారి సంఖ్య టిబెట్ వైపు కంటే నేపాల్‌లోనే ఎక్కువగా ఉంది.ఒక్క నేపాల్‌లోనే ఇంకా జాడ తెలియని ప్రజలసంఖ్య 4,216 గా తేలిందని ఎన్‌డిఆర్‌ఆర్ఎంఎ (జాతీయ ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ అథారిటీ) అధికారులు చెప్పారు. ఇప్పటివరకూ 1252 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క చిత్వాన్‌లోనే అత్యధికంగా 348 మృతదేహాలను బురదమట్టిలోంచి వెలికితీశారు. ఈ వరదల్లో 583 మంది విదేశీయులు, 86మంది ప్రభుత్వసిబ్బంది,భద్రతా సిబ్బంది,164 మంది నేపాలీ పర్యాటకులు ఈ వరదల్లో మరణించారు. వారంతా సునామీలో కొట్టుకుపోయారు. ఇప్పటికీ 4,216 మృతదేహాలు కనిపించడంలేదు. వాటి కోసం తీవ్ర గాలింపు చేస్తున్నారు. కాగా సహాయ చర్యలు చేపట్టిన సైనికులు,ఇతర పౌర సహాయ బృందాలు భోటేకోశీ నది వరదల్లో చిక్కుకున్న 11,993 మందిని గడచిన తొమ్మిది రోజులుగా బురదమట్టిలోంచి వెలికితీసుకుచ్చి ప్రాణాలు కాపాడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సహాయచర్యల్లో 21,314 మంది పాల్గొటున్నారు. వీరిలో 9.199 మంది సైనికులు, 7,912 మంది పోలీసులు,4,203 మంది సాయుధ పోలీసులు ఉన్నారు.నేపాల్ సైనికులు గడచిన తొమ్మిదిరోజుగా 690 సార్లు గగనతలంలో తిరిగి గాలింపులు కొనసాగించారు. కృష్ణభీర్ వద్ద పృథ్వీ జాతీయ రహదారిపై కొండచరియలు కుప్పకూలి మార్గం మూసుకుపోవడంతో కాఠ్మండు నగరానికి ఎల్‌పిజి వంటగ్యాస్ సరఫరాలు నిలిచిపోయాయి.16 పరిశ్రమలు గ్యాస్ సరఫరాకు కసరత్తు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా గురువారంనాడు కూడా భోటేకోశీ నదికి వరద నీటి ప్రవాహం ఇంకా పెరుగుతూనే ఉంది. దీనివల్ల త్రిశూలీ నదిలో కూడా నీటిమట్టం గణనీయంగా పెరిగేఅవకాశం ఉంది. ఈ నది రసువా,నువాకోట్ జిల్లాలమీదుగా ప్రవహిస్తుంది. ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్ళాయి.


నేపాల్‌లో నిర్మిస్తున్న వివిధ జలవిద్యుత్ ప్రాజెక్టులలో సొరంగాలలో పనిచేస్తున్న దాదాపు 900 మంది కార్మికులు గల్లంతయ్యారు. మరోవైపు నేపాల్‌లో పునర్నిర్మాణ చర్యలు,శిథిలాలను తొలగించే చర్యలను వేగవంతం చేశారు.టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థలను పునరుద్ధరించే చర్యలు ముమ్మరం చేశారు. వీధుల్లో,నదుల్లో భారీ మందాన పేరుకుపోయిన బండరాళ్ళు,శిథిలాలు,మట్టిని తొలగించేందుకు పెద్ద సంఖ్యలో జెసిబి యంత్రాలతో పనులు చేస్తున్నారు. కొన్ని చోట్ల 60 మీటర్ల మేరకు మట్టి,బండరాళ్ళు పేరుకుపోయాయి.మంచుఖండం విరిగి నదుల్లో పడటంతో 180 కి.మీ వేగంతో దారితప్పి గ్రామాల్లోకి దూసుకువచ్చిన జలప్రవాహం కారణంగా గ్రామాలు కొట్టుకుపోయాయి. ఇప్పుడు కొంత పరిస్థితి మెరుగుపడటంతో గ్రామీణ ప్రజలు తమ తమ సామాన్లకోసం వెదకులాట ప్రారంభించారు. 20,000 ఇళ్ళను దెబ్బతిన్న ఏడు జిల్లాల్లోని తీర ప్రాంతాల గ్రామాలలో,పట్టణాలలో పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది.అదేవిధంగా బిదూర్‌లో ఉన్న త్రిభువన్ త్రిశూలీ సెకండరీ స్కూలును పూర్తిగా పునరుద్ధరించి ఇస్తామని భారత ప్రభుత్వం నేపాల్‌కు హామీ ఇచ్చింది. ఆ స్కూలుపై సునామీ విరుచుకుపడక ముందు అత్యవసర ఆదేశాలతో అప్పటికప్పుడు 900 మంది విద్యార్థులు చివరిక్షణంలో ప్రాణాలు కాపాడుకున్నారు. వారంతా హుటాహుటిన ఆ స్కూలు క్యాంపస్‌ను ఖాళీ చేసి వెళ్ళిపోయాక ఆ స్కూలు సునామీలో కొట్టుకుపోయింది. కాగా గిరాంగ్‌వైపు వెళ్ళే సరిహద్దు రహదారిని పునరుద్ధరించినట్లు చైనా ప్రభుత్వం గురువారం ఒక ప్రకటన చేసింది.

త్రిశూలీలో జెసిబిలను ఉపయోగించి ముమ్మరంగా శిథిలాలను తొలగిస్తున్నారు.అనేక ప్రాంతాలలో టెలికామ్ వ్యవస్థలను పునరుద్ధరించేందుకు మరమ్మతులు, లైన్ల నిర్మాణ కార్యక్రమాలు కూడా వేగంగా జరుగుతున్నాయి.ఇంకోవైపు మరణించిన తమ కుటుంబీకులకు బాధితులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించి సంతాపాలు ప్రకటించడానికి కూడా వారికి తగిన స్థలం లభించడంలేదు. కుటుంబీకులు మృతుల చిత్రపట్టాలు, లేదా మట్టితో చేసిన నమూనా బొమ్మలను ఎదురుగా పెట్టుకుని నివాళులు అర్పిస్తున్నారు.భోట్‌కోశి వరదల్లో మరణించిన తమ బంధువులకు పశుపతి ఆర్యఘాట్‌లో వందలమంది గడ్డితో బొమ్మలు తయారుచేసి వాటికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.వందలమంది బాధితుల ఇళ్ళుకూడా కొట్టుకుపోవడంతో వారికి నిలువ నీడ కూడా లేదు.

# బర్త్ టూరిజంపై ట్రంప్‌నకు మళ్ళీ కోర్టు షాక్!

### నిషేధ ఉత్తర్వుకు అడ్డుకట్ట

**మేరీల్యాండ్:** బర్త్ టూరిజంను నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను మేరీల్యాండ్‌కు చెందిన జిల్లా న్యాయస్థానం అడ్డుకుంది. దీంతో ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గర్భం దాల్చిన మహిళలు అమెరికా వచ్చి అక్కడే ప్రసవాలు చేయడం ద్వారా తమ బిడ్డలకు అమెరికా పౌరసత్వం సంపాదించుకుంటున్నారని,ఈ విధమైన కుట్రలను అడ్డుకుంటామని వాదిస్తూ ''బర్త్ టూరిజం''ను నిషేధిస్తూ ట్రంప్ గతనెల ఆరో తేదీన (2026,ఆగస్టు 6) కొత్త ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వును నిలిపివేస్తూ మేరీల్యాండ్‌లోని అమెరికా జిల్లా కోర్టు న్యాయమూర్తి డెబొరాహ్ బోర్డ్‌మన్ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేశారు.వలస కుటుంబాలు,అడ్వకసీ గ్రూపులు ఒక పరిష్కారం కోరుతూ మేరీల్యాండ్ జిల్లా కోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు పూర్తిగా పరిష్కారమయ్యేవరకూ ఈ ఉత్తర్వు అమలులో ఉంటుంది. న్యాయమూర్తి బోర్డ్‌మన్‌ను డెమోక్రటిక్‌పార్టీకి చెందిన అధ్యక్షుడు జో బైడెన్ నియమించారు.




పుట్టుకతో పిల్లలకు అమెరికా పౌరసత్వం ఉంటుందని ఆమె తన ఉత్తర్వులో ఉద్ఘాటించారు. 1868లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా అమెరికా కాంగ్రెస్ ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. అప్పటినుండి ఇది ఒక సంప్రదాయబద్ధమైన హక్కుగా చెలామణీ అవుతోంది. వలస ప్రజలను అడ్డుకునేందుకు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా బర్త్ టూరిజంను ఆయన అడ్డుకున్నారు.కానీ ట్రంప్ ఉత్తర్వుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదని సుప్రీంకోర్టు గడచిన జూన్ నెలలో తీర్పు చెప్పింది.ఇప్పుడు మేరీల్యాండ్ కోర్టు కూడా అదే బాటలో ట్రంప్ ఉత్తర్వును అడ్డుకుంది. అమెరికా విదేశీ రాయబార కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది,సంబంధిత సంస్థలకు చెందిన కుటుంబాలకు, అమెరికా శత్రువులుగా ప్రకటించిన విదేశీయులకు బర్త్ టూరిజం నిషేధాన్ని ట్రంప్ వర్తింపజేశారు.అమెరికా గడ్డపై బిడ్డకు జన్మనివ్వాలనే ఉద్దేశంతో నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికాకు వచ్చే గర్భిణులను బర్త్ టూరిస్టులుగా అభివర్ణిస్తూ ట్రంప్ యంత్రాంగం ఈ ఉత్తర్వు తెచ్చింది.

## ఎన్నికలకు వెనిజులా సిద్ధంగా లేదు: ట్రంప్



**వాషింగ్టన్ :** ఎన్నికలకు వెనిజులాదేశం ఇంకా సిద్ధంగా లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి ఇంకా చాలా సమయం అవసరం అవుతుందని చెప్పారు. వెనిజులా ఎన్నికలకు ఒక ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని ఎందుకు అడగడంలేదని పాత్రికేయులు ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్‌ను ప్రశ్నించినప్పుడు, ''మీకు తెలుసుకదా, వారికి ఇంకా సమయం అవసరం, ఇది చాలా కొత్త విషయం'' అన్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో వెనిజులా అధ్యక్ష భవనంపై అమెరికా ప్రత్యేక దళాలు దాడిచేసి ఆపరేషన్ నిర్వహించాయి. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌లను కిడ్నాప్‌చేసి అమెరికాలో ఒక జైలులో బంధించారు. ట్రంప్ అనుకూల ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలుగా నియమించారు. వెనిజులా ప్రభుత్వం తమ కనుసన్నల్లోనే పనిచేస్తుందని ఆనాడు ట్రంప్ ప్రకటించారు. ''మేం వెనిజులాను నియంతృత్వం నుండి విముక్తిచేశాం, ప్రజాస్వా మ్యం వైపు నడిపిస్తున్నాం, వారికి కొంత సమయం కావాలి, వారు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారని నేను అనుకోవడంలేదు,మేం ఆ ప్రభుత్వంతో చాలా బాగా కలిసిపోతున్నాం'' అన్నారు. అదేవిధంగా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై ప్రశంసలు కురిపించా రు. ఆమె బాగా పనిచేస్తున్నారని, అత్యంత గౌరవనీయురాలని అ న్నారు. ఆమెకు ఎన్నికలు కావాలి, కానీ ఇంకా సమయం అవసరం అన్నారు.





### నిధులు మంజూరు చేసిన సిఎంకు ధన్యవాదాలు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జికి శంకుస్థాపన చేసినా నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంట్రాక్టర్‌కు పని ఆపేయమని కూడా చెప్పిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సిఎం కాగానే నిధులు మంజూరు చేసి, ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తెచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పాతబస్తీలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, చార్మినార్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాన్ని కేటాయించి, పాతబస్తీలో వారానికి ఒకరోజు నైట్ మార్కెట్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక 'యాంటీ మర్డర్ స్క్వాడ్' ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో మతపరమైన విభేదాలు పెరగకూడదని, రాష్ట్ర శాంతి, అభివృద్ధి కోసమే తమ మద్దతు కొనసాగుతుందని అసదుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు.

## ఒరిజినల్ సిటీ
**(మొదటి పేజీ తరువాయి)**

చార్మినార్ వద్ద షాపింగ్‌కు వస్తారని గుర్తు చేశారు. పాత బస్తీలోని ప్రతి గల్లీ, అణువణువు తనకు తెలుసునని స్పష్టం చేశారు. చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్ నగర్‌లోని యాదగిరి థియేటర్ వరకు 3.32 కిలోమీటర్ల పొడవుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు లేన్‌ల సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహ్మద్ అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపిలు అసదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డితో ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు, వేం నరేందర్ రెడ్డి, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బాలాల, నవీన్ యాదవ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఫ్లైఓవర్‌కు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సిఎం, పరిశీలించి, జిహెచ్‌ఎంసి అధికారుల నుంచి ప్రాజెక్టు వివరాలు సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం వంతెనకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుందే తప్ప నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. 'ఎంపి అసదుద్దీన్ ఒవైసీ కోరిన అభివృద్ధి పనులన్నింటినీ మంజూరు చేయాలని వేదికపై నుంచే అధికారులను ఆదేశిస్తున్నాను. ఎమ్మెల్యే అహ్మద్ బలాలా కళాశాల అభివృద్ధికి రూ. 20 కోట్లు అడిగితే, రూ. 25 కోట్లు మంజూరు చేస్తున్నాం' అని సిఎం ప్రకటించారు. మీరాలం చెరువుపై 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా జరుగుతోందని, నాగోల్ నుంచి ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ మీదు గా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను విస్తరిస్తున్నామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు మార్గాన్ని పూర్తి చేసి, అదే మెట్రోలో వచ్చి ఓట్లు అడుగుతామని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ను అభివృద్ధి చేసి రాత్రివేళ ఆర్థిక కార్యకలాపాలను (నైట్ ఎకానమీ) ప్రోత్సహిస్తామని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ద్వారా నైట్ ఎకానమీ ప్రోత్సాహం, పేద ముస్లింలకు ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. గంగా, యమునా రివర్ ఫ్రంట్లకు మద్దతు తెలిపిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు మూసీ రివర్ ఫ్రంట్ విషయంలో మాత్రం విమర్శలు చేస్తున్నాయని సిఎం ఆరోపించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. హిందూముస్లింలు కలిసి నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, పాతబస్తీలో సోదరీమణులు ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు కావాలని ఆకాంక్షించారు.

## విస్తరణ? (మొదటి పేజీ తరువాయి)

అమలులోకి వస్తుందని గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వెంటనే సచివాలయంలోని 4వ అంతస్తులోని మంత్రి కొండా సురేఖ ఛాంబర్‌ను ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా కొండా సురేఖ మంత్రి పదవి ఖాళీ కావడంతో బిసి సామాజికవర్గం నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నేతలు, అదే విధంగా మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వివిధ సామాజికవర్గ నేతలలో కూడా మంత్రి పదవులపై ఆశలు చిగురించాయి.

**ఆ ముగ్గురికి మంత్రి పదవి?**

మంత్రి వర్గ విస్తరణలో భాగంగా బిసి సామాజికవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌగ్‌కు, ఎస్‌సి సామాజికవర్గం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, రెడ్డి సామాజికవర్గం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాగా ఈ నెల 7వ తేదీ నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో వెంటనే మంత్రివర్గ విస్తరణ చేపడుతున్నట్లు తెలిసింది. ఆ ముగ్గురికి మంత్రివర్గంలో చోటు కల్పించి శాఖలు కేటాయిస్తే అసెంబ్లీలో ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం బలంగా ఇవ్వొచ్చనే అభిప్రాయంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా మంత్రిపదవులు దక్కుతాయని ప్రచారం జరుగుతున్న ఈ ముగ్గురు నేతలు కూడా మంత్రి పదవి కోసం హస్తినలో గత కొద్దిరోజుల నుంచి అధిష్టానం వద్ద పైరవీ చేసుకుంటున్నట్లు కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

**ఇంకా ఒక కేబినెట్ బెర్త్ ఖాళీ**

ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మొత్తం 14 మంది మంత్రులుగా కొనసాగుతున్నారు. సిఎంతో కలిసి ఆ సంఖ్య 15 అవుతుంది. తాజాగా కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో ఆ సంఖ్య 14కు చేరింది. ఒక వేళ గడ్డం ప్రసాద్, మహేశ్ కుమార్ గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తే మంత్రుల సంఖ్య 17కు చేరుతుంది. ఇంకా ఒక కేబినెట్ పోస్టు మిగిలి ఉంటుంది. ఆ మిగిలిన ఒక మంత్రి పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

## ప్రమాదంలోకి ప్రపంచ దేశాలు
**(మొదటి పేజీ తరువాయి)**

ఆర్థికవ్యవస్థలను,సమాజాలను పెద్ద దెబ్బతీయగల సామర్థ్యం ఈ ఎల్‌నినోకు ఉందని డబ్ల్యుఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో చెప్పారు. వర్షపాతంలో తీవ్రమైన మార్పులు వస్తాయని చెప్పారు.ఆగ్నేయ ఆసియా,మధ్య అమెరికా,దక్షిణ అమెరికాలోని ఉత్తర ప్రాంతాలలో చాలా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. దీంతో గురువారం నుండి పనామా కాలువ ద్వారా ప్రయాణం చేసే నౌకల సంఖ్యను పదిశాతం మేరకు తగ్గించారు. ఈ కృత్రిమ కాలువ ద్వారా ప్రతి ఏటా 14,000 నౌకలు ప్రయాణం చేస్తాయి. ప్రపంచదేశాలకు ఈ జలమార్గం ఎంతో కీలకమైనది. కాగా బోట్స్‌వానా వంటి దక్షిణాఫ్రికాదేశాలు తీవ్ర కరువు ఎదుర్కొంటున్నాయి.పసిఫిక్ జలాలలకు వేల మైళ్ళ దూరం లో ఉన్న చైనా దేశానికి ఒక్క ఏడాదిలోనే ఏడు తుఫానుల ప్రమాదం ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు.ఈ ఏడాది జులై నెలలోనే చైనా బావి–నౌల్–మైసాక్ అనే పేరుగల మూడు తుఫానులను ఎదుర్కొంది. తీవ్రనష్టాలకు గురైంది.ఆగస్టునెలలో డాల్ఫిన్ తుఫాను వల్ల 10 లక్షలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చైనా ప్రభుత్వం తరలించాల్సి వచ్చింది. అనేక యూరప్‌దేశాలలో దావానలాగ్ని బీభత్సం సృ ష్టించింది. అదేవిధంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ బ్రెజిల్, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాం తాలలో వరద ప్రమాదాలు పెరుగుతాయి.

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ప్రకృతి వైపరీత్యం. దీని ప్రభావంవల్ల లోలోతుల్లో ఉన్న నీరు కూడా గతంలో లేనివిధంగా వేడెక్కుతోంది. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల ఎల్‌నినో ప్రమాదానికి సంకేతం.శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో జలాలు రెండు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా వేడెక్కాయి. 1950వ దశకంనాటికంటే ఇది తీవ్రమైనది. ఈ ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశాలున్నాయి. హిందూమహాసముద్రం, ఆస్ట్రేలియా తీరప్రాంతం, ఉష్ణ మండల అట్లాంటిక్‌లలో ఈ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియా తీర ప్రాంతాలలోని సముద్ర జలాల్లో జీవజాలం ఎంతో సమృద్ధిగా ఉంది. ఐతే ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల ఈ తీర ప్రాంతానికి ప్రమాదకరంగా మారింది.

## బర్తరఫ్ ఖండిస్తున్నా...
**(మొదటి పేజీ తరువాయి)**

ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ సిఎం రేవంత్ రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్ మెయిల్ చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సిఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్‌డి సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం సోదరులు కొండల్ రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రాజీనామా చేయాలని నన్నెవరూ అడగలేదు. నేనేం తప్పుచేయలేదు. నాకు పశ్చాత్తాపం లేదు. సిఎం రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించాను. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదు. సిఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదు. నావైపు ఒక వేలు చూపితే రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్‌బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు'' అని కొండా సురేఖ అన్నారు. '''బర్తరఫ్ నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె స్వతంత్ర మహిళ. ఆమె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు? నా కుమార్తె వ్యాఖ్యలను నేను ఖండించాల్సిన అవసరం లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుబట్టే అధికారం నాకు లేదు. కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను ఇచ్చిన లేఖను మీడియాకు విడుదల చేస్తున్నా. టిపిసిసి నేత జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారు? నాపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నా'' అని సురేఖ అన్నారు. నా వల్ల ముగ్గురు బిసి మహిళలకు పదవులు రావడం సంతోషకరమన్నారు. నాకోసం చిన్నారెడ్డిపై వేటు వేయడం సరైంది కాదన్నారు.

**నేను తప్పు చేయలేదు**

అవమానంగా భావించను నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారేనని, గతంలో రోశయ్య, జైపాల్ రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారని సురేఖ అన్నారు. 'మంత్రి పదవి నుంచి తనను తొలగించినందుకు నేనేమీ బాధపడడంలేదు. నేను తప్పుచేయలేదు. బర్తరఫ్‌ను అవమానంగా భావించడంలేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ, మీరు సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది'' అని సురేఖ అన్నారు.

**హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది**

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని, క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని కొండా సురేఖ సూచించారు. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలని, పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉందన్నారు. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పబోనని, పార్టీ తీరు మారాల్సిన అవసరముందన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలన్నారు.

**మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారు**

''రాష్ట్ర మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారన్నారు. తన ప్రమేయం లేకుండానే తన శాఖల్లో నిర్ణయాలు తీసుకున్నారు. తన ఓఎస్‌డి సుమంత్‌ను సైతం తనకు తెలియకుండానే తప్పించారు'' అని సురేఖ తెలిపారు. ఈ మేరకు ఎఐసిసి అధ్యక్షులు, మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రాసిన లేఖలను ఆమె మీడియాకు విడుదల చేశారు.

అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని, తన శాఖలోని అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని ఆమె లేఖలో ఆరోపించారు. అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించారని, అయినా తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని, ప్రజలకు, తన శాఖలోని ఉద్యోగులకు అందుబాటులో ఉన్నానని మె తెలిపారు. ఇటీవల జరిగిన పరిణామాలు, తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేసిన తీరు తీవ్రంగా బాధించిందన్నారు. దీని వల్ల కలిగిన పరిణామాలు, రాజకీయ ఒత్తిడి తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని కొండా సురేఖ పేర్కొన్నారు.

# రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు



వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ఆడాలనుకుంటున్న రోహిత్ శర్మ భవితవ్యంపై ఊగిసలాట కొనసాగుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైన అతడిని తప్పించి యశస్వీ జైస్వాల్‌కు అవకాశమిస్తారనే వార్తలు వినిపిస్తున్న వేళ.. ఇప్పటికిప్పుడు ఆ ముప్పేమి లేదనిపిస్తోంది. గురువారం బిసిసిఐ సమీక్షా సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ హిట్‌మ్యాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మీరు చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు అని సైకియా కామెంట్ చేశాడు. దాంతో.. ప్రస్తుతానికి వన్డే జట్టులో రోహిత్‌కు అవకాశముందనే విషయాన్ని చెప్పకనే చెప్పాడు బిసిసిఐ కార్యదర్శి. ఫామ్ పరంగా విమర్శలు ఎదుర్కొటున్న రోహిత్ శర్మకు మరో అవకాశం ఇవ్వాలని బిసిసిఐ భావిస్తోంది. వన్డేల్లో విధ్వంసక ఓపెనరైన హిట్‌మ్యాన్ ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో ఆడించాలని భారత బోర్డు అనుకుంటోంది. అనభవజ్ఞుడైన రోహిత్‌ను వెస్టిండీస్ పర్యటనలో ఆడించాలని వినతులు వస్తున్న వేళ.. బిసిసిఐ అందుకు సానుకూలంగా ఉందనిపిస్తోంది. తాజాగా సమీక్ష సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. 'మీరూ చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. మీకు ఇంతకంటే ఏం కావాలి. చివరి మ్యాచ్‌లో రోహిత్ శతకం సాధించాడు. అలాంటప్పుడు ఎందుకీ ఊహాగానాలు. మీరు అడిగే అనవసర ప్రశ్నలకు నేను బదులివ్వను' అని మీడియాతో అన్నాడు. అతడి మాటలను బట్టి.. స్వదేశంలో విండీస్తో వన్డే సిరీస్ స్క్వాడ్‌లో రోహిత్ ఉండడం ఖాయమనిపిస్తోంది.

వన్డే ప్రపంచకప్‌లో యశస్వీ జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలని చీఫ్ సెలెక్టర్ అగార్కర్, కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్మన్ గిల్ అభిప్రాయం వ్యక్తం చేయగా.. తాత్కాలిక కోచ్ వివిఎస్ లక్ష్మణ్, టి–20 సారథి శ్రేయాస్ అయ్యర్లు మాత్రం రోహిత్ ఉండాల్సిందే నని పట్టుపట్టారని సమాచారం. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో సిరీస్ మొదలవ్వనుంది. ఆపై టీమిండియాతో ఐదు టి–20 సిరీస్ ఆడనుంది కరీబియన్ టీమ్.



## ఆసియా కప్‌లో మహిళా క్రికెట్‌లో

# టాస్ ఓడిన భారత్

ఆసియా కప్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు రెండో మ్యాచ్ ఆడుతోంది. హాంకాంగ్ చైనాను ఢీకొంటున్న టీమిండియా.. ఈ మ్యాచ్ గెలిస్తే సెమీఫైనల్ దూసుకెళ్లడం ఖాయం. దాంతో.. మామూలుగా కాకుండా భారీ తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేయాలని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది. అయితే.. టాస్ టాస్ గెలుపొందిన హాంకాంగ్ చైనా జట్టు కెప్టెన్ నటాషా మైల్స్ భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి విజయంతో సెమీస్‌కు చేరువైన భారత మహిళల జట్టు ఈసారి హాంకాంగ్ చైనాతో తలపడుతోంది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన హాకాంగ్ కెప్టెన్ నటాషా మైల్స్ బౌలింగ్ తీసుకుంది. థాయ్లాండ్‌ను బౌలర్ల మాదిరిగానే టీమిండియాను కట్టడి చేయాలని తాము భావిస్తున్నట్టు మైల్స్ చెప్పింది. తుది జట్టు విషయానికొస్తే హర్మన్‌ప్రీత్ బృందం ఏ మార్పులు లేకుండా ఆడుతోంది. కానీ, హాంకాంగ్ చైనా మాత్రం రెండు మార్పులు చేసింది.

**భారత తుది జట్టు :** స్మృతి మంధాన, షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), భారతి ఫుల్మాలి, రీచా ఘోష్(వికెట్ కీపర్), ప్రేమా రావత్, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్.

**హాంకాంగ్ చైనా తుది జట్టు :** నటాషా మైల్స్(కెప్టెన్), మరియం బిబి, మరికో హిల్, జాయ్లాన్‌కౌర్, మరీనా లాంప్లో, యాస్మినే దస్వానీ(వికెట్ కీపర్), షంజీన్ షహజాద్, కారీ చాన్, రుచితా వెంకటేశ్, ఇక్రా సహర్, అలిసన్ సియూ.

# తుది పోరుకు తిలక్ సేన

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్సీలోని సౌత్ జోన్ ఫైనల్ చేరింది. బుధవారం ముగిసిన రెండో సెమీస్‌లో 7 వికెట్ల తేడాతో నార్త్ జోన్‌ను ఓడించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 182 పరుగుల లక్ష్య ఛేదనను ఆ జట్టు 43.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన కెప్టెన్ తిలక్ (79 బంతుల్లో 8 ఫోర్లతో 51 నాటౌట్) అర్ధశతకానికి తోడు జగదీశన్ (43), రిక్కీ భుయ్ (42), స్మరణ్ (32 నాటౌట్) రాణించారు. చూడచక్కని షాట్లు ఆడిన తిలక్ స్పిన్నర్ల బౌలింగ్‌లో రివర్స్ స్వీప్, ప్యాడిల్ స్వీప్ షాట్లతో అలరించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేరడం సౌత్‌జోన్‌కు ఇది 24వ సారి కావడం గమనార్హం. ఈనెల 6 నుంచి చెన్నై వేదికగా జరిగే ఫైనల్లో సౌత్ జోన్.. ఈస్ట్ జోన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

**టెస్టులే ఇష్టం: తిలక్...** భారత టి20 వైస్ కెప్టెన్‌గా ఉన్న తిలక్ వర్మ.. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలోనే జాతీయ జట్టుకు ఆడుతున్నా తనకు టెస్టులంటేనే మక్కువ ఎక్కువన్నాడు. దులీప్ ట్రోఫీ సెమీస్ మ్యాచ్ ముగిశాక అతడు మాట్లాడుతూ.. 'నేను భారత జట్టుకు పరిమిత ఓవర్లలో ఆడతానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ నాకు రెడ్ బాల్ క్రికెట్ ఆడటమంటేనే ఇష్టం. నా బలం ఎప్పుడూ టెస్టులే. ఐపీఎల్లో మెరుగైన ప్రదర్శన చేసి టీమిండియాలో టీ20 జట్టులోకి వచ్చా. కానీ అంతకంటే ముందు చాలా రోజులు నేను దేశవాళీలో రెడ్బాల్ క్రికెట్ ఆడా. టెస్టుల్లో జాతీయ జట్టుకు ఆడాలని ఉందని ఈ సందర్భంగా తిలక్ ఆశాభావం వ్యక్తం చేశాడు.



## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# దేశంలో తొలి రైల్వే మండలం

- ఫిన్లాండ దేశ రాజధాని:
  ది హేగ్
- 'యంగ్ ఇటలీ' స్థాపకుడు:
  మాజిని
- మహానది డెల్టా ఈ రాష్ట్రంలో ఉంది ?
  పశ్చిమ్ బంగల
- దేశంలోనే తొలి రైల్వే మండలంగా వాసికెక్కింది ఏది ?
  దక్షిణ రైల్వే
- అమ్మకపు పన్ను?
  పరోక్ష పన్ను
- కిందివాటిలో ఏది నీటిలో మునుగుతుంది?
  గాజు గోళీ
- స్త్రీ విద్యను ప్రోత్సహించినది?
  డల్హౌసీ
- రైలుమార్గాల నిడివి ఎక్కువగా ఉన్న రైల్వే జోన్ ఏది?
  ఉత్తర రైల్వే
- ఆర్యసమాజ స్థాపకుడు
  స్వామి దయానంద సరస్వతి
- తాన్ సేన్ ఈ చక్రవర్తి యొక్క ఆస్థాన గాయకుడు
  అక్బర్
- నీటిగడియారాన్ని కనిపెట్టింది:
  చైనీయులు
- వెల్లస్లీ ఇచట ఒక కాలేజీని స్థాపించాడు?
  కలకత్తా
- మురికివాడల సంఖ్య నానాటికి పెరిగిపోవుటకు కారణము?
  పట్టణీకరణ
- ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి రైలుమార్గం
  పుత్తూరు –రేణిగుంట
- సైన్యసహకార పద్ధతికి అంగీకరించిన పీష్వా
  రెండవ బాజీరావు
- రోమ్ నగరం ఈ నదీతీరాన నిర్మించబడింది:
  టైబర్
- రష్యా జపాన్ యుద్ధం:
  1905
- బ్లాక్ ఫారెస్టు పర్వతాలు గల దేశం
  జర్మనీ
- సర్ జాన్ షోర్ తర్వాత గవర్నర్ జనరల్‌గా వచ్చినవాడు?
  వెల్లస్లీ
- థగ్గులనే దారిదోపిడిగాంఢ్రనణచినవాడు?
  బెంటింక్
- మహారాష్ట్ర కూటమిని ఏర్పాటు గావించినది?
  నానా ఫడ్నవీస్
- పీష్వాఅనగా?
  మహారాష్ట్ర ప్రధానమంత్రి
- 'మహల్' అని పిలువబడే వ్యవస్థ ఇందులకు చెందినది?
  భూమిశిస్తు
- బాక్సైట్ నుండి తయారుచేయబడుతున్న లోహం:
  అల్యూమినియం
- రక్తనాళాలు గడ్డకట్టడాన్ని ఏమని పిలుస్తారు?
  త్రాంబోసిస్
- ఈ సముద్రంలో అత్యధిక లవణీయత గుర్తింపబడింది:
  మృత సముద్రం
- ప్రజాస్వామ్య ప్రభుత్వాలను ఎన్ని రకాలుగా విభజించవచ్చును:
  రెండు
- బ్రూనై దేశపు ప్రధాన ఆర్థిక వనరు:
  పెట్రోలియం
- ముస్లింలు తప్పనిసరిగా సామూహిక ప్రార్థనలు చేయవలసిన వారము ఏది?
  శుక్రవారం
- ప్రపంచంలో 'వరి' ఉత్పత్తిలో భారతదేశ స్థానం
  2వ స్థానం
- ప్రకృతి శక్తి కానిది ఏది?
  ప్రాజెక్టు
- ఆరోగ్యశ్రీ పథకం ఎప్పుడు ప్రారంభించబడింది?
  2004 మే 15
- పెన్సిళ్ళ ముళ్ళు తయారీలో ఉపయోగించే లోహం:
  గ్రాఫైట్
- ద్వీపకల్పంలో రెండో పెద్ద నది :
  కృష్ణా
- ప్రపంచపు కార్మాగారంగా పేర్గాంచింది:
  ఇంగ్లాండ్
- నాజీపార్టీ స్థాపకుడు:
  హిట్లర్
- యూదుల పవిత్ర నగరం :
  జెరూసలెం
- థేమ్స్ నది గల దేశం:
  ఇంగ్లాండ్
- ఉన్నినిచ్చే మెరినో జాతి గొర్రెలు గల దేశం:
  స్పెయిన్
- రైత్వారీ విధానాన్ని ఆంగ్లేయులు ఈ రాష్ట్రాలలో అమలుపరచారు?
  మద్రాసు, బొంబాయి
- సిపాయిల తిరుగుబాటు జరిగిన సంవత్సరం?
  క్రీ.శ. 1857
- అందరికన్న ముందుగా సైన్యసహకార పద్ధతికి అంగీకరించినది?
  హైద్రాబాద్ నిజాం
- సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టినది?
  వెల్లస్లీ
- కారన్ వాలీస్చే ఏర్పాటు చేయబడ్డ సంచార న్యాయస్థానాలు?
  నాలుగు
- న్యూ డీల్ విధానాన్ని ప్రవేశ పెట్టిన అమెరికా అధ్యక్షుడు:
  రూజ్వెల్ట్
- డానెడ్రో ఈ దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టారు:
  బ్రెజిల్
- సూయజ్ కాలువను జాతీయం చేసినవాడు:
  నాజర్
- తక్కువ కెలోరిఫిక్ విలువ గల పదార్థం
  ఆవుపాలు
- శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని ప్రవేశపెట్టినది?
  కారన్ వాలిస్



# కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరుగుతున్నాయని దీనికి సంబంధించిన పోస్టర్ గురువారం ఎన్‌టిపిసి గేట్ ఎదుట ఎఐటియుసి డిస్టిక్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడారి సునీల్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు నాంసాని శంకర్, జిల్లా కోశాధికారి రెడ్డపాక లక్ష్మణ్, రామగుండం నగర అధ్యక్షులు అబ్దుల్ కరీం, కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం రాజనర్సు, నాయకులు వేముల కృష్ణకర్, రామ్ ఎల్ల ప్రకాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లగుట్టను పరిరక్షించాలి : సిపిఐ




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ముస్తాబాద్ మండల గూడూరు నామాపూర్ మధ్య గల పల్లగుట్టను పరిరక్షించాలని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. గురువారం సిపిఐ కార్మిక భవనంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు సోమ నాగరాజుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మైనింగ్ లీజుకు తీసుకునే ప్రయత్నం, తవ్వకాలను పలు గ్రామాల ప్రజలు ప్రజా పోరాటాల ద్వారా నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ గుట్ట గూడూరు గ్రామానికి సహజ రక్షణగా స్థానిక పర్యావరణానికి ఆధారంగా ఉందని, గుట్టను పూర్తిగా తొలగిస్తే భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పల్లె జీవజాలం వన్యప్రాణులు వృక్ష సంపదకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి అనుమతులను పరిశీలించి పల్లగుట్టను కాపాడాలని వారు కోరారు.

# కరీంనగర్‌లో కార్మికుల భారీ ప్రదర్శన

### ఎర్రజెండాలు, ఎర్రచొక్కాలు, ఎర్రచీరలతో తరలిరావాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 6న కరీంనగర్‌లో నిర్వహించనున్న కార్మికుల భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ పిలుపునిచ్చారు. కార్మికులు ఎర్రజెండాలు, ఎర్రచొక్కాలతో, మహిళలు ఎర్రచీరలతో పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శన సర్కస్ గ్రౌండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, జాతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుంచి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు నిర్ణీత సమయానికి కరీంనగర్ చేరుకుని భారీ ప్రదర్శనలో పాల్గొనాలని వారు కోరారు. కార్మికుల సమస్యలు, హక్కులపై నినదిస్తూ నిర్వహించే ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని యూసుఫ్, బాలరాజ్ పిలుపునిచ్చారు.




# 12 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అమానుషం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/మావల :** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న కార్మికులకు 12 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అమానుషమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చిలుకూరి లక్ష్మి గార్డెన్‌లో ఎఐటియుసి ప్రతినిధి బృందం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ కార్మికులకు తక్షణమే కనీసం 6 నెలల జీతాలు మార్కెట్ కమిటీ ద్వారా చెల్లించాలని విజ్ఞప్తి చేయగా, మార్కెట్ కమిటీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి గజేంగుల రాజు పాల్గొన్నారు.



# ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో శ్రీచైతన్య హైస్కూల్ వద్దు... జవహర్ నవోదయ విద్యాలయం ముద్దు అనే నినాదంతో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో అంబేద్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ జిల్లాకు ఒక్క జవహర్ నవోదయ విద్యాలయం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీ ఇంతవరకు నెరవేరలేదని విమర్శించారు. జవహర్ నవోదయ విద్యాలయానికి సరిపడు క్యాంపస్ ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో ఉన్నందున, విద్యా వ్యాపారం చేసే పాఠశాలను తొలగించి, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉండే జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌టిపిసిలో సెయింటు క్లియర్ పాఠశాలకు అన్ని రకాలైన సౌకర్యాలను, వసతులను యాజమాన్యం కల్పిస్తుండగా, అక్కడ పదవ తరగతి చదివే విద్యార్థులకు ఆ పాఠశాల ఎన్‌టిపిసి విద్యార్థులకు రూ.25,263, నాన్ ఎన్‌టిపిసి విద్యార్థులకు రూ.38,340 ఫీజు వసూలు చేయడం జరుగుతుందని, ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యం శ్రీ చైతన్య పాఠశాలకు అన్ని రకాలైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తే పదవ తరగతి విద్యార్థులకు రూ.70800, సెంట్రల్ టెక్నో ఆర్‌ఎఫ్‌సిఎల్ విద్యార్థులకు రూ.51300 ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. అన్ని వసతులు కల్పించిన ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యం ఫీజుల విషయంలో స్పందించకపోవడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తడిగొప్పుల అనూప్ సాయి, గొడిసెల ప్రణీత్, అభిషేక్, శ్రావణ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులు భర్తీచేయాలి

### సిపిఐ ధర్నాలో మహ్మద్ సలాం డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. ఆస్పత్రిలో వివిధ విభాగాలలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాతా శిశు కేంద్రంలో మందులు లేక పాత ఆసుపత్రికి వచ్చి గర్భిణీలు, బాలింతలు గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ల్యాబ్ టెక్నిషియన్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించడంతో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె సైదా, నామా విజయ్‌కుమార్, ఎస్‌కె చానా, డి.శేఖర్ నాయక్, చిర్రా వెంకన్న, సిహెచ్ దుర్గానాథ్, భద్రం, ఎండి మజీద్, యాకూబ్, రెహ్మాన్, కరీం, పాండు, రాజు, శ్రీను, అక్బర్, రమణ తదితరులు పాల్గొన్నారు.





# డి.రాజాను కలిసిన సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా బృందం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వెళ్లిన సిపిఐ బృందం, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిసింది. ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో డి.రాజాను జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, రైల్వే లైన్, ఇండస్ట్రీయల్ కారిడార్ తదితర అంశాలపై డి.రాజా ఆరా తీసినట్లు సిపిఐ నాయకులు తెలిపారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎం.బాలనర్సింహ్మా, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, వి.రవీందర్, బి.శ్రీనివాసులు, పి.మల్లేష్, పి.కిరణ్‌కుమార్, బి. ప్రేమ్‌కుమార్, బండి వెంకటమ్మ, ఆంజనేయులు, పి.పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.



## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లాకు తీరని అన్యాయం


ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విమర్శ

కాంగ్రెస్ శ్రేణులతో భారీ నిరసన ర్యాలీ, ధర్నా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో గురువారం తీవ్ర రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన రైతు సభ, మహాధర్నా కార్యక్రమాలకు పోటీగా కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్ పర్యటనను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదుట శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలసి భారీ ధర్నా చేపట్టారు. కేటీఆర్ గో బ్యాక్ అంటూ ప్లకార్డులు చేతబూని కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆ పార్టీ సంపూర్ణంగా విఫలమైందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహ్మద్ బందగీ మృతి తీరని లోటు

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/డిండి:** రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ కుమారుడు బందగీ అకాల మరణం తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కందుకూరు గ్రామంలో బందగీ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మైనోద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈసందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతు సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ పెద్ద కుమారుడు బందగి అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని కలిగించిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు బందగి చిన్న వయస్సులోనే మరణించడం ఎంతో బాధాకరం అని నిరంతరం ప్రజా పోరాటాలలో, రైతు సమస్యల పరిష్కారంలో నిమగ్నమైయ్యే రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ కుటుంబానికి ఈ ఘటన తీరని లోటును మిగిల్చిందని అన్నారు. అమరుడు బందగి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, పుత్రశోకంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్థాలిన్, సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రామచంద్రం, కనకాచారి, విజేందర్‌రెడ్డి, శైలేష్, జయరాములు, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నకిరేకల్** : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 5న నకిరేకల్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం నకిరేకల్‌లో పర్యటించిన ఆయన సీఎం ప్రారంభించనున్న ప్రాంతీయ వైద్యశాల, బహిరంగ సభ వేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నూతనంగా నిర్మించిన ప్రాంతీయ వైద్యశాలను సిఎం ప్రారంభించనున్నందున ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.భవనాన్ని విద్యుత్ దీపాలు,లైటింగ్, పూల అలంకరణతో ముస్తాబు చేయాలని ఆదేశించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు.డబుల్ బ్యారికేడింగ్,లైటింగ్,గ్రీన్‌రూమ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి,ఆర్అండ్‌బీ ఎస్ఈ పున్నమోహన్,ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సతీష్,తహసీల్దార్ యశ్వంత్ పాల్గొన్నారు.

## ఎవరికి ఏం పదవులు ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వాఖ్యలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో రోడ్ల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గురించే నా ఆలోచన అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పది సంవత్సరాలపాటు బిఆర్ఎస్ పైన పోరాటం చేసిన నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగాలని నా ఉద్దేశమని తెలిపారు. నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగొద్దనేది ఎవరికి ఏం పదవులు ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుందని మా నాయకుడు రాహుల్ గాంధీపై నమ్మకం ఉందని ఆయన ఏ నిర్ణయం తీసుకున్న నేను దానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కొండ సురేఖ అంశం అధిష్టానం దగ్గర ఉందని అధిష్టాన నిర్ణయమే ఫైనలని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ,ఆర్ అండ్ బి రోడ్ల శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రోడ్ల అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి

గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి విజయ పాల డైరీ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** వ్యవసాయం చేసుకుంటూనే పాడిని అభివృద్ధి చేసుకోవల్సిన అవసరం రైతులకు ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో 5వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల విజయ పాల డైరీ కేంద్రాన్ని బుధవారం విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఆర్థిక చేయూతను అందించడంలో పశు సంపద ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో అవసరానికనుగుణంగా పాల ఉత్పత్తి జరకపోవడం కారణంగా ఇతర రాష్ట్రాల నుండి పాలను దిగుమతి చేసుకోవల్సి వస్తుందన్నారు. వ్యవసాయ రంగంతో పాటుగా పాడి పరిశ్రాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారనడానికి నష్టాలలో ఉన్న విజయ డైరీకి రూ. 100 కోట్ల నిధులను మంజూరు చేయడమే ఒక ఉదాహరణ అని అన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల చేశారని, 1000 రోజులుగా దానిని ముఖ్యమంత్రి చక్కదిద్దుతూ వస్తున్నారన్నారు. గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడానికి నాలుగు విజయ డైరీలను నూతనంగా ప్రారంభించను న్నామన్నారు. వ్యవసాయానికి సమాంతరంగా రైతులు పాడిని అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తిని ప్రజలకు సరఫరా చేస్తూ వారి మన్ననలను విజయ డైరీ పొందుతుందన్నారు. అర్హత కలిగిన రైతులు పాడి అభివృద్ధి చేసుకోవడానికి బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ రోజు రూ. 20 లక్షల రుణాలను యూనియన్ బ్యాంకు వారు అందిచడం జరిగిందన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసం విజయ డైరీ పాటు పడుతుందని అమిత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు, కనకదుర్గ ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు నర్రా మోహన్‌రెడ్డి,పోకల దేవదాసు, జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఆసుపత్రిలో ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పురుషుల, మహిళల ఓపి రూమ్‌లను సందర్శించి ఔట్‌పేషంట్ రిజిస్టర్‌లు పరిశీలించి, ఎంతమంది అవుట్ పేషంట్స్ ఈరోజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏఎంసి వార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్యూటి డాక్టర్లను ఈరోజు పేషెంట్లకు వైద్య సేవ అందించు రౌండ్స్ పూర్తయ్యా అని అడిగి తెలుసుకున్నారు. పిఎంజెవై, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేషంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను, డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను, జనరల్ మెడిసిన్ డాక్టర్ రూమ్‌ను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్ రూమ్, బ్లడ్ శాంపిల్ కౌంటర్‌ను తనిఖీ చేసి ఈ రోజు పేషెంట్లకు ఏమేమి పరీక్ష నిర్వహించారు, రిపోర్టు ఎలా ఉన్నవి అని రిపోర్ట్స్ పరిశీలించారు. డయాగ్నస్టిక్ కెమికల్స్ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి జనరల్ వార్డును తనిఖీ చేసి పేషంట్ల వివరాలను డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడే మెడిసిన్ రియాక్షన్ వలన చికిత్స పొందుతున్న తిరుమలగిరికి చెందిన రహీమా బేగంను పరామర్శించి రియాక్షన్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్ఎంను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, ఐడి కార్డులు ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాణి, జనార్ధన్, అనిత, శ్రీలత, ఉపేందర్, యశ్వంత్, వినయ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమం



10న చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి

ఎస్‌టియు-టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ ఉద్యోగుల హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ పిలుపునిచ్చారు.సభను విజయవంతం చేసేందుకు నల్లగొండ,సూర్యాపేట జిల్లాల ఉద్యోగ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికిముఖ్య ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు.ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభకు రెండు జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. మెరుగైన వేతన నిర్ణయంతో రెండో వేతన సవరణ సంఘం సిఫారసులను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని,దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు.ఈ సమావేశంలో అఖిల భారత పాఠశాల ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యులు కొనకంచి వీర రాఘవులు,రాష్ట్ర కార్యదర్శి కందిమల్ల నరేందర్,కార్యదర్శి మురారి శెట్టి రమేష్,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తూరి అంజయ్య,నల్లగొండ జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు కె.దత్తేశ్వర్,రమావత్ రామ్‌సింగ్,ఆంగోతు తావురియా,ఎం. వెంకటేశ్వర్లు, అంబటి వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల సంక్షేమానికి కోసం కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజాపాలనపై బిఆర్ఎస్ నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని, ప్రభుత్వం దిగిపోవాలని బిఆర్ఎస్ నాయకులు నిరసనలు చేయడం వెనుక కారణమేమిటని ప్రశ్నించారు. 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినందుకు ప్రజా ప్రభుత్వం దిగిపోవాలా అని నిలదీశారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.1.72లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ఇప్పటి వరకు సుమారు రూ.12,167 కోట్ల మేర ప్రయాణ ఖర్చు ఆదా చేసినట్లు తెలిపారు.

## తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

జల్సాల కోసం దొంగతనాలు.. ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

రూ.14,500 నగదు,30 తులాల వెండి,గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు,సెల్‌ఫోన్లు స్వాధీనం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలోని ఓల్డ్‌సిటీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన నదీమ్ (25),షేక్ రిజ్వాన్ (26),మహమ్మద్ అబ్దుల్ సమీర్ (23) ముఠాగా ఏర్పడ్డారు.గత రెండు నెలలుగా నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి,తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు దొంగతనం కేసులకు పాల్పడినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు.నిందితుల నుంచి 30 తులాల వెండి ఆభరణాలు, నాలుగు గ్యాస్ సిలిండర్లు, మూడు బ్యాటరీలు,నాలుగు సెల్‌ఫోన్లు, రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితులు గతంలోనూ నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లిన చరిత్ర ఉన్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.సమావేశంలో ఎస్ఐలు సైదులు, వెంకట్ నారాయణతో పాటు సిబ్బంది రబ్బానీ,సాగర్ల శంకర్, అంజద్, కిరణ్,అంజయ్యలు ఉన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



**ప్రజాపక్షం/ చౌటుప్పల్** : అక్రమంగా తరలిస్తున్న పశువులను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు.సిఐ జి.మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట పశువుల సంత నుండి 16 ఆవులను,10ఎద్దులను కొనుగోలు చేసి హైద్రాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా మండలంలోని ధర్మోజిగూడెం గ్రామ స్టేజి వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు తెలిపారు.పశువులను తరలిస్తున్న వావానాన్ని సీజ్ చేసి,హైద్రాబాద్ దమ్మాయిగూడకు చెందిన ఎస్‌కే.ఇస్మాయిల్,ఆంధ్రలోని కోనసీమ రామచంద్రాపురంకు చెందిన వెంకన్నబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించారు.

# మాజీల పోరులో ఆలేరు బిఆర్ఎస్‌కు డ్యామేజీ!

ఆధిపత్య పోరుతో
గులాబీ శ్రేణుల్లో అయోమయం..
పుంజుకుంటున్న కాంగ్రెస్
సునీత, భిక్షమయ్య వర్గాలుగా
కార్యకర్తల విభజన..
అధిష్టానం జోక్యంపై
ఎదురుచూపులు





**ప్రజాపక్షం/యాదాద్రి** : ఒకప్పుడు బిఆర్ఎస్‌కు బలమైన రాజకీయ కంచుకోటగా నిలిచిన ఆలేరు నియోజకవర్గంలో ప్రస్తుతం అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ ఆధిపత్య పోరు పార్టీపై ప్రభావం చూపుతోందన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జోరందుకుంది. రాబోయే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఇరువురు నేతలు ఆశలు పెట్టుకోవడంతో నియోజకవర్గంలో వారి వర్గాల మధ్య పోటీ మరింత స్పష్టంగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎవరి దారి వారిదే..**

నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసుకునే విషయంలో ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కొరవడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ప్రతిపక్ష నేతగా రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం జిల్లా కేంద్రమైన భువనగిరిలో గొంగిడి సునీత మీడియా సమావేశం నిర్వహించగా, ఇదే అంశంపై నియోజకవర్గం కేంద్రమైన ఆలేరులో బూడిద బిక్షమయ్యగౌడ్ మీడియా సమావేశం నిర్వహించడం వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీంతో ఒకే పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటున్న పరిస్థితి నెలకొంటోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మండలాల వారీగా పార్టీ శ్రేణులు ఎవరి వెంట నడవాలనే విషయంలో స్పష్టత లేకుండా పోతోందన్న చర్చ సాగుతోంది.

**నిరసనలకూ వర్గపోరు ఛాయలు?**

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలపై బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలు సైతం ఆలేరులో వర్గాల బలప్రదర్శనకు వేదికలుగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమం కంటే ఎవరి ఆధిపత్యం ఎంత అన్నదే ప్రాధాన్యంగా మారితే అది చివరకు పార్టీకి నష్టం కలిగించే అవకాశముందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సమస్యలపై అధికార పార్టీని నిలదీయాల్సిన సమయంలోనే అంతర్గత విభేదాలు తెరపైకి రావడం బీఆర్ఎస్ శ్రేణుల ను ఆందోళనకు గురిచేస్తోంది. నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగకపోతే క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**కాంగ్రెస్‌కు కలిసొస్తున్న పరిణామాలు..**

బీఆర్ఎస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలు కాంగ్రెస్‌కు రాజకీయంగా అనుకూలంగా మారుతున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ తన కార్యకలాపాలను విస్తరిస్తూ ముందుకు సాగుతోందని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో ఏర్పడుతున్న అయోమయాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసుకునే దిశగా కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తుండటం బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారుతోందని పరిశీలకులు అంటున్నారు.

ఆలేరులో పార్టీని తిరిగి బలోపేతం చేయాలంటే ముందుగా అంతర్గత విభేదాలకు తెరదించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం బీఆర్ఎస్ శ్రేణు ల్లో వ్యక్తమవుతోంది. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదిర్చి, పార్టీ కార్యక్రమాలకు ఒకే దిశానిర్దేశం ఉండేలా అధిష్టానం చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే నాయకత్వం మధ్య ఆధిపత్య పోరు ముదిరితే దాని ప్రభావం ఎన్నికల సమయంలో తీవ్రం గా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చి నేతలు కలిసి పనిచేస్తారా? లేక వర్గపోరు మరింత ముదిరి గులా బీ కంచుకోటను బలహీనపరుస్తుందా? అన్నది ఇప్పుడు ఆలేరు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

మొత్తంగా.. ఆలేరు బీఆర్ఎస్‌లో నెలకొన్న పరిణామాలు పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహానికి కీలక పరీక్షగా మారాయి. ఆధిపత్య పోరుకు త్వరగా తెరదించి క్యాడర్ను ఏకతాటిపైకి తీసుకురాగలిగితేనే నియోజకవర్గంలో పాత రాజకీయ బలాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉంటుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. లేకుంటే ప్రత్యర్థి కాంగ్రెస్కు మరింత రాజకీయ స్థలం కల్పించినట్టవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## మత్స్య సహకార సంఘం నిధుల అక్రమాలపై విచారణ

**ప్రజాపక్షం/అనంతగిరి** : వాయిలసింగవరం మత్స్య సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై గురువారం మత్స్య సహకార సంఘం ఆఫీసు నందు మత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్ సుజాత ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటు నాగార్జున లోగడ రెండుసార్లు విచారణకి హాజరు కాలేదు. అధ్యక్షుడు కంటు నాగార్జున హాజరు కాగా ఆయన ముందే అక్రమ లావాదేవీలపై విచారణ చేశారు. విచారణలో నేను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని కొంతమంది కావాలని నాపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. విచారణ అధికారుల ఎదుట తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని విచారణ అధికారులకు లేఖ ద్వారా తెలిపారు. అక్రమ లావాదేవీలపై సంఘమునకు సంబంధించిన రికార్డులను పరిశీలించి విచారించి తెలంగాణ హైకోర్టు పరిధిలో ఉన్నందున విచారణ రిపోర్టును హైకోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. సంఘంలో ఉన్న బైలా సభ్యులు 86 మంది కాగా కేవలం 17 మంది మాత్రమే హాజరయ్యారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అనంతగిరి ఎస్ఐ ఏడుకొండల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిఎఫ్ఓ మారయ్య, ఫీల్డ్ మెన్ ఉపేందర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# నిరంతరం భూ పోరాటాలు చేస్తోంది కమ్యూనిస్టులే

సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

హభుమకొండలో ఘనంగా సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభ



**ప్రజాపక్షం/హనుమకొండ:** భూమి సమస్యపై, రైతాంగ సమస్యల మీద నిరంతరం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని,అలాంటి వారిలో ముందున్న వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. బుధవారం భీమారం లోని ప్రొద్దుటూరు గార్డెన్స్ లో మల్లారెడ్డి సంతాప సభ సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన బీవీ రాఘవులు హాజరై మాట్లాడుతూ నీళ్ల గురించి పోరాటంచేసింది కమ్యూనిస్టులేనని, 1956లో సుందరయ్య అన్ని ప్రాంతాలు సస్య శ్యామలం కోసం తిరిగారని, ప్రాజెక్టు, కాలువలు కమ్యూనిస్టులు పోరాటం వల్ల వచ్చాయని అన్నారు.మల్లారెడ్డి గ్రామంలో సర్పంచ్ గా గెలిచి అన్ని సౌకర్యాలు కల్పించారని, కమ్యూనిస్టులు లేని ప్రాంతాలు వెనకబడి ఉన్నాయని,దక్షిణ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి అంటే కమ్యూనిస్టుల వలనేనని అన్నారు. మల్లారెడ్డి చివరి వరకు పార్టీ కోసం పని చేశారని, ప్రజల్లో ఉంటే ఆరోగ్యంగా ఉంటాం అని మల్లారెడ్డి ఎప్పుడూ చెబుతుండేవారని,ఆయన పోలీస్ పటేల్ గా ఉండి ప్రజలకు సేవచేయడం సాధ్యంకాదని కమ్యూనిస్టుగా మారాడని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటమే మల్లారెడ్డి జరిగి అర్పించే నిజమైన నివాళి అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ కేసులు, హత్యలు, నిర్బంధాలను తట్టుకొని నిలబడ్డారని, కుటుంబాన్ని పార్టీలో భాగం చేశారని, నిరంతరం అధ్యయనం చేసి సమాచారాన్ని ప్రజా సంఘాలకు అందించే వారని అన్నారు. శాసన సభలో ఏం మాట్లాడాలని అంశంపై సలహాలు, సూచనలు ఇచ్చే వారని,సాధారణ జీవితం గడిపారని,అందరితో స్నేహంగా వ్యవహరించి యువకుడిగా ఆలోచించే వాడని అన్నారు. రాజ్యాంగాన్ని దిక్కరించేలా పాలక వర్గాలు వ్యవహరిస్తున్నాయని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గం అని, అదే మార్గాన్ని మల్లారెడ్డి అనుసరించారని అన్నారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మేయర్ టి రాజేశ్వరరావు మాట్లాడుతూ చనిపోయేంతవరకు ప్రజల కోసం నిరంతరం తపించిన మనిషి సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లాలో సాగునీరు సాగునీరు కోసం రైతాంగ సమస్యల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన వ్యక్తిని జిల్లాలో ఇండ్లు లేని పేదలను సమీకరించి వేలాదిమంది పేదలకి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సారంపల్లి మల్లారెడ్డి స్ఫూర్తి అందరికీ ఆదర్శమని ఆయన బాటలో కొనసాగించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య పోతినేని సుదర్శన్ టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ నాయకులు, సిపిఐ సీనియర్ నాయకులు టి వెంకట్ రాములు, ఎన్.అశోక్ స్టాలిన్, సిహెచ్ రంగయ్య, వాసుదేవ రెడ్డి, రమేష్, చుక్కయ్య, బొట్ల చక్రపాణి, టి ఉప్పలయ్య, వెంకట్, తిరుపతి లతోపాటు వందలాది మంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## సిఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు.హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి



**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండలంలోని లింగాల గ్రామ పంచాయతీ పరిధిలోని లవ్వాల గ్రామానికి ప్రభుత్వం 12 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఈ మేరకు లబ్దిదారులకు మహిళా, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అదికారికంగా మంజూరు పత్రాలు అందజేసారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధానలక్ష్యమని,ప్రజాప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు.ఇండ్లు మంజూరైన లబ్దిదారులు సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, తాడ్వాయి ఎంపీడీవో తేజతో పాటు లబ్దిదారులు, గ్రామస్తులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గోన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన సంబరాలు



**ప్రజాపక్షం/హనుమకొండ:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ప్రజా రంజక పాలనలో విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలో సంబరాలు అత్యంత ఘనంగా, వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చౌరస్తాలో టపాసులు కాల్చారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అద్భుతమైన పాలన సాగిస్తోందని, గత పాలకుల నిరంకుశత్వానికి చరమగీతం పాడుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజా పాలనను ప్రజల చెంతకు చేర్చాం అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతులకు రుణమాఫీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలిపామని, ఈ 1000 రోజుల ప్రగతి ప్రస్థానం ముమ్ముందు కూడా ఇలాగే కొనసాగుతుంది అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్ రావు, అజీజ్ ఖాన్, విజయ్ కుమార్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ,డీసీసీ కమిటీల సీనియర్ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, మహిళా నాయకురాలులు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్రెగుట్టలో ఐఇడి పేలి ఒకరు మృతి



**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగురు):**వెంకటాపురం మండలం నూగురు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు ఐఈడీ బాంబు పేలుడులో మృతి చెందారు. నూగురు కాలనీకి చెందిన ఆరుగురు పామునూరు కొండపై వెదురు బొంగుల సెకరణకు మూడు రోజుల క్రితం వెళ్ళి బుదవారం తిరిగి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన బాంబుపై కాలు వేయడంతో భారీ పేలుడు సంభవించింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సహచరులు డోలీపై తీసుకువస్తుండగా పాలెం ప్రాజెక్ట్ సమీపానికి చేరుకునే సమాయానికి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చెపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**నివాళులర్పించిన భద్రాచలం ఎమ్మెల్యే:** విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వేంకట్రావు మండలానికి చేరుకుని మృతదేహాకి పూలమాల వెసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుమబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి: సిపిఐ



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల నాయకులు, గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో పారిశుధ్య, పరిశుభ్రత ఉండే విధంగా విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపించి చెత్తాచెదారం పేరుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో గ్రామంలో దోమల ఉధృతి పెరిగి సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా డెంగ్యూ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి గ్రామ సమస్యలు పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద రాములు, అజయ్, విష్ణు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టిన మొట్ట మొదటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం కాషాగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం చిన్నారుల మధ్య కూర్చొని వారితో ముచ్చటిస్తూ వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో 12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గారు, కలెక్టర్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులు ఆకలి ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆలోచించి విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన పౌష్టిక అల్పాహారం అందించడంతో పాటు చదువుపై విద్యార్థుల ఏకాగ్రత పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. వారంలో ఒక్కో రోజు ఒక్కో రకంగా బోండాలు, పూరీలు, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర అల్పాహారాన్ని విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు వచ్చి అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అల్పాహార పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. కాశగూడెం గ్రామానికి వస్తుంటే ఇరువైపులా పచ్చని వరి పొలాలు, కొండలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ తాజా ఆహారాన్ని వివిధ రకాల మెనూతో విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అల్పాహార పథకం ప్రారంభంతో విద్యార్థులకు పోషకాహారంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి సీతక్క హామీ

శుక్రవారం లక్నవరం జలాశయం నుంచి నీటి విడుదలకు భరోసా



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలోని రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు లక్నవరం జలాశయం నుంచి శుక్రవారం సాగునీటిని విడుదల చేయిస్తామని రైతులకు భరోసా కల్పించారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి సీతక్క ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ను కలిసి రైతుల సాగునీటి సమస్యను వివరించారు ప్రస్తుతం సాగు పనులు కొనసాగుతున్నందున లక్నవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ మెమొరాండం అందజేశారు రైతుల ఇబ్బందులను సానుకూలంగా విన్న మంత్రి సీతక్క వెంటనే స్పందించి శుక్రవారం జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయిస్తామని తెలిపారు రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రూ. కోట్లతో గోదావరి జలాల తరలింపు పనులు గోవిందరావుపేట మండల రైతులకు శాశ్వతంగా సాగునీటి సమస్య లేకుండా చేసేందుకు లక్నవరం జలాశయానికి గోదావరి జలాలను తరలించే పనులు రూ.33 కోట్లతో కొనసాగుతున్నాయని మంత్రి సీతక్క తెలిపారు పనులు పూర్తయితే రాబోయే రోజుల్లో మండలంలోని రైతులకు సాగునీటి కొరత ఉండదని పేర్కొన్నారు రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాగునీరు వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతుల కల్ప టనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు సాగునీటి సమస్యపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి హామీ ఇవ్వడంపై మండల కాంగ్రెస్ నాయకులు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఐ నేత కర్రె రామస్వామి మృతి పార్టీకి తీరని లోటు

హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇందిరా నగర్ సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా, సీనియర్ కార్యకర్తగా కర్రే రామస్వామి సేవలందించారని, రైతులు, వ్యవసాయ కూలీల, ప్రజా సమస్యలపై ఆయన నిరంతరం పోరాటం చేశారని, మెట్ట ప్రాంతానికి సాగునీరు కావాలని, అందరూ సమానంగా జీవించాలని ఉద్యమించిన వారిలో ఆయన ఒకరని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన పలు పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నకర్రే రామస్వామి మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రామస్వామి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శనగరం రాజకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, నిమ్మల మనోహర్, గడ్డం లలిత, ఆనందం, చంద్రయ్య, రాకేష్, సాంబరాజు, గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్క ఓటరునూ జాబితా నుండి తొలగించొద్దు



**ప్రజాపక్షం/జనగామ:** అర్హులైన ఒక్క ఓటరను జాబితా నుండి తొలగించకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పకడ్బందిగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి, ఎస్ఐఆర్ జనగామ జిల్లా అబ్జర్వర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. జిల్లాలో 95 శాతం మ్యాపింగ్ పూర్తి కావడం అభినందనీయమన్నారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి ఎసిడిడి కార్యదర్శి, జిల్లా అబ్జర్వర్ విజయేందిర బోయి సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా అమె జిల్లాలోని డు నియోజకవర్గాల వారిగా ఎస్ఐఆర్ పురోగతిని కలెక్టర్ ద్వారా తెలుసుకున్నారు. జిల్లాలో 23 మంది ఏఈఆర్ఓలు, 26 మంది అడిషనల్ ఎఈఆర్ఓలు విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటి వరకు లోఆ 63వేల 890 మందికి నోటీసులు జారీ చేయగా 69వేల 505 మందికి నోటీసుల డెలివరీ అయ్యాయని, 8వేల 388 కేసుల్లో హియరింగ్ నిర్వహించామని తెలిపారు. 29వేల 485 ల్యాప్స్ కేసులు కాగా 12వేల నో మ్యాపింగ్ కేసులు ఉన్నాయన్నారు. మండలా వారిగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ పురోగతిని తెలుసుకుంటూ అధికారులను వివిధ అంశాలపై అబ్జర్వర్ ప్రశ్నించారు. 2వేల 504 కేసులు జనరేట్ చేసినట్లు తహశీల్దార్లు వివరించారు. ఇప్పటి వరకు ఎన్ని హియరింగ్ కేసులు పిలిచారని ప్రశ్నించగా 638 కేసులు హియరింగ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ఇది అత్యంత కీలకమైన ప్రక్రియ అని అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుండి తొలగిపోకుండా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 95 శాతం మ్యాపింగ్ పూర్తి కావడం మంచి పురోగతి అని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఈ సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు జనగామ, గోపిరాం, కిరన్ ప్రకాష్, ట్రైనీ డిప్యూటి కలెక్టర్ తేజస్వీ, వెంకటరమణ, ప్రవీణ్, బి భాస్కర్, కె సమ్మయ్య, రవి, వెంకటమల్లయ్య,తో పాటు ఎన్నికల సూపరింటెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ రక్షణ చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, డిస్ట్రిక్ట్ హైవే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, హైవే పెట్రోలింగ్, అత్యవసర వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న 10 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లను రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పంచాయతీరాజ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్రాష్ బ్యారియర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, లైటింగ్ తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. అతివేగం, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు ముమ్మరం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ మనోహర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, జాతీయ రహదారుల ఈఈ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీదేవి, ఈడార్ డీఆర్ఎం లక్ష్మణ్, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంటపొలాల్లో డిజిటల్ సర్వే వేగవంతం

సర్వేను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ :** జిల్లాలో పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేందుకు పంటపొలాల్లో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం సంగెం మండలం రామచంద్రాపురం, దుగ్గొండి మండలం నాచినపల్లి, గిర్నిబావి గ్రామాల్లోని పంటపొలాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న డిజిటల్ సర్వే తీరును పరిశీలించారు. పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు, వాటి విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, డిజిటల్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పంటల డిజిటల్ సర్వే ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని, రైతులకు ప్రభుత్వ పథకాల అమలులో ఈ వివరాలు ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్శనలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డిబిసిడిఓ పుష్పలత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్రంతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టింది. ఇ.ఎం.ఐ టైటిల్‌తో న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఒ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తోంది.





## 'జయహో రామానుజ' పాట ఆవిష్కరణ

లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ. 'ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా..సుమన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 25న 'జయహో రామానుజ' సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో రిలీజ్‌కు రాబోతోంది. ఈ చిత్ర సాంగ్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిసి ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ రామానుజాచార్యుల వారి ఘనతను ఈ తరానికి తెలియజేయడంలో చినజీయర్ స్వామితో పాటు మా సాయి వెంకట్ కూడా అభినందనలు అందుకుంటున్నారు. ఆయన కావాలనుకుంటే ఏదైనా కమర్షియల్ సినిమా చేసి డబ్బులు సంపాదించుకోవచ్చు. కానీ మనుషులంతా ఒక్కటేననే సందేశాన్ని చాటిన మహనీయుడు రామానుజాచార్యుల వారి జీవిత కథను ఈ తరం వారికి చూపించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం అన్నారు. నటుడు, దర్శకుడు లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ కులం లేదు మతం లేదు మనుషులంతా ఒక్కటే, సమానమే అని చెప్పిన గొప్ప మహనీయుడు రామానుజాచార్యులు. ఈ సినిమా రూపొందిస్తున్న సమయంలో ఎన్నో అద్భుతాలు నా జీవితంలో జరిగాయి. టిటిడికి 20 లక్షల రూపాయలు విరాళం ఇవ్వగలిగాను అంటే అది రామానుజాచార్యుల వారి మహిమే. ఈ సినిమాను భారీ ప్రచారం చేసి ఘనంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ లో హై క్వాలిటీ తీసుకు వచ్చే ప్రయత్నంలో రిలీజ్ కాస్త ఆలస్యమైంది. అప్పట్లో బ్రాహ్మణులకు మాత్రమే దేవాలయాలకు ప్రవేశం ఉండేది. అలాంటి టైమ్‌లో ఒక ఆధ్యాత్మిక విప్లవం తీసుకొచ్చారు రామానుజాచార్యులు. మనుషులంతా ఒక్కటే కదా అలాంటప్పుడు మిగతా వారికి ఆలయ ప్రవేశం ఎందుకు లేదు అని ప్రశ్నించాడు, అందరిలో చైతన్యం తీసుకొచ్చాడు. అందరికీ ఓం నమో నారాయణ మంత్రాన్ని నేర్పించి, ఇక నుంచీ ప్రతి ఒక్కరు బ్రాహ్మణులే వైష్ణవులే అని చాటాడు. మా సినిమాను అక్టోబర్ 25న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరుతున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, నటి ప్రవల్లిక డైరెక్టర్ సముద్ర, ప్రొడ్యూసర్ రామసత్యానారాయణ, ప్రొడ్యూసర్ మోహన్ గౌడ్, యాదగిరిగుట్ట బోర్డ్ మెంబర్ డా లక్ష్మి నారాయణ, ఒబిసి కన్వీనర్ మల్లేష్, అన్నపూర్ణ, ప్రొఫెసర్ కిరణ్, శ్రీనివాస్, నిర్మాత మోహన్ గౌడ్, నటుడు రాంకీ, సత్యనారాయణ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే మూవీ



'రంభ ఊర్వశి మేనక' హీరో అల్లరి నరేష్

అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. రంభ మేనకా ఊర్వశి లాంటి సోషియో ఫాంటసీ కథల్లో మానవులు ఇంద్రలోకం, యముడి వద్దకు వెళ్తుంటారు. కానీ ఇందులో 'రంభ ఊర్వశి మేనక' స్వర్గం నుంచి కిందకు వస్తారు. ఇందులో కథానాయకుడికి చిన్నప్పటి నుంచి ఒక డ్రామా కంపెనీ ఉంటుంది.'రంభ ఊర్వశి మేనక'ను దేవతల్లా పూజిస్తుంటాడు. తనది కష్టపడకుండా హీరో అయిపోవాలనే క్యారెక్టర్. దేవతలు దీవిస్తే నెక్స్ట్ రాజమౌళి సినిమాలో తనే హీరో అనుకునే నమ్మకం ఉంటుంది. తన కుటుంబానికి ముత్తాతల నుంచి వస్తున్న ఒక పుస్తకం ఉంటుంది. అందులో ఒక ప్యాట్రన్ గీస్తే దేవతలు వచ్చి కోరికలు తీరుస్తారని నమ్మకం ఉంటుంది. హీరో ఆ ప్యాట్రన్ ఎలా గీశాడు? రంభ ఊర్వశి మేనక వచ్చిన తర్వాత ఎలాంటి సంఘటనలు జరిగాయనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. చాలా రోజుల తర్వాత మంచి కామెడీ ఎంటర్‌టైనర్ విన్నట్టుగా అనిపించింది. ప్రేక్షకులు కూడా నా నుంచి 'కితకితలు', 'బెండు అప్పారావు' లాంటి కామెడీ సినిమాలు మిస్ అవుతున్నారు. అలాంటి కథ గురించి చూస్తున్నప్పుడు దర్శకుడు చంద్ర మోహన్ చెప్పాడు. సీజీ వర్క్ పరంగా ఎక్కువ బడ్జెట్ అవుతుందని తెలిసినా మంచి సినిమా అవుతుందని మొదలుపెట్టాం. చంద్ర మోహన్ చాలా మంచి రైటర్ కూడా. ఈ కథని ఆయన చక్కగా రాసుకొని వచ్చారు. అలాగే నందు మంచి డైలాగ్స్ ఇచ్చారు. నాది చాలా ఎంటర్‌టైనర్‌గా ఉండే క్యారెక్టర్. అందరి దగ్గర అప్పులు చేసి ఉంటాడు. తనని ఎవరు ఊర్లో నమ్మరు. నా బడీ లాంగ్వేజ్ సరిపడే కామెడీని డైరెక్టర్ డిజైన్ చేశారు. అలాగే స్వర్గం, నరకం, ఇంద్రలోకం ఇలాంటి కథలు చూసి చాలా కాలం అయింది. కచ్చితంగా ఆడియన్స్, అలాగే చిన్నపిల్లలు చాలా ఎక్సైట్ అవుతారు. చాలా క్లీన్ కామెడీ ఇందులో ఉంటుంది. ఫ్యామిలీ అందరూ కలిసి చూసేలా ఈ సినిమా వుంటుంది. కామెడీ కూడా చాలా ఆర్గానిక్‌గా ఉంటుంది.ఆయన వాడే భాష చాలా సినిమాటిక్‌గా ఉంటుంది. సినిమాలో అందరూ మంచి కామెడీ టైమింగ్ ఉన్న యాక్టర్స్‌నే ఉన్నారు. ఫన్ అద్భుతంగా వచ్చింది. ప్రస్తుతానికి నా దృష్టి మొత్తం నటనపైనే ఉంది. నటుడిగా మంచి విజయవంతమైన చిత్రాలు చేయడం పైన నా దృష్టి ఉంది. మొన్నటి వరకు సీరియస్ ఫిలిమ్స్ చేశాను. ఇది మాత్రం చాలా మంచి కామెడీ ఎంటర్‌టైనర్. ఇది చాలా లైట్ హార్టెడ్ ఫిలిం. రెండున్నర గంటలు హాయిగా నవ్వుకుంటూ వెళ్ళండి.

## 'డియర్ హార్ట్' పోస్టర్ విడుదల




వారాహి ఆర్ట్స్ బ్యానర్ మీద బొబ్బాస్ సమర్పణలో రావి సౌజన్య నిర్మాణంలో లక్ష్మణ్ , రాధికా జోషి , సుప్రియా చవాన్ ప్రధాన పాత్రలుగా జెడి నరసింహ తెరకెక్కిస్తున్న చిత్రం 'డియర్ హార్ట్'. ఈ సినిమాలో సురేష్ గురు , పృధ్వీ రాజ్ , సత్య ప్రకాష్ , జబర్దస్త్ నూకరాజు , జగదీశ్వరి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను సాయి రాజేష్ రిలీజ్ చేశారు.'కొన్ని ప్రేమ కథలు కొన్ని రోజులు మాత్రమే గుర్తుంటాయి.. కానీ కొన్ని కథలు కాలం ఉన్నంత వరకూ గుర్తుంటాయి.. నువ్వు నాకు ఎదురైన ప్రతీసారి కాలం కూడా ఒక్క క్షణం ఆగిపోయి చూసేది.. నా చివరి శ్వాస వరకు.. నా గుండె కొట్టుకున్న ప్రతీసారి ఆ చప్పుడు చెప్పే ఒకే ఒక్క పేరు.. నీదే.. బతికుంటే నీ ప్రేమతో.. ఊపిరి ఆగితే నీ జ్ఞాపకాలతో.. ప్రతీ ప్రేమ కథ ముగింపు వరకు వెళ్లలేకపోవచ్చు.. కానీ నిజమైన ఎ ప్రేమ అయినా చరిత్రలో అలా గుర్తుండిపోవాల్సిందే.. మన ప్రేమలా' అంటూ సాగిన ఈ మూవీ మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. యూత్ ఫుల్ ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా రానున్న ఈ చిత్రానికి సాయి రాజేష్ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సినిమాకి అరవింద్. బి కెమెరా మెన్‌గా, ఎస్. సుహాస్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర అప్డేట్లను ప్రకటించనున్నారు.

## అక్టోబర్ 2న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'



వైవిధ్యమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు పొందిన స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్, ఇండస్ట్రీ హిట్ బాహుబలి మూవీని నిర్మించిన మేకర్స్‌తో పాటు సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతోన్న చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై తొలిసారి డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రేమలు చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఎస్.ఎస్. కార్తికేయ..ఇప్పుడీ ప్రెస్టీజియస్ ప్రాజెక్టును ఇండియన్ సినిమాకు గర్వకారణంగా నిలిచిన బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాతలైన ఆర్కా మీడియాతో కలిసి రూపొందిస్తున్నారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రానికి శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ కలసి ఈ ఆసక్తికరమైన, కంటెంట్‌రిచ్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే వినోదాన్ని పంచుతూ ఆసక్తిని రేకెత్తించిన టీజర్ తర్వాత మేకర్స్ 'కేకు వాకు' అనే వీడియో సాంగ్‌కు ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమాను వరల్ వైడ్‌గా అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. డబ్బు వర్షంలా కురుస్తుంది. దాన్ని చూసిన ఫహద్ ఆనందంతో ఆశ్చర్యపోతున్నారు. ఈ చిత్రం అక్టోబర్2న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## కొత్త నటీనటులతో 'ఇఎంఐ'



ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టింది. 'ఇ.ఎం.ఐ' టైటిల్‌తో న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఒ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తోంది. ఈ చిత్రానికి నిఖిల్ కువ్వరపు దర్శకత్వం వహిస్తున్నారు. లాల్ సలామ్, హాస్టల్ డేస్ వంటి పలు వెబ్ సిరీస్ లతో పేరు తెచ్చుకున్న దరహాస్ ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. లిటిల్ హార్ట్స్ సినిమాలో ఒ కీలక పాత్ర పోషించి ఫేమ్ అయిన శైలజ ఈ చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. పూజా కార్యక్రమాలతో 'ఇ.ఎం.ఐ' సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో ఆది సాయికుమార్ క్లాప్ ఇవ్వగా, డైరెక్టర్ సాయి మార్తాండ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమా దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ స్క్రిప్ట్ అందజేశారు.బైక్, కారు, మంచి ఫోన్..ఇలా ఏ వస్తువు కొన్నా ఇ.ఎం.ఐ కట్టాల్సిందే. దాదాపు ప్రతి మధ్య తరగతి ఇంటిలో ఇ.ఎం.ఐ కష్టాలు తప్పవని అనుకోవచ్చు. ఇలా ఇ.ఎం.ఐ మీద వస్తువులు తీసుకున్న యువత ఆ ఇ.ఎం.ఐలు కట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు అనే కాన్సెప్ట్‌తో హార్ట్ టచింగ్ ఎమోషన్స్‌తో పాటు కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలోని ప్రతి సీన్ యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ కనెక్ట్ అయ్యేలా ఉండబోతోంది. ఈ చిత్రాన్ని పక్కా ప్లానింగ్‌తో నిర్మించి భారీ స్థాయిలో పబ్లిసిటీకి కూడా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో పాటు 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రాన్ని నిర్మించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన కాస్ట్ అండ్ క్రూ వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇకపై మంచి కాన్సెపట్స్‌తో బ్యాక్‌టు బ్యాక్ మూవీస్ చేసేందుకు 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ ప్లాన్స్ చేస్తోంది.

## బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల భద్రతే ప్రధానం

సింగరేణి సిఎండి బుద్ధ ప్రకాశ్ జ్యోతి




ప్రజాపక్షం/హైదరాబాద్ : బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ప్రమాదరహిత సింగరేణి కోసం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం జరిగిన 50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.డిజిఎంఎస్ అధికారులు, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో గనుల భద్రతపై చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఈ సందర్భంగా సిఎండి సూచించారు. కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాలు తగ్గడం అభినందనీయమని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ అన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఒకే బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని సూచించారు. సిబ్బంది కొరత, భద్రతా శిక్షణ, వైద్య సేవలు, నాణ్యమైన బూట్లు, స్పేర్ పార్ట్స్ అందుబాటుపై కార్మిక సంఘాలు చేసిన సూచనలను అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చారు. ముందుగా ఇటీవలి ప్రమాదాలలో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్. తిరుమల రావు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ ,మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, ఏరియాజనరల్ మేనేజర్లు, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు, డిజిఎంఎస్ నుంచి డాక్టర్ ఐ. సత్యనారాయణ, రాజ్ కుమార్, కె మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మిని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షురాలుగా నియమితులవ్వడంతో ఆమె మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసింది. దీంతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరేళ్ల శారదను నియమించారు.

## బర్తరఫ్

(మొదటి పేజీ తరువాయి)

సిఎస్ ద్వారా అధికారికంగా సిఫారసు లేఖను పంపించారు. కొండా సురేఖ కుమార్తె సిఎంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆ తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సిఫారసులకు, చివరికి బర్తరఫ్‌కు దారితీశాయి. కాగా, కొండాను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు సిఎం చేసిన సిఫారసుకు ఆమోదం లభించింది. గురువారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో లోక్‌భవన్‌లో భేటీ అయ్యారు. అనంతరం కొండా బర్తరఫ్‌ను ఆమోదిస్తున్నట్లు లేఖ వెలువడింది. మరోవైపు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డిని ఆ పదవి నుంచి ముఖ్యమంత్రి తొలగించారు.

### వివాదానికి దారితీసిన అంశాలు

ఇటీవల పరకాల నియోజకవర్గం పరిధిలోని గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ తన వివరణలో కుమార్తె చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయవద్దని ఆమె పార్టీ క్రమశిక్షణ కమిటీని కోరారు. అయితే ఈ వివరణపై పార్టీ నాయకత్వం సంతృప్తి చెందలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది.

### చిన్నారెడ్డి వ్యవహారంపైనా చర్చ

మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి వ్యవహారం కూడా అధిష్టానం దృష్టికి వెళ్లింది. వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దీనిపై కూడా టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరింది.

సురేఖ, చిన్నారెడ్డి ఇద్దరూ తమ వివరణలను సమర్పించగా, టిపిసిసి వాటిని విశ్లేషించి అధిష్టానానికి నివేదిక పంపించింది. ఈ వ్యవహారంపై గత రెండు రోజులుగా సిఎం రేవంత్రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీ అధిష్టానంతో చర్చలు జరిపినట్లు సమాచారం. టిపిసిసి నాయకత్వం, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కూడా క్రమశిక్షణ చర్యలకు అనుకూలంగా ఉండటంతో అధిష్టానం తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

### అధిష్టానం కఠిన వైఖరి

2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండా సురేఖ వ్యవహారం గతంలోనూ పలు సందర్భాల్లో వివాదాస్పదమైంది. అయితే తాజా పరిణామాల్లో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీ నాయకత్వంపై బహిరంగంగా లేదా పరోక్షంగా వ్యాఖ్యలు చేయడం, అంతర్గత విభేదాలు బహిర్గతం కావడం వంటి అంశాలకు అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతోనే అధిష్టానం చర్యలు చేపట్టినట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంటున్నారు.

## ఇడి పంజా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దృష్టి సారించింది. గురువారం ఉదయం ఆమె నివాసంతో పాటు సంబంధిత వ్యక్తులు, అనుబంధ స్థావరాలు కలిపి మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఈడి అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. నీతూబాయి, ఆమె అనుచరులపై గతంలో ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసులను ఆధారంగా చేసుకుని ఈడి మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. గంజాయి అక్రమ విక్రయాల ద్వారా సమకూరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్బు ఎక్కడికి మళ్లింది? ఎలాంటి ఆస్తులు కొనుగోలు చేశారు? ఇతర వ్యక్తులు లేదా సంస్థల ఖాతాల ద్వారా లావాదేవీలు జరిగాయా? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. గంజాయి దందా ద్వారా వచ్చిన అక్రమ సొమ్ములో కొంత మొత్తాన్ని హవాలా మార్గంలో తరలించినట్లు ప్రాథమిక దర్యాప్తులో అనుమానాలు ఉన్నాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లు, ఇతర రికార్డులను ఈడి అధికారులు పరిశీలించినట్లు సమాచారం. అక్రమంగా సంపాదించినట్లు అనుమానిస్తున్న సొమ్మును స్థిరాస్తులు, ఇతర ఆస్తుల్లో పెట్టుబడిగా మార్చారా? కుటుంబ సభ్యులు లేదా అనుచరుల పేర్లపై ఆస్తులు కొనుగోలు చేశారా? అనే కోణంలోనూ ఈడి దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. సోదాల్లో లభించిన పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది.

## ముడిపడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

అని సెప్టెంబర్ 2 నాటి లేఖలో ఖర్గే పేర్కొన్నారు. 'నా ప్రస్తావనకు స్పందిస్తూ మీరు సభలో లేచి ఇలా అన్నారు: 'ఖర్గేజీ చెప్పిన విషయం నిజంగా చాలా బాధాకరమైనది. ఇది కాంగ్రెస్ పార్టీకే కాదు, మనందరికీ బాధాకరమైన విషయం. జరిగిన దానిపై కచ్చితంగా విచారణ జరుగుతుంది. భారతీయ జనతా పార్టీ ఇలాంటి చర్యలను ఎప్పుడూ సమర్థించదని నేను చెప్పదలుచుకున్నాను. నేను దీనిని ఖండిస్తున్నాను, మా జాతీయ అధ్యక్షుడు కూడా దీనిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. మీ మనోభావాలకు కలిగిన బాధ మా అందరికీ విచారకరం' అని ఖర్గే గుర్తు చేశారు. విచారణ తర్వాత దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ కూడా ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసినట్లు ఖర్గే పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి 24 రోజులు గడిచినప్పటికీ, హల్ద్వానిలో జరిగిన ఈ దుర్మార్గపు చర్యలో పాల్గొన్న సంస్థలు, వ్యక్తులపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం ఆశ్చర్యకరమని ఖర్గే అన్నారు. ఈ ఘటనలో అత్యంత అభ్యంతరకరమైన విషయం ఏమిటంటే తాను ప్రసంగించిన రామ్‌లీలా మైదాన్ స్థలంలో భారత రాజ్యాంగ స్ఫూర్తికి, మానవ విలువలకు విరుద్ధంగా 'శుద్ధి' కార్యక్రమం నిర్వహించారని, ఈ శుద్ధి ప్రక్రియ నేరుగా అంటరానితనంతో ముడిపడి ఉందని సాధారణంగా భావిస్తారు అని నడ్డాకు రాసిన హిందీ లేఖలో ఖర్గే పేర్కొన్నారు. 'ఈ సమస్య నా వ్యక్తిగత విషయానికో లేదా కాంగ్రెస్ అధ్యక్ష పదవికో పరిమితమైనది కాదని నేను స్పష్టంగా చెప్పదలుచుకున్నాను; ఇది ప్రతిరోజూ ఈ కఠిన వాస్తవికతను ఎదుర్కొంటున్న కోట్ల మంది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉంది. ఇలాంటి తప్పులు చేసేవారికి తగిన గుణపాఠం చెప్పడం చాలా అవసరం' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. కాబట్టి, ఈ ఆగ్రహం కేవలం తనది మాత్రమే కాదు, ఆ కోట్ల మంది ప్రజల భావనలకు ప్రతిరూపమని, ఇది సమాజంలోని ఒక నిర్దిష్ట వర్గాన్ని నేరుగా ప్రభావితం చేసే మనస్తత్వానికి సంబంధించిన విషయం అని ఆయన పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడిన ఖర్గే, గత నెలలో హల్ద్వానిలో తన ర్యాలీ జరిగిన ప్రదేశంలో నిర్వహించిన 'శుద్ధి' కార్యక్రమం అంటరానితనం చర్య అని పేర్కొన్నారు. ఈ విషయంపై తమ పార్టీ రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను ఆశ్రయిస్తుందని చెప్పారు. ఈ విషయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా మౌనం వహించడంపై ఖర్గే ప్రశ్నించారు, ఏదైనా చెడు జరిగినప్పుడు వారు మౌనంగా ఉంటారని ఎద్దేవా చేశారు. ఇటువంటి 'శుద్ధి' చర్యలకు వ్యతిరేకంగా గళమెత్తాలని, శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టాలని ఖర్గే ప్రజలకు పిలుపునిచ్చారు.దళితులు, మహిళలు, విద్యార్థుల తరపున గళమెత్తినందుకు గాంధీని ప్రశంసిస్తూనే, ఉత్తరాఖండ్‌లో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు బిజెపి ఖర్గే తీవ్రంగా విమర్శించారు.

## ఆ అధికారం మీకెక్కడిది?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న నిర్ణయంపై ప్రధాన న్యాయమూర్తులు సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేస్తూ, ఈ ఉత్తర్వును జారీ చేసింది. 'మా అభిప్రాయం కింద, ఏ అడ్వకేట్స్ చట్టం, 1961 కింద అయితే బిసిఐ చట్టబద్ధంగా సృష్టించబడిందో, ఆ చట్టం న్యాయశాస్త్ర విద్యార్థులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం బిసిఐకి గానీ, ఏదైనా రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు గానీ స్పష్టంగా లేదా పరోక్షంగా ఏమాత్రం లేదని మేం భావిస్తున్నాం. సదరు చట్టం కింద న్యాయశాస్త్ర పట్టభద్రుడిని న్యాయవాదిగా నమోదు చేసిన తర్వాతే అటువంటి అధికారం లభిస్తుంది. విద్యార్థుల విషయానికి వస్తే వారి మాతృ సంస్థ లేదా అటువంటి సంస్థ నిబంధనలు ఉప నిబంధనల కింద నిర్దేశించబడిన అధికార సంస్థ మాత్రమే క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు అర్హతను కలిగి ఉంటాయి'అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. విస్తృత విమర్శల నేపథ్యంలో ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లో ఆ రెండు నోటిఫికేషన్లను బిసిఐ ఉపసంహరించుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. నల్సార్ వివాదానికి సంబంధించి బిసిఐ జారీ చేసిన రెండు నోటిఫికేషన్లను బెంచ్ పక్కన బెట్టింది. ఆగస్టు 13నాటి అన్ని కమ్యూనికేషన్లు లేదా సవరించిన కమ్యూనికేషన్లు చట్ట బద్ధమైన అధికారం లేకుండా ఉన్నాయని మేం ప్రకటిస్తున్నాం. మధ్యంతర ఆదేశాలను ఖరారు చేస్తున్నాం' అని పూర్వ విద్యార్థులు మిహిషా సూర్, అభిషేక్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతానికి, నల్సార్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోకూడదని, ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, ఆగస్టు 13న బిసిఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా జారీ చేసిన ఆదేశాలను వారు సవాల్ చేశారు.అయితే, ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ ఆ ప్రకటన జారీ చేసిన కొన్నిగంటల్లోనే దానిని ఉపసంహరించుకున్నారు. విచారణ సందర్భంగా, న్యాయ విద్యార్థుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ తన వాదన వినిపిస్తూ బిసిఐ చైర్మన్ తన ఆదేశాలను ఉపసంహరించుకున్నప్పటికీ, వాటిని జారీ చేసిన విధానంపై విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇది విశ్వవిద్యాలయంలో వాక్ స్వాతంత్ర్యానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్న అని, ఇది కేవలం ఒక విద్యార్థికి సంబంధించిన విషయం మాత్రమే కానేకాదని, ఇది మొత్తం విశ్వవిద్యాలయం వ్యాప్తంగా వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నిషేధించడానికి సంబంధించినదని పరమేశ్వర్ వాదించారు. సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) చైర్‌పర్సన్ మిశ్రా మాట్లాడుతూ ఆ ఆదేశాల లేఖలను జారీ చేసిన గంటలోపే వాటిని ఉపసంహరించుకున్నామని, ఇప్పుడు ఈ విషయాన్ని ముగించాలని ధర్మాసనాన్ని కోరారు.

## స్మార్ట్ రేషన్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోళ్ళ వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి రంగదాముపల్లి చెరువు అభివృద్ధితో పాటు జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి చేసి సాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఎండపల్లి మండలంలో 9,900 రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎండపల్లి గ్రామానికి 33 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఎండపల్లి గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎండపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం తో పాటు ఎస్సీ కమిటీ హాల్ పూర్తి చేస్తానని మంత్రి ఈ హామీ ఇచ్చారు. ఎండపల్లిలో ఎక్స్ ప్రెస్ బస్సు ఆపే చర్యలు తీసుకుంటామని జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం సునీత, జగిత్యాల అడిషనల్ కలెక్టర్,కలెక్టర్ లతో పాటు జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్ వివిధ శాఖల అధికారులు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com